సోమవారం 31-10-2022

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 219


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'బౌన్స్' ముందు బోల్తా
పెర్త్‌లో భారత్ పరాజయం..5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు - 12లో



సొంతంగా షేర్ల బదిలీ
ఆఫ్ మార్కెట్ బదిలీలకు పలు మార్గాలు.. సీడీఎస్ఎల్ పరిధిలో సులభం - 13లో




ఎయిర్‌క్రాఫ్ట్ ప్లాంట్‌కు శంకుస్థాపన
వడోదరాలో రూ.22 వేల కోట్ల విలువైన సి-295 ఎయిర్‌క్రాఫ్ట్ ప్లాంట్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.
వివరాలు 6లో



ప్రజాస్వామ్యాన్ని రక్షించండి
దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సీజేఐ జస్టిస్ యు.యు లలిత్‌కు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు.
వివరాలు 6లో



పెరిగిన వాయు కాలుష్యం
పక్క రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనంతో దేశ రాజధాని న్యూఢిల్లీలో 26 శాతం వాయు కాలుష్యం పెరిగింది.
వివరాలు 6లో



తొక్కిసలాటలో 151 మంది మృతి
దక్షిణ కొరియా హాలోవీన్ తొక్కిసలాటలో 151 మందికి పైగా మృతి చెందారు. మృతుల్లో అత్యధికులు టీనేజ్ వారే.
వివరాలు 6లో

గుజరాత్‌లో ఘోరం


మచ్చూ నదిపై తెగి కుప్పకూలిన కేబుల్ బ్రిడ్జి

91 మంది మృతి

- ప్రమాద సమయంలో బ్రిడ్జిపై 400 మంది
- 100 మీటర్ల ఎత్తు నుంచి పడిపోయిన వైనం
- 100 మందికి పైగా గల్లంతైనట్టు అనుమానం
- 140 ఏళ్ల నాటి బ్రిడ్జి, ఇటీవలే మరమ్మతులు
- పటిష్టతపై అసెంబ్లీలోనూ సభ్యుల ప్రశ్నలు
- పునఃప్రారంభమైన 4 రోజులకే పెను విషాదం

మోర్బీ/న్యూఢిల్లీ: మాటలకందని మహా విషాదం. సెలవు రోజున నదిపై జరిపిన సరదా విహారం ప్రాణాంతకంగా మారిన వైనం. గుజరాత్ రాష్ట్రం మోర్బీ జిల్లాలోని మోర్బీ పట్టణంలో ఆదివారం సాయంత్రం 6.30 సమయంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మణి మందిర్ సమీపంలో మచ్చూ నదిపై ప్రఖ్యాత పర్యాటక ఆకర్షణ అయిన 140 ఏళ్ల నాటి పురాతనమైన వేలాడే తీగల వంతెన ప్రమాదవశాత్తూ తెగి కుప్పకూలిపోయింది. దాంతో వంతెన రెండుగా విడిపోయింది. ఆ సమయంలో వంతెనపై మహిళలు, చిన్నారులతో సహా 400 మందికి పైగా ఉన్నట్టు సమాచారం. వారిలో చాలామంది 100 మీటర్ల ఎత్తు నుంచి హాహాకారాలు చేస్తూ నదిలోకి పడిపోయారు. ఆ విసురుకు 100 మందికి పైగా గల్లంతయ్యారు. 91 మందికి పైగా నీట మునిగి దుర్మరణం పాలైనట్టు సమాచారం. ప్రమాదం గురించి తెలిసి సహాయక చర్యలు మొదలవడానికి కనీసం గంట సమయం పట్టింది. అప్పటికే అత్యధికులు నిస్సహాయంగా అసువులు బాశారు. మృతుల్లో ఎక్కువమంది మహిళలు, పసివాళ్లేనని తెలుస్తోంది. ప్రమాదంలో చాలామంది గాయపడ్డారు. వారిలో పలువురు నదిలోకి కుంగిపోయిన వంతెనపై వేలాడుతూ కాపాడండంటూ ఆక్రందనలు చేశారు. పైకెక్కేందుకు విశ్వప్రయత్నం

మిగతా 6వ పేజీలో ▶


వంతెన కూలిన అనంతరం ప్రాణాలను కాపాడుకోవడానికి సందర్శకుల యాతన

7 నెలల పాటు రిపేర్లు.. 26వ తేదీనే రీ ఓపెన్

బ్రిటిష్ హయాంలో కట్టిన ఈ పాదచారుల వంతెనను ఇంజనీరింగ్ అద్భుతంగా చెబుతుంటారు. దీనికి ఇటీవలే మరమ్మతులు చేశారు. రూ.2 కోట్లతో 7 నెలలకు పైగా పనులు జరిగాయి. ఈ సందర్భంగా వంతెన ఏ మేరకు సురక్షితమన్న అంశం గుజరాత్ అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చింది. దీని పటిష్టతపై పలువురు ఎమ్మెల్యేలు అనుమానం వ్యక్తం చేయగా అంతా బాగానే ఉందని ప్రభుత్వం బదులిచ్చింది. గుజరాతీ నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 26వ తేదీన రీ ఓపెన్ చేసి సందర్శకులను అనుమతిస్తున్నారు. మరమ్మతుల తర్వాత వంతెనకు మున్సిపాలిటీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇంకా అందలేదని అధికారులు తెలిపారు.



ప్రాధాన్య పనులు వేగంగా

'గడప గడప'లో గుర్తించిన సమస్యలకు పరిష్కారం

- 15,163 అత్యంత ప్రాధాన్యత పనులు మంజూరు
- 1,697 సచివాలయాల్లో 8,248 పనులు ప్రారంభం
- వైఎస్సార్ నిర్మాణ పోర్టల్ ద్వారా సిమెంట్ కొనుగోలు
- ప్రతి గురువారం కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వేగం పుంజుకుంది. ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు సచివాలయాల సందర్శన సందర్భంగా అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన పనులకు నిధులు మంజూరు చేసి ప్రారంభించడంలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ వరకు 3,120 సచివాలయాల పరిధిలో రూ.624 కోట్ల విలువైన ప్రాధాన్యత పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటివరకు 17,107 గుర్తించగా 15,163 అత్యంత ప్రాధాన్యత పనులను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటికే 1,697 సచివాలయాల పరిధిలో 8,248 పనులు ప్రారంభమయ్యాయి. వీటికి అవసరమైన సిమెంట్‌ను వైఎస్సార్ నిర్మాణ పోర్టల్ ద్వారా రాయితీపై కొనుగోలు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్‌శర్మ ఆదేశించారు. ప్రాధాన్యత పనులను చేపట్టేందుకు సచివాలయాలకు రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.3,000.88 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన పనుల మంజూరు, ప్రారంభంపై సీఎస్ సమీర్ శర్మ ప్రతీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

విశాఖను రాజధాని చేయాల్సిందే



వికేంద్రీకరణే ధ్యేయంగా ఏర్పడిన నాన్ పొలిటికల్ జేఏసీకి ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉత్తరాంధ్ర ప్రజలు విశాఖను పరిపాలన రాజధానిగా కోరుకుంటున్నారని.. అది జరిగితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సంఘం నేతలు తెలిపారు.
వివరాలు 2లో ▸

అగ్రగామి పారిశ్రామిక కేంద్రంగా 'అనకాపల్లి'



దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక కేంద్రంగా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. అనకాపల్లి మండలం కోడూరు పంచాయతీ పరిధిలో పారిశ్రామిక పార్క్, ఆటోనగర్‌ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి పార్క్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు.
వివరాలు 3లో ▸

రేపు కర్నూలులో మిలియన్ మార్చ్



సీఎం వైఎస్ జగన్ ప్రతిపాదించిన మూడు రాజధానులకు మద్దతుగా మంగళవారం కర్నూలులో మిలియన్ మార్చ్ నిర్వహించనున్నారు. ఈ మార్చ్‌లో విద్యార్థులు, యువజనులు, లాయర్లు, విద్యా వేత్తలు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని రాయలసీమ జేఏసీ(నాన్ పొలిటికల్) చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.
వివరాలు 2లో ▸





డిజిటల్ వైద్యంలో ఏపీనే ఫ్రంట్ రన్నర్

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది

- రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 1.50 కోట్ల మందికి హెల్త్ ఐడీలు సృష్టి
- డిజిటల్ వైద్య సేవల్లో వెనుకబడిన రాష్ట్రాలకు ఏపీని సంప్రదించాలని సూచిస్తున్నాం
- ఆర్థిక లావాదేవీలకు యూపీఐ తరహాలో వైద్య సేవలకు యూహెచ్ఐ
- 'సాక్షి' ఇంటర్వ్యూలో నేషనల్ హెల్త్ అథారిటీ డైరెక్టర్ కిరణ్‌గోపాల్ వాస్క



సాక్షి, అమరావతి: 'ప్రజలకు డిజిటల్ వైద్య సేవలు అందించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఫ్రంట్ రన్నర్‌గా ఉందని.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ) డైరెక్టర్ కిరణ్ గోపాల్ వాస్క అన్నారు. ఈ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా ఏపీ ఈ ఘనత సాధించడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. దేశ ప్రజలకు డిజిటల్ వైద్య సేవలు అందించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) కార్యక్రమం తదితర అంశాలను 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఏపీని సంప్రదించాలని చెబుతున్నాం

ప్రజలకు డిజిటల్ వైద్య సేవలు అందించడంలో భాగంగా ఇప్పటివరకూ ఏపీలో సుమారు 3.50 కోట్ల మందికి హెల్త్ ఐడీలు సృష్టించారు. అదే విధంగా ఆస్పత్రులు, వైద్యులు, వైద్య సిబ్బందిని ఏబీడీఎంలో రిజిస్టర్ చేయడంలో, హెల్త్ ఐడీలకు

మిగతా 2వ పేజీలో ▶

అమరావతిలో అందరికీ ఆవాసం

900.97 ఎకరాల భూమిని కేటాయించిన ప్రభుత్వం

- మంగళగిరి, తుళ్లూరు మండలాల్లో ఐదు గ్రామాలు ఎంపిక.. సామాన్యుడి కోసం సీఆర్‌డీఏ చట్ట సవరణ
- మాస్టర్ ప్లాన్ మార్పుతో ఆర్–5 జోన్ ఏర్పాటు
- విపక్షాలు విషం చిమ్మినా పేదల పక్షానే ప్రభుత్వం



సాక్షి, అమరావతి: సామాన్యులకూ ఇకపై అమరావతి ప్రాంతంలో ఇల్లు కట్టుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే సౌలభ్యాన్ని ప్రభుత్వం చట్ట ప్రకారం కల్పించింది. అక్కడ బయటి వారు నివసించకుండా న్యాయ వివాదాలతో అడ్డుకుంటున్న విపక్షాల కుట్రలను ఛేదిస్తూ మంగళగిరి, తుళ్లూరు మండలాల్లోని 5 గ్రామాల్లో 900.97 ఎకరాలను

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణలో సీబీఐకి 'నో ఎంట్రీ'

- సాధారణ సమ్మతిని ఉప సంహరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- రెండు నెలల కిందే రహస్యంగా జీవో 51 జారీ
- రాష్ట్రంలో సీబీఐ దాడులు, దర్యాప్తు చేసే అధికారానికి కత్తెర
- అవసరమైతే ప్రతి కేసుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని నిబంధన.. ఎమ్మెల్యేలకు ఎర కేసుపై హైకోర్టులో విచారణ నేపథ్యంలో జీవో బహిర్గతం
- విపక్షాలపై దాడులకు సీబీఐ, ఈడీ, ఐటీలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు

10లో

Confederation of Indian Industry

అంతర్జాతీయ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా..

- నవంబర్ 18న మారిటైమ్ సదస్సు
- డిసెంబర్‌లో అగ్రి, ఎంఎస్ఎంఈ, నైపుణ్య రంగాలపై సమావేశాలు
- విశాఖ వేదికగా ఫిబ్రవరిలో అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సు

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విశాఖ వేదికగా జరిగే అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును విజయవంతం చేసేందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ఇందులో భాగంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ)తో కలిసి రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్న కీలక రంగాలపై భారీ సదస్సులను నిర్వహించనున్నాయి. రాష్ట్రంలో 974 కి.మీ. మేర తీరప్రాంతం

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



అదే పద్ధతిలో మనవాళ్లు కూడా విరాళాలు సేకరించడానికి వెళుతున్నారు!



గ్రామ, వార్డు సచివాలయ
ఉద్యోగులకు ఈహెచ్ఎస్

2లో

- హెల్త్‌కార్డుల జారీ కోసం ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోకి గ్రామ, వార్డు సచివాలయ శాఖ లేఖ
- ఒకేసారి లక్షమందికిపైగా ఉద్యోగుల వ్యవహారం కావడంతో ఈహెచ్ఎస్‌కు ప్రత్యేక కసరత్తు
- ఇటీవలే సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు చేసిన ప్రభుత్వం

భూ రికార్డుల స్వచ్ఛీకరణ వేగవంతం

రీ సర్వే నేపథ్యంలో పక్కా ప్రణాళిక

- డ్రోన్ సర్వేకు ముందే రికార్డుల ప్రక్షాళన తప్పనిసరి
- రెవెన్యూ యంత్రాంగానికి గడువు నిర్దేశించిన ప్రభుత్వం




సాక్షి, అమరావతి: భూముల రీ సర్వే నేపథ్యంలో భూ రికార్డుల స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్స్) కార్యక్రమం వేగంగా జరుగుతోంది. వైఎస్సార్ జగనన్న భూరక్ష, శాశ్వత భూ హక్కు పథకం కింద వందేళ్ల తర్వాత నిర్వహిస్తున్న రీ సర్వేలో రికార్డుల స్వచ్ఛీకరణ అత్యంత కీలకం కావడంతో ప్రభుత్వం దానిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తయితేనే ఆయా గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుంది. అంటే రీ సర్వే ప్రారంభానికి ముందే గ్రామాల్లో భూ రికార్డులను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. వెబ్‌ల్యాండ్ అడంగల్స్‌ను ఆర్ఎస్ఆర్‌తో పోల్చి చూడటం, అడంగల్‌లో పట్టాదారుని వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో చూసి సరిచేయడం వంటి పనులు పక్కాగా చేయాలి. ఈ పనిని కింది స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం చేయాలి. రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తయిన గ్రామాల్లోనే రీ సర్వేలో మొదట నిర్వహించే డ్రోన్ ఫ్లైయింగ్‌ను సర్వే బృందాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. అందుకే ప్రభుత్వం రికార్డుల స్వచ్ఛీకరణపై ఫోకస్ పెట్టింది. మొత్తంగా 17,564 గ్రామాలను

మిగతా 2వ పేజీలో ▶

ప్రతి నెలా సమీక్ష

స్వచ్ఛీకరణ ఎలా చేయాలనే దానిపై రెవెన్యూ శాఖ ఆరు సర్క్యులర్లు జారీ చేసింది. ఒక్కో సర్క్యులర్ ప్రకారం ఒక్కో దశను పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటి ప్రకారం స్వచ్ఛీకరణ ఎంత మేరకు జరిగిందనే దానిపై ప్రతి నెలా కలెక్టర్లు, జేసీలతో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాల వారీగా ఎన్ని గ్రామాల్లో ఆరు రకాల సర్క్యులర్‌ల ప్రకారం పని జరిగిందో పరిశీలిస్తూ తగిన సూచనలు చేస్తున్నారు.



వరద తగ్గినా శ్రీశైలంలో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి

- తీరు మార్చుకోని తెలంగాణ జెన్‌కో.. రెండురోజుల్లోనే 5 టీఎంసీలు దిగువకు
- ఆ జలాలు సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ మీదుగా కడలిలోకి.. విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని వృథా చేయకపోతే రెండో పంటకూ సరిపడా నీరు

2లో

క్లుప్తంగా

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్

- హెల్త్‌కార్డుల జారీకోసం ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోకి గ్రామ, వార్డు సచివాలయ శాఖ లేఖ
- ఒకేసారి లక్షమందికిపైగా ఉద్యోగుల వ్యవహారం కావడంతో ఈహెచ్‌ఎస్‌కు ప్రత్యేక కసరత్తు
- ఇటీవలే సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) పరిధిలోకి తీసుకొస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డుల జారీప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కమిషనర్ కార్యాలయం మూడురోజుల కిందట ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవోకి లేఖ రాసింది. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాలుగు నెలల్లోనే.. ఒకేసారి రికార్డుస్థాయిలో 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను సృష్టించి వాటిని భర్తీ చేసిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం.. అర్హులైన సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వం ఇటీవలే ప్రొబేషన్‌ను ఖరారు చేసింది. ఇప్పుడు ఒకేసారి లక్షమందికిపైగా ఉద్యోగులను ఈహెచ్‌ఎస్ పరిధిలోకి తీసుకొస్తోంది. అర్హులైన సచివాలయాల ఉద్యోగులందరికీ ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఈహెచ్‌ఎస్ కార్డుల జారీకి గ్రామ, వార్డు సచివాలయశాఖ చర్యలు చేపట్టింది.

ఆంధ్రజ్యోతి కథనం అవాస్తవం

- జూలై వరకు ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,790 కోట్ల చెల్లింపు
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులు సరిగా జరగడంలేదంటూ ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురించిన కథనం అవాస్తవమని ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది జూలై వరకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు క్లెయిమ్స్ చెల్లించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2022–23 సంవత్సరానికి విడుదల చేసిన ఆయుష్మాన్ భారత్ నిధుల్ని నెట్‌వర్క్ ఆస్పత్రులకు వినియోగించారనేది సత్యదూరమని పేర్కొన్నారు. ఇప్పటివరకు నేషనల్ హెల్త్ ఏజెన్సీ నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,790 కోట్లు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించిందని తెలిపారు. ఈహెచ్‌ఎస్‌కు సంబంధించి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.199.5 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఈహెచ్‌ఎస్ కింద ఈ ఏడాది ఇప్పటివరకు 3,25,390 మంది చికిత్స పొందారని వివరించారు.

అర్హులందరికీ ఉచిత విద్యుత్

- పథకాన్ని ఎత్తేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలన్న సీఎం జగన్ నిర్ణయం సమర్థంగా అమలవుతోంది. ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితమేనని మూడేళ్ల కిందట ప్రభుత్వం ప్రకటించింది. పథకం ద్వారా లబ్ధిపొందేందుకు 22,31,549 మంది వినియోగదారులు అర్హత పొందారు.

అక్రమాలకు చెక్

ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించేవారు, ఆధార్ అనుసంధానం చేసినప్పుడు కులధ్రువీకరణ తప్పుగా చేసినవారి విద్యుత్ కనెక్షన్లు మాత్రమే ఈ పథకానికి అనర్హమైనవిగా పరిగణిస్తున్నట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు వెల్లడించాయి. అర్హులైనవారు ఈ పథకాన్ని వినియోగించుకోవడం కోసం విద్యుత్, గ్రామ సచివాలయ అధికారులకు ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఇంధనశాఖ అధికారులు సూచిస్తున్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మొద్దంటున్నారు.

భూ రికార్డుల స్వచ్ఛీకరణ వేగవంతం

▶ మొదటి పేజీ తరువాయి


మూడు కేటగిరీలుగా విభజించి స్వచ్ఛీకరణ చేయిస్తున్నారు.

అనంతపురంలో నూరు శాతం పూర్తి

అనంతపురం జిల్లాలోని మొత్తం 504 గ్రామాల్లోనూ రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తయింది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 315 గ్రామాలకు గాను.. 314 గ్రామాల్లో స్వచ్ఛీకరణను పూర్తి చేశారు. చిత్తూరు జిల్లాలో 846 గ్రామాలకు గాను 835 గ్రామాల్లోను, సత్యసాయి జిల్లాలో 461 గ్రామాలకు గాను 455 గ్రామాల్లో స్వచ్ఛీకరణ పూర్తయింది. విశాఖ, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో స్వచ్ఛీకరణ నెమ్మదిగా జరుగుతుండటంతో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రీ సర్వే షెడ్యూల్‌కు అనుగుణంగా భూ రికార్డుల స్వచ్ఛీకరణను పూర్తి చేసేందుకు గడువును నిర్దేశించారు. దాని ప్రకారం ఆరు రకాల సర్క్యులర్ ప్రకారం రికార్డులను అప్‌డేట్ చేసే పని వేగంగా జరుగుతోంది. తద్వారా రీ సర్వే కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం సర్వే బృందాలు వడివడిగా నిర్వహిస్తున్నాయి.

యథేచ్ఛగా తెలంగాణ విద్యుదుత్పత్తి

శ్రీశైలం ప్రాజెక్ట్‌లో తీరు మార్చుకోని తెలంగాణ జెన్‌కో



సాక్షి, అమరావతి : శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణా వరద ప్రవాహం తగ్గినా తెలంగాణ జెన్‌కో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేస్తోంది. దీంతో రెండురోజుల్లోనే శ్రీశైలం నుంచి ఐదు టీఎంసీలు ఖాళీ అయ్యాయి. ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలంలో నీటినిల్వ 883.9 అడుగుల్లో 209.15 టీఎంసీలకు తగ్గిపోయింది. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటినిల్వ గరిష్ఠస్థాయిలో ఉండటంతో ఆ జలాలన్నీ ప్రకాశం బ్యారేజ్ మీదుగా వృథాగా సముద్రంలో కలిశాయి. విద్యుదుత్పత్తి చేయకపోతే రెండు రాష్ట్రాల్లోను కృష్ణా బేసిన్ ఆయకట్టుకు రెండో పంటకూ నీళ్లందించవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ జెన్‌కో తీరుతో రెండు రాష్ట్రాలకు నష్టమేనని చెబుతున్నారు. విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణ జెన్‌కోను అడ్డుకోవడంలో కృష్ణాబోర్డు మరోసారి విఫలమైందని పేర్కొంటున్నారు. విభజన చట్టం ప్రకారం శ్రీశైలం, సాగర్, పులిచింతలలో సాగు, తాగునీటికే మొదటి ప్రాధాన్యత. సాగు, తాగునీటి కోసం కృష్ణాబోర్డు కేటాయించిన నీటిని దిగువకు విడుదల చేసేటప్పుడు.. విద్యుత్కేంద్రాల ద్వారా విడుదల చేసి విద్యుదుత్పత్తి చేసుకోవాలన్నది నిబంధన. శ్రీశైలంలోకి శుక్రవారం సాధారణ స్థాయికి తగ్గిన వరద ప్రవాహం శనివారం మరింత తగ్గింది. శనివారం ప్రాజెక్టులో 885 అడుగుల్లో 215.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద ప్రవాహం తగ్గిన నేపథ్యంలో విద్యుదుత్పత్తిని ఆపేయాల్సి ఉంది.

దిగువన అవసరాలు లేకపోయినా..

నాగార్జునసాగర్‌లో గరిష్ఠ సామర్థ్యం మేరకు 312.05 టీఎంసీల నీరు, పులిచింతలలో గరిష్ఠ స్థాయిలో 41 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రకాశం బ్యారేజ్‌లోకి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో కృష్ణా డెల్టాకు విడుదల చేస్తూ, మిగిలిన నీటిని కడలిలోకి వదిలేస్తున్నారు. దిగువన నీటి అవసరాలు లేకపోవడంతో ఇటు ఏపీ ప్రభుత్వంగానీ, అటు తెలంగాణ ప్రభుత్వంగానీ శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయాలని కృష్ణాబోర్డుకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు. దీంతో కృష్ణాబోర్డు నీటి కేటాయింపులు చేయలేదు. కానీ తెలంగాణ జెన్‌కో మాత్రం బోర్డు నుంచి అనుమతి తీసుకోకుండానే విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేస్తుండటంతో ఆ జలాలు వృథాగా కడలిలో కలుస్తున్నాయి.

రెండు రాష్ట్రాలకు తీవ్ర నష్టం

తెలంగాణ జెన్‌కో నీటిని వృథా చేస్తుండటం వల్ల ఆంధ్రప్రదేశ్‌కే కాదు.. తెలంగాణకు కూడా నష్టమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విద్యుదుత్పత్తి చేయకుండా నీటిని సద్వినియోగం చేసుకుంటే కృష్ణా బేసిన్‌లో రెండో పంటకూ నీళ్లందించవచ్చని, రైతులకు ప్రయోజనం చేకూర్చవచ్చునని చెబుతున్నారు. తెలంగాణ జెన్‌కో తీరు వల్ల శ్రీశైలం ఖాళీ అవుతుందని, అప్పుడు సాగునీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిలభ్యత, వినియోగాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన కృష్ణాబోర్డు ప్రేక్షకపాత్ర వహిస్తుండటం వల్లే తెలంగాణ జెన్‌కో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ నీటిని కడలిపాలు చేస్తోందని మండిపడుతున్నారు.

శ్రీశైలానికి తగ్గిన వరద ప్రవాహం

నాగార్జున సాగర్‌లో రెండు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో శ్రీశైలానికి నీటి రాక తగ్గింది. దీంతో రేడియల్ క్రస్ట్‌గేట్లను మూసివేశారు. ఆదివారం సాయంత్రానికి జూరాల, సుంకేసుల నుంచి 48,263 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. కాగా, విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా నాగార్జున సాగర్‌కు 66,852 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా.. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 6,500 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులను వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 208.7210 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 883.80 అడుగులకు చేరింది. మరోవైపు నాగార్జున సాగర్ జలాశయం నుంచి ఆదివారం రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయ నీటిమట్టం 589.90 అడుగుల వద్ద ఉంది.

మూడు రాజధానులకు మద్దతుగా విద్యార్థి భేరి నేడు

చోడవరం: మూడు రాజధానులకు మద్దతుగా అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణంలో మూడు రాజధానుల సాధన పోరాట సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థి భేరి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో 10 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని అంచనా. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కాండ్రేగుల డేవిడ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పట్టణంలోని గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం కాలేజీ గ్రౌండ్‌లో సభ జరుగుతుందని తెలిపారు. ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ లజపతిరాయ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్, ఉత్తరాంధ్ర జేఏసీ ప్రతినిధులు, ప్రొఫెసర్లు, వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

రేపు కర్నూలులో మిలియన్ మార్చ్



మాట్లాడుతున్న కోనేటి వెంకటేశ్వర్లు, చిత్రంలో ప్రజా సంఘాల నాయకులు, మేధావులు

- కర్నూలుకు న్యాయ రాజధాని సాధనే లక్ష్యం
- మూడు రాజధానులకు మద్దతుగా భారీ ర్యాలీ
- రాయలసీమ జేఏసీ (నాన్ పొలిటికల్) చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు
- సీమ ఉద్యమకారులు, మేధావులు, ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన మూడు రాజధానులకు మద్దతుగా మంగళవారం కర్నూలులో మిలియన్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు రాయలసీమ జేఏసీ(నాన్ పొలిటికల్) చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఈ మార్చ్‌లో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువజనులు, లాయర్లు, విద్యా వేత్తలు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కర్నూలులోని బీఏఎస్ కల్యాణ మండపంలో ఆదివారం రాజధాని వికేంద్రీకరణకు మద్దతుగా విద్యార్థి, ప్రజా సంఘాలు, సీమ ఉద్యమకారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తక్షణమే కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని వారంతా డిమాండ్ చేశారు. అమరావతి, విశాఖపట్నంలలో బెంచ్‌లు లేకుండా హైకోర్టును పూర్తిగా ఇక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. అంతేగాక ఏడాదికి ఒక సెషన్ అసెంబ్లీ సమావేశాలను కర్నూలులో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని పూర్తిగా నమ్ముతున్నామని, తక్షణమే సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడి న్యాయ రాజధానిని కర్నూలుకు తరలించాలని కోరారు. సీమ ఉద్యమకారుడు నాగేంద్ర మాట్లాడుతూ మూడు రాజధానులను ఏర్పాటు చేసి అమరావతి, కర్నూలు, విశాఖపట్నంలను ఫ్రీజోన్‌లుగా ప్రకటించాలని, అప్పుడు ఉద్యోగాల్లో అన్ని ప్రాంతాలకూ సమాన హక్కులు దక్కుతాయన్నారు.

టీడీపీనే అడ్డుకుంటోంది..

దాదాపు 70 ఏళ్ల తర్వాత శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అభినందిస్తున్నామని కర్నూలు బార్ అసోసియేషన్ సీనియర్ నేత ఓంకార్ తెలిపారు. అయితే 2014లో రాష్ట్రం విడిపోయిన సందర్భంలో రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరినా.. అప్పటి టీడీపీ నేతలు పట్టించుకోలేదని, ఇప్పుడు హైకోర్టు ఏర్పాటు చేస్తుంటే మాత్రం.. రాజధాని కావాలని అడగాలంటూ రెచ్చగొడుతున్నారని, అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయంతో అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు.

విశాఖను రాజధాని చేయాల్సిందే

- వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యం
- జేఏసీకి మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్ల మద్దతు
- అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ వెల్లడి
- మత్స్యకారుల జీవితాలూ బాగుపడతాయి: లజపతిరాయ్

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : పరిపాలన వికేంద్రీకరణే ధ్యేయంగా ఏర్పడిన నాన్ పొలిటికల్ జేఏసీకి ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ప్రకటించారు. ఫిషింగ్ హార్బర్ ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జేఏసీ కన్వీనర్ ఆచార్య హనుమంతు లజపతిరాయ్, కోకన్వీనర్ దేవుడు మాస్టర్, మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ నాయకుడు పెంటయ్య మాస్టర్‌తో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ రాజధానికి అన్ని వర్గాలు, పార్టీలు, ప్రాంతాల మద్దతు తెలియజేయాలన్నారు. మత్స్యకారుల అభివృద్ధి విశాఖ రాజధానితో ముడిపడి ఉందన్నారు. జేఏసీ తలపెట్టిన కార్యక్రమాలకు మత్స్యకారులు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు విశాఖను పరిపాలన రాజధానిగా కోరుకుంటున్నారని.. అది జరిగితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని మెజార్టీ ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. మూడు రాజధానులవల్ల రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయన్నారు. గత ప్రభుత్వం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో హాచింగ్ ఫెస్టివల్ పేరుతో రూ.వందల కోట్లు వృథా చేసిందని జానకీరామ్ అన్నారు.

ఉద్యమానికి ఊపిరి : లజపతిరాయ్

ఉత్తరాంధ్ర జేఏసీ చైర్మన్ ఆచార్య హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ.. జేఏసీ ఉద్యమానికి మత్స్యకారులు సంఘీభావం తెలపడం సంతోషమన్నారు. ఉద్యమానికి మత్స్యకారుల మద్దతు ఊపిరినిచ్చిందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే మత్స్యకారుల జీవితాలు బాగుపడతాయన్నారు. విశాఖ పరిపాలన రాజధానితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టంచేశారు. ఎటువంటి సౌకర్యాల్లేని ప్రాంతాల్లో రాజధాని ఏర్పాటు చేస్తే ఏం లాభంలేదన్నారు. జేఏసీ కోకన్వీనర్ దేముడు మాస్టర్ మాట్లాడుతూ.. మత్స్యకార నాయకులు పరిపాలన రాజధానిగా విశాఖకు మద్దతు తెలపడాన్ని అభినందిస్తున్నానన్నారు. ఈ సమావేశంలో మత్స్యకార సంఘాల నాయకులు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యుడు, రోగికి మధ్య దూరం తగ్గింది

ఎన్‌హెచ్‌ఏ డైరెక్టర్ కిరణ్ గోపాల్

సాక్షి, అమరావతి : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్య రంగంలో వస్తున్న మార్పులతో వైద్యుడు, రోగి మధ్య దూరం తగ్గిందని నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) డైరెక్టర్ కిరణ్ గోపాల్ వాస్క అన్నారు. టెలి మెడిసిన్ ద్వారా అవుట్ పేషెంట్ (ఓపీ) సేవల మాదిరిగానే ఇన్ పేషెంట్ సేవలను అందించేలా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వహించిన కార్యక్రమంలో కిరణ్ గోపాల్ మాట్లాడారు. వైద్యుడు, రోగులకు మధ్య దూరాన్ని మరింత తగ్గించడంతోపాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడం కోసం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)ను ప్రభుత్వం ప్రారంభించిందని ఆయన తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు రోగులకు చేసిన చికిత్స వివరాలను వారి డిజిటల్ హెల్త్ ఖాతాల్లో నమోదు చేయాలన్నారు. రాష్ట్ర వైద్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు డిజిటల్ వైద్య సేవలు అందించడంలో సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం చురుగ్గా అడుగులు వేస్తోందన్నారు.

అమరావతిలో అందరికీ ఆవాసం

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్‌–5 జోన్‌గా చట్ట ప్రకారం ఏర్పాటు చేసింది. ఆర్థికంగా వెనుకబడ్డ ప్రజలంతా ఎలాంటి ఆంక్షలు లేకుండా గృహాలను నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చట్టం చేసింది. ఈ మేరకు కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు, మందడం, ఐనవోలు గ్రామాలను కొత్త జోన్ పరిధిలోకి తెచ్చింది. 2020లోనే ఈ ప్రాంతంలో సామాన్యులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా విపక్షాలు న్యాయ వివాదాలు సృష్టించాయి.

చట్ట ప్రకారమే 5 శాతం

సీఆర్‌డీఏ చట్టం 2014 సెక్షన్‌–53 (డి) ప్రకారం మొత్తం విస్తీర్ణంలో ఐదు శాతం భూమిని ల్యాండ్ పూలింగ్ కింద పేదల నివాసాలకు కేటాయించవచ్చు. అందుకోసం స్థానిక సంస్థలు లేదా ప్రత్యేకాధికారుల అనుమతితో మాస్టర్ ప్లాన్ లేదా జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌కు తగినట్లుగా మార్పులు చేయవచ్చు. ఆ ప్రకారమే ఆర్‌–5 జోన్ ఏర్పాటు కానుంది. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు 15 రోజులు గడువిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, కాలుష్య రహిత కార్యకలాపాలు లాంటి వాటిని పది అంతర్గత జోన్లుగా పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో పాటించే నిబంధనలను గెజిట్‌లో పొందుపరిచింది.

పేదలకు మేలు జరిగితే సహించని 'ఈనాడు'

నిరుపేదలు, ఆర్థికంగా వెనుబడినవారికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 35 లక్షలకు పైగా ఇళ్ల పట్టాలను అందచేసింది. సొంతిల్లు లేనివారు ఉండరాదనే ఉద్దేశంతో అన్ని నియోజకవర్గాలు, పట్టణాలు, పంచాయతీల్లో సైతం ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తెచ్చింది. ఆయా ప్రాంతాల్లో సొంతిల్లు లేనివారు దరఖాస్తు చేసుకుంటే ఎప్పుడైనా నిబంధనల మేరకు స్థలం కేటాయించేలా ఉత్తర్వులిచ్చింది. ఇదే విధానాన్ని అమరావతి ప్రాంతంలోనూ అనుసరించనుంది. శాసన రాజధానిలో సామాన్యులు సైతం కాలు మోపేలా అవకాశం కల్పిస్తుంటే సహించలేని 'ఈనాడు' విషం కక్కుతోంది.

సీఎం జగన్ పేదల పక్షపాతి



పేదలు నివసించలేని రాజధాని అందరి రాజధాని ఎలా అవుతుంది? అన్ని వర్గాలకు చోటు కల్పించినప్పుడే అది అందరి రాజధాని అవుతుంది. ముఖ్యమంత్రి జగన్ ఎల్లప్పుడూ పేదల పక్షాన ఉంటానని మరోసారి నిరూపించారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలను అడ్డుకుంటే అది మూర్ఖత్వమే.

– రెటూరి కిషోర్, సీనియర్ న్యాయవాది (మంగళగిరి)

అన్ని వర్గాలుండాలి



ప్రజా రాజధాని అంటే అన్ని వర్గాల ప్రజలుండాలి. కోటీశ్వరుడి నుంచి కూటి కోసం తిప్పలు పడే వారి వరకు అందరికీ చోటివ్వాలి. ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతాలో అన్ని వర్గాల ప్రజలున్నారు. అమరావతిలో మాత్రం పేదలు వద్దని టీడీపీ నేతలు అనడం అన్యాయమే. ఆర్‌–5 జోన్ ఏర్పాటు మంచి నిర్ణయం.

– వై.జయరాజు, న్యాయవాది (కర్నూలు)

అణగారిన వర్గాలకు పెద్దపీట..



అణగారిన వర్గాలకు పెద్దపీట వేసేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతం. టీడీపీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం, దోపిడీ కోసమే వేలాది ఎకరాలను లాక్కున్నారు. కనీసం సాగు భూమిని వదిలివేయాలన్న ఆలోచన కూడా లేకుండా భూ దాహంతో వ్యవహరించారు. రాజధాని అంటే సంపన్న వర్గాలకే కాకుండా అణగారిన వర్గాలకు కూడా చోటు కల్పించాలి.

– చెన్నంశెట్టి చక్రపాణి (విశ్రాంత ఎస్పీ, న్యాయవాది)

సామాజిక న్యాయం అంటే ఇదీ..



రాజధాని అంటే అన్ని వర్గాల ప్రజలు నివసించేదిలా ఉండాలి. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందని అనడం ఒక్క వర్గం ప్రజలపై వివక్ష చూపడమే అవుతుంది. సీఎం జగన్ ప్రభుత్వం అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ చట్ట సవరణ చేయడం గొప్ప పరిణామం. – మునగాల మల్లేశ్వరరావు, రాజకీయ నేత, మంగళగిరి

సముచిత నిర్ణయం



పేదల కోసం సీఆర్‌డీఏ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆహ్వానిస్తున్నాం. ప్రాంతం ఏదైనా అన్నిచోట్లా అందరికీ జీవించే హక్కు ఉంటుంది. ఆర్థిక స్తోమతను బట్టి ఫలానా వ్యక్తులు మాత్రమే ఉండాలనడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షాన ఆలోచించి సముచిత నిర్ణయం తీసుకుంది.

– ఏలూరి సుబ్రహ్మణ్యం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాకినాడ

పేదల పక్షపాతి



అర్హులైన పేదలకు అమరావతి ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించడం సరైన నిర్ణయం. దీన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ కోర్టులకెక్కి అడ్డుకుంది. పేదలకు న్యాయం చేకూర్చాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ ముందడుగు వేశారు. పేదల పక్షపాతిగా మరోసారి రుజువు చేసుకున్నారు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్(రాయదుర్గం)

హర్షిస్తున్నాం..



అమరావతిని ఒక సామాజిక వర్గానికే పరిమితం చేస్తూ టీడీపీ సర్కారు సీఆర్‌డీఏ చట్టంలో పలు నిబంధనలు పెట్టి స్వార్థపూరితంగా వ్యవహరించింది. సీఎం జగన్ 900.97 ఎకరాలను పేదల నివాసానికి కేటాయించడం హర్షించదగ్గ విషయం. అమరావతిలో పేదల కోసం మరిన్ని సంస్కరణలు తేవాలి. – చింతా కృష్ణయ్య, సీనియర్ న్యాయవాది, ధర్మవరం

తప్పిదాన్ని సరిదిద్దారు..



రాజధాని ప్రాంతంలో పేదలకు చోటు కల్పించకుండా కులవాదులు అంతా ఏకమయ్యారు. పేదలకు స్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందని కోర్టుల్లో కేసులు వేశారు. చారిత్రక తప్పిదాన్ని సీఎం జగన్ సరిచేశారు. పేదలు, బడుగులకు 900 ఎకరాలు కేటాయించడం గొప్ప విషయం. అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ఇది దారి తీస్తుంది.

– మాదిగాని గురునాథం, సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు (విజయవాడ)

సామాజిక సమతుల్యత సాకారం



అమరావతిలో టీడీపీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే సీఎం జగన్ పేదలకు 900 ఎకరాలకుపైగా కేటాయించటం సంతోషకరం. ఇకపై పేదలు, మధ్య తరగతి, సామాన్య వర్గాలు సైతం అమరావతి మా రాజధాని అనే చెప్పుకునేలా సీఎం తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది. సామాజిక సమతుల్యత స్పష్టంగా కనిపిస్తోంది.

– పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్, మాజీ అధ్యక్షుడు

గొప్ప విషయం..



అమరావతి ప్రాంతంలో బయటివారు నివాసాలు ఏర్పాటు చేసుకోరాదని టీడీపీ కోర్టుల్లో కేసులు పెట్టింది. రాష్ట్రంలో ప్రజలు ఎక్కడైనా స్వేచ్ఛగా స్థలం కొని ఇల్లు కట్టుకునేలా జగనన్న ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతిపక్షం కోర్టులకు వెళ్లడం సిగ్గుచేటు.

– రామాంజనేయులు, డీసీసీబీ డైరెక్టర్, బ్రహ్మసముద్రం

డిజిటల్ వైద్యంలో ఏపీనే ఫ్రంట్ రన్నర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజల ఆరోగ్య రికార్డులను అనుసంధానించడం ఇలా అన్ని అంశాల్లో ఏపీ మంచి పనితీరు కనబరుస్తోంది. ఈ క్రమంలో డిజిటలైజేషన్‌లో వెనుకబడిన రాష్ట్రాలకు ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నాం. ఏపీ వైద్యశాఖను సంప్రదించి వారు అవలంబిస్తున్న విధానాలను మిగిలిన రాష్ట్రాల్లో పాటించాలని తెలియజేస్తున్నాం.

రికార్డులను అనుసంధానించడం కీలకం

ప్రతి ఒక్కరికీ హెల్త్ ఐడీలు సృష్టించడం ముఖ్యమే. అయితే, సృష్టించిన హెల్త్ ఐడీలకు ఆయా ప్రజల ఆరోగ్య రికార్డులను అనుసంధానించడం కూడా అంతే కీలకం. లేదంటే ఏబీడీఎం కార్యక్రమం లక్ష్యం నెరవేరదు. ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేయడం ప్రజలకు ఎంతో ఉపయోగకరం. ప్రతిఒక్కరి ఆరోగ్య చరిత్ర ఒక్క క్లిక్‌తో ప్రపంచంలో ఎక్కడి నుంచి అయినా పొందవచ్చు. 25,37,01,350 మందికి ఇప్పటివరకూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్స్ చేయగా, 2,30,36,463 మంది అకౌంట్స్‌కు మాత్రమే రికార్డులు లింక్ చేశారు. మరోవైపు.. ప్రైవేట్ ఆస్పత్రులు, వైద్యులు కూడా ఏబీడీఎంలో రిజిస్టర్ కావడాన్ని తప్పనిసరిచేసే ఆలోచన ఉంది. తమ వద్ద చికిత్స పొందే రోగులు, వారికి చేసిన చికిత్స వివరాలను గోప్యంగా ఉంచాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు భావించడం సరికాదు.

యూపీఐ తరహాలో యూహెచ్ఐ

ఇక చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం యూపీఐ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇదే తరహాలో వైద్య, ఆరోగ్య సేవల కోసం యూహెచ్ఐ విధానాన్ని కేంద్రం తెచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులు, వారి ఆరోగ్య వివరాలు, చికిత్స, వైద్య పరీక్షలు, వైద్యుడు సూచించిన మందులు.. ప్రతీది యూహెచ్ఐలో నమోదవుతుంటాయి. 'ఆరోగ్యసేతు' యాప్‌ను వైద్యసేవలకు వన్‌స్టాప్ సొల్యూషన్‌గా తీర్చిదిద్దుతున్నాం. కరోనా సమయంలో ప్రజలకు సేవలు అందించిన ఈ యాప్‌లో మరిన్ని మార్పులు చేశాం. త్వరలో దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఈ యాప్‌తో పాటు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఓఆర్ఎస్) పోర్టల్ కూడా యూహెచ్ఐ పరిధిలోకి రాబోతోంది. ఓఆర్ఎస్ అనేది ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అపాయింట్‌మెంట్ సిస్టమ్ కోసం దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రులను అనుసంధానించే వేదిక. ఆధార్‌కు లింక్ అయిన రోగి మొబైల్ నంబర్ ద్వారా వివిధ ఆసుపత్రుల్లో అపాయింట్‌మెంట్‌ను సులభతరంగా పొందవచ్చు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే పీఆర్టీయూ మద్దతు

సాక్షి, అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులకే తాము కూడా మద్దతు ఇస్తామని పీఆర్టీయూ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో ఆదివారం పీఆర్టీయూ రాష్ట్ర కార్య నిర్వాహకవర్గ సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్(ఉత్తరాంధ్ర), వెన్నపూస రవీంద్రరెడ్డి (పశ్చిమ రాయలసీమ), పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి (తూర్పు రాయలసీమ)కి వైఎస్సార్ సీపీ మద్దతు ప్రకటించిందని, తాము కూడా వారికే మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, వి.కరుణానిధిమూర్తి తెలిపారు. టీచర్లకు సంబంధించిన పలు అంశాలపై తీర్మానాలు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పీఆర్టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భైరి అప్పారావ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు హోం మంత్రి పరామర్శ

సాక్షి, అమరావతి: రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను హోంశాఖ మంత్రి తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. ఇటీవల మంత్రి సురేష్‌కు మోకాలు శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్లో ఉన్న సురేష్‌ను హోం మంత్రి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పలకని పవన్!

- విలేకరుల సమావేశంలో మౌన ప్రేక్షకుడిగానే
- జగనన్న కాలనీల్లో సోషల్ ఆడిట్ చేస్తామన్న నాదెండ్ల

సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఈసారి విలేకరుల సమావేశంలో పూర్తి ప్రేక్షక పాత్ర వహించారు. మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పవన్‌కళ్యాణ్ అధ్యక్షతన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ నేతల సమావేశం జరిగింది. అనంతరం అరగంటకుపైగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవన్‌కళ్యాణ్ వేదికపై మౌనంగా కూర్చోగా, పార్టీ నేత నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. ఒక దశలో పవన్‌ను మాట్లాడాలంటూ నాదెండ్ల సైగ చేస్తూ మైక్ జరిపినా స్పందించేందుకు నిరాకరించారు.

3 రోజులు జనసేన సోషల్ ఆడిట్..

నవంబరు 12, 13, 14వతేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీలలో జనసేన తరపున సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని నాదెండ్ల మనోహర్ తెలిపారు. పార్టీ నేతలు మూడు రోజుల పాటు జగనన్న కాలనీలను సందర్శించి ఇళ్ల నిర్మాణంపై నివేదిక ఇస్తారని చెప్పారు. పవన్‌కళ్యాణ్ ఏదో ఒక ప్రాంతంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 26 జిల్లా కేంద్రాల్లోనూ 'జనవాణి' కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

విభూతి పట్టీ దాచిన కాణిపాకం అర్చకుడిపై వేటు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఉప ప్రధాన అర్చకుడు ధర్మేశ్వర్ గురుకుల్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆగస్టు 21న ఆలయ మహా కుంభాభిషేకం రోజున వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు చెందిన నారాయణి అమ్మన్ రూ.17 లక్షల విలువైన విభూతి పట్టీని కాణిపాకం వినాయకునికి విరాళంగా అందించారన్నారు. ఈ పట్టీని ఎవరికీ తెలియకుండా అర్చకుడు బీరువాలో దాచిపెట్టినట్టు తెలిపారు. రెండు నెలల తర్వాత దాత రశీదు కోసం అడిగే వరకు ఆలయ అధికారులకు విషయం తెలియలేదని వెల్లడించారు. విభూతి పట్టీ కోసం ప్రశ్నించిన తర్వాతే అర్చకులు వాస్తవం బయటపెట్టారన్నారు. ఈ మేరకు విరాళం వచ్చిన రోజున విధులు నిర్వర్తించిన అర్చకులకు మెమోలు జారీ చేశామని తెలిపారు. అనంతరం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు విచారణ జరిపించి ధర్మేశ్వర్ గురుకుల్‌ను సస్పెండ్ చేసినట్టు వివరించారు. అలాగే పలువురు ఆలయ అధికారులకు కూడా సోమవారం సాయంత్రంలోపు వివరణ ఇవ్వాలని మెమోలు జారీ చేశామన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

కాగా, కాణిపాకం ఆలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న కరుణాకర్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానికి రూ.300 టికెట్లు పొంది అధిక రేట్లకు విక్రయిస్తూ పట్టుబడిన కరుణాకర్‌పై వేటు వేశామన్నారు. ఇందుకు సంబంధించి ఏఈవోపైనా విచారణ జరుగుతోందన్నారు .

నవంబర్ నుంచి ఉచిత బియ్యం

ఆంధ్రజ్యోతి కథనాన్ని ఖండించిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

- రాష్ట్రంలో నాన్ సార్టెక్స్ నిల్వలు లేనందున ఆలస్యం
- ప్రస్తుతం ఎఫ్‌సీఐ ద్వారా మండల స్టాక్ పాయింట్లకు బియ్యం రవాణా
- కేంద్రం ఉచిత బియ్యాన్ని కేటాయిస్తోంది.. సరిపడా నిల్వలు అందించట్లేదు
- ఎక్కడా లేనివిధంగా ఏపీలో సార్టెక్స్ బియ్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నాం
- ప్రజలను తప్పుదోవపట్టించే రాతలు మానుకోవాలి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై-7) కింద నవంబర్ నుంచి జనవరి వరకు ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఉచిత బియ్యం ఊసెత్తరేం' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. రేషన్ డోర్ డెలివరీ విధానం ద్వారా ఇంటి వద్దకే నాణ్యమైన (సార్టెక్స్) బియ్యం పంపిణీచేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం పీఎంజీకేఏవై కింద నాన్-సార్టెక్స్ బియ్యాన్ని మాత్రమే ఇస్తోందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఉచిత బియ్యం పంపిణీకి నాన్ సార్టెక్స్ నిల్వలు లేనందున మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా అందించాలని, అక్టోబర్ నుంచి కాకుండా నవంబర్ నుంచి పంపిణీ చేసేలా అనుమతించాలంటూ ఈ నెల 21న కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్రం రాష్ట్రానికి 3.24 లక్షల టన్నుల బియ్యాన్ని విడుదల చేయాలని ఎఫ్‌సీఐని ఆదేశించిందన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సీఐ నుంచి జిల్లాల్లోని మండల స్టాక్ పాయింట్లకు బియ్యం రవాణా జరుగుతోందన్నారు. వచ్చేనెల నుంచి జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోకి వచ్చే కార్డుదారుల్లోని ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యం అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

గతంలో బియ్యం ఇవ్వని కేంద్రం..

ఇక ఆరో విడత ఉచిత బియ్యం పంపిణీని ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు కేంద్ర పొడిగించగా రాష్ట్రానికి అవసరమైన బియ్యం పంపిణీని విస్మరించిందన్నారు. నాన్ సార్టెక్స్ నిల్వలు లేనందున, అందుబాటులో ఉన్న సార్టెక్స్ బియ్యం కేవలం రెగ్యులర్ పీడీఎస్‌లో పంపిణీ చేసేందుకు సరిపోతాయని, ఎఫ్‌సీఐ నుంచి బియ్యం విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వమే నాన్ సార్టెక్స్ బియ్యాన్ని సొంతంగా సేకరించి ఆగస్టు, సెప్టెంబర్‌లో పంపిణీ చేసిందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం పేదలకు ఆరు విడతల్లో 25 నెలల పాటు ఉచిత బియ్యం ఇస్తే.. రాష్ట్రం సొంతంగా 19 నెలల పాటు మానవతా దృక్పథంతో కేంద్రంతో సమానంగా స్టేట్ కార్డుదారులకు కూడా బియ్యాన్ని అందించిందన్నారు. ఇందుకోసం ఏకంగా రూ.5,700 కోట్లు ఖర్చుచేసిందని అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఉచిత బియ్యం పంపిణీ ఇలా..

రాష్ట్రంలో 4.23 కోట్ల మంది రేషన్ లబ్ధిదారులు ఉంటే కేంద్రం కేవలం 2.68 కోట్ల మందికి మాత్రమే ప్రతినెలా బియ్యం అందిస్తోందని అరుణ్‌కుమార్ తెలిపారు. మిగిలిన కార్డులకు రాష్ట్రమే సొంతంగా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. ఉచిత బియ్యం పంపిణీలోనూ కేంద్రం ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులకు మాత్రమే బియ్యాన్ని కేటాయిస్తోందన్నారు. ఇందులో భాగంగా గతంలో రాష్ట్ర మంత్రి వర్గ ఉప సంఘం సిఫారసుల మేరకు తిరుపతి, విశాఖపట్నం కార్పొరేషన్లలో మినహా ఉత్తరాంధ్రలోని మూడు, రాయలసీమలోని నాలుగు జిల్లాల్లోని 1.67 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచిత రేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరితో పాటు మిగిలిన జిల్లాల్లోని 89.20 లక్షల ఎస్సీ, ఎస్టీలకు, 24.60 లక్షల మంది అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు, ప్రకాశం జిల్లా వెనుకబడిన ప్రాంతంగా ఉండటంతో అక్కడి లబ్ధిదారులకు ఉచిత రేషన్‌ను అందజేయనున్నట్లు అరుణ్‌కుమార్ వివరించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- రైతుల మృతి ఘటనలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం లేదు
- సర్వీస్ వైరును జీఐ వైరుతో స్టార్టర్ బాక్స్‌కు అనుసంధానించడం వల్లే ప్రమాదం
- ఏపీ ఎస్పీడీసీఎల్, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



సాక్షి, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల పరిధిలో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టినట్టు ఏపీ ఎస్పీడీసీఎల్, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం చియ్యపాడులో విద్యుత్ తీగలు తగిలి రైతులు మృతి చెందారని, దీనికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. విద్యుత్ స్టార్టర్లను దొంగల బారినుంచి రక్షించుకునేందుకు రైతులే స్వయంగా సర్వీస్ వైరు నుంచి జీఐ వైరుతో స్టార్టర్ బాక్స్‌కు అనుసంధానించారని, అది తగిలి రైతులు మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినట్టు వివరించారు. క్షేత్రస్థాయిలో కొందరు రైతులు అనధికారికంగా విద్యుత్ వాడుతూ ప్రమాదాలకు గురవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఫ్యూజులు కాలిపోయిన సందర్భాల్లో రైతులు విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా తామే స్వయంగా ఫ్యూజులు వేసేందుకు సిద్ధపడటం చాలా ప్రమాదకరమని, అలా ఎవరూ చేయవద్దని ఆయన కోరారు.

జాగ్రత్త వహించండి...

భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టకుండా అజాగ్రత్తగా ఉండటం కూడా ప్రమాదాలు జరిగేందుకు కారణమవుతోందని సంతోషరావు పేర్కొన్నారు. ఇటువంటి ప్రమాదాలను నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు ఎక్కడైనా తెగిపడితే సమీపంలోని విద్యుత్ శాఖ సిబ్బందికి గానీ లేదా అధికారులకు, లేదా టోల్ ఫ్రీ నంబరు 1912కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఉన్మాది పవన్ వల్ల కాపులకు నష్టం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: 'నేను మూడు పెళ్లిళ్లు చేసుకున్నాను.. కాపు ఎమ్మెల్యేల్లారా మీరూ చేసుకోండి' అంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉన్మాదిలా మాట్లాడుతున్నాడని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాయకుడంటే అందరికీ ఆదర్శవంతంగా, గౌరవం కలిగేలా ఉండాలని, ప్రవర్తన గౌరవించేలా ఉండాలని మంత్రి చెప్పారు. అందుకు భిన్నంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన వల్ల కాపు సామాజిక వర్గానికి చెడు జరుగుతుందని తాను ఆందోళన చెందుతున్నట్టు తెలిపారు. ఈ ఉన్మాదిని నియంత్రించే చర్యలపై సోమవారం రాజమండ్రిలో కాపు సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ఒక సమావేశం నిర్వహిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు.

అంతర్జాతీయ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా..

▶ మొదటి పేజీ తరువాయి

ఉండటంతోపాటు ఒకేసారి 4 పోర్టులు, 9 ఫిషింగ్ హార్బర్లతో పాటు పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. వీటి ఆధారంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా నవంబర్ 18న విశాఖలో మారిటైమ్ సదస్సు నిర్వహించనున్నారు. అలాగే, వ్యవసాయం దాని అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తూ విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అధిక ఆదాయం వచ్చే విధంగా ప్రతి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునే విధంగా గిడ్డంగులు, శీతల గిడ్డంగుల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ వివరాలను తెలియచేసేవిధంగా డిసెంబర్ మొదటి వారంలో అగ్రి ఎక్స్‌పోను నిర్వహించనున్నారు.

డిసెంబర్‌లో ఎంఎస్ఎంఈ కాన్‌క్లేవ్

రాష్ట్రంలో అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగానికి అనేక ప్రోత్సహకాలిస్తూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఏటా రాయితీలు విడుదల చేస్తుండటంతో ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేవిధంగా ఎంఎస్ఎంఈ కాన్‌క్లేవ్‌ను డిసెంబర్ మూడో వారంలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలంటూ చట్టం చేయడమే కాకుండా ఆయా సంస్థలకు అవసరమైన మానవ వనరులను అందించే విధంగా ప్రతి శాసనసభ నియోజకవర్గ స్థాయిలో స్కిల్ హబ్స్, పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో స్కిల్ కాలేజీలు, తిరుపతి, చెన్నైలో స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తుండటంతో రాష్ట్రంలోని నైపుణ్యాభివృద్ధిలోని అవకాశాలను వివరించే విధంగా స్కిల్ ఆంధ్రా పేరుతో మరో కాన్‌క్లేవ్‌ను నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తున్న మారిటైమ్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి రంగాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. వీటితో పాటు హైదరాబాద్, ముంబై, పుణే, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూర్‌లలో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను వివరిస్తూ రోడ్ షోలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పునరుత్పాదక ఇంధనానికి ప్రాధాన్యం

- టీటీడీ, ఇంధన శాఖ అధికారుల సమీక్షలో ఈవో ధర్మారెడ్డి
- టీటీడీ పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు సహకరిస్తాం: విజయానంద్


టీటీడీ ఈవో ధర్మారెడ్డి

సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెంపొందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు తిరుమల తిరుపతి దేవస్థానం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. టీటీడీలో అమలు చేస్తున్న ఇంధన సామర్థ్య కార్యక్రమాలపై టీటీడీ, ఇంధన శాఖకు చెందిన ఏపీఎస్ఈసీఎం అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ధర్మారెడ్డి మాట్లాడుతూ ఇతర ప్రసిద్ధ దేవాలయాలకు నమూనాగా నిలిచేలా టీటీడీలో పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో టీటీడీని మరింత పర్యావరణహితంగా మార్చేందుకు, భక్తులకు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీటీడీలో వివిధ భవనాల్లో ఇప్పటికే రాష్ట్ర ఇంధన పరిరక్షణ సంస్థ (ఏపీఎస్ఈసీఎం) ఎల్ఈడీ లైట్లు, బీఎల్డీసీ ఫ్యాన్లను ఏర్పాటు చేసినట్లు టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు వివరించారు. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెంపొందించడానికి టీటీడీ చేస్తున్న కృషిని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అభినందించారు. విజయవాడలోని దుర్గగుడి, శ్రీశైలం, సింహాచలం, ద్వారకా తిరుమల, కాణిపాకం, అన్నవరం తదితర ప్రముఖ దేవాలయాల్లో కూడా పునరుత్పాదక ఇంధన సామర్థ్యం పెంపు కార్యక్రమాలకు టీటీడీ ప్రేరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. టీటీడీలో ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు సహకరిస్తామని చెప్పారు. ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో దళారి అరెస్ట్

తిరుమల: టీటీడీ టికెట్లను అధిక ధరకు విక్రయించిన దళారిని అరెస్ట్ చేసినట్టు తిరుమల ఏఎస్పీ మునిరామయ్య ఆదివారం వెల్లడించారు. కర్ణాటకకు చెందిన కేశవమూర్తి శ్రీవారి సేవ టికెట్ల కోసం కాణిపాకం ఆలయంలో గ్యాస్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్‌ను సంప్రదించాడని తెలిపారు. దీంతో కాణిపాకం ఆలయ ఏఈవో మాధవ్‌రెడ్డి పేరిట టీటీడీ చైర్మన్ కార్యాలయంలో 12 సుపథం టికెట్లకు దరఖాస్తు చేసినట్టు తెలిపారు. 12 టికెట్లను రూ. 32 వేలకు విక్రయించారన్నారు. వాటిని సేవ టికెట్లని నమ్మిన కేశవమూర్తి కుటుంబ సభ్యులు శ్రీవారి దర్శనానికి వెళ్లారన్నారు. అనంతరం అది సేవ కాదని తెలియడంతో నేరుగా టీటీడీ విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారన్నారు. ఈ కేసును టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌కు అప్పగించగా.. దళారి కరుణాకర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టామని తెలిపారు. కాణిపాకం ఏఈవో మాధవ్‌రెడ్డి పాత్రపైనా ఆరా తీస్తున్నట్లు ఏఎస్పీ చెప్పారు.

నవంబర్‌లో తిరుమలలో విశేష ఉత్సవాలు

తిరుమల: శ్రీవారి క్షేత్రంలో నవంబర్ నెలలో పలు విశేష ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. నవంబర్ 1న తిరుమల శ్రీవారి పుష్పయాగ మహోత్సవం, వేదాంత దేశికుల శాత్తుమొర, 4న చాతుర్మాస్య వ్రత సమాప్తి, 5న కైశిక ద్వాదశి ఆస్థానం, 7న కార్తీక పూర్ణిమ, 8న చంద్రగ్రహణం, 20న మతత్రయ ఏకాదశి, 21న ధన్వంతరి జయంతి, 28న పంచమి తీర్థం సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారికి సారె సమర్పించనున్నారు.


సీఆర్‌వో కార్యాలయం వద్ద షెడ్డు కింద సేద తీరుతున్న భక్తులు

రేపు ఆర్జిత సేవలు రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో నవంబర్ 1న పుష్పయాగ మహోత్సవం కారణంగా అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శ్రీవారి దర్శనానికి 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

9న ఒంగోలులో శ్రీనివాస కల్యాణం

టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నవంబర్ 9న ఒంగోలు శివారులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా గల మైదానంలో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం తిరుమల నుంచి శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు ఒంగోలు తీసుకువెళతారు.

4 నుంచి భవానీ మండల దీక్షలు



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో నవంబర్ 4 నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి. 4 నుంచి 8వతేదీ ఉదయం 9 గంటల వరకు భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరించాలని దేవస్థాన వైదిక కమిటీ పేర్కొంది. 8న చంద్రగ్రహణం నేపథ్యంలో ఉదయం 9 గంటల వరకే అమ్మవారి దీక్షలను స్వీకరించాలని సూచించింది.4న ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పూజా కార్య క్రమాలను నిర్వహించిన అనంతరం పడగాల మాలను అలంకరించడంతో దీక్షలు ప్రారంభ మవుతాయి. అనంతరం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగి ంపుగా మహా మండపం ఆరో అంత స్తుకు తీసుకువస్తారు. మహా మండపంలోని వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తికి పూజా కార్యక్రమాల నిర్వహణ, అఖండ జ్యోతి ప్రజ్వలన జరు గుతాయి. ఆలయ అర్చకుల చేతుల మీదగా భక్తులు అమ్మవారి మాలలను ధరించి దీక్షలను ఆచరిస్తారు. మహా మండపం ఆరో అంతస్తుతో పాటు ఘాట్‌రోడ్డు ప్రారంభంలోని కామధేను అమ్మవారి వద్ద కూడా భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరిస్తారు.

అగ్రగామి పారిశ్రామిక కేంద్రంగా 'అనకాపల్లి'

- 25వేల ఎకరాలను పారిశ్రామిక హబ్‌లుగా తీర్చిదిద్దుతాం
- ఎంఎస్ఎంఈల ద్వారా 7.5లక్షల ఉద్యోగాల కల్పన
- ఇప్పటికే 2.5 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- కోడూరులో పారిశ్రామిక పార్క్, ఆటోనగర్ నిర్మాణానికి భూమిపూజ


పారిశ్రామిక పార్క్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా): దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక కేంద్రంగా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. అనకాపల్లి మండలం కోడూరు పంచాయతీ పరిధిలో పారిశ్రామిక పార్క్, ఆటోనగర్‌ల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి పార్క్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)కు 25వేల ఎకరాల మేర భూములు ఉన్నాయన్నారు. వాటిని పారిశ్రామిక హబ్‌లుగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. ఇటీవల జరిగిన ఎంఎస్ఎంఈ జాతీయ స్థాయి సమావేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పూర్తి చేయూతను అందించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలిచ్చారని తెలిపారు. జిల్లాలో 7.5 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. ఇప్పటికే 2.5 లక్షల మంది యువతకు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. ఎంఎస్ఎంఈలకు సంబంధించి 2021-22 ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఫిబ్రవరిలో విడుదల చేస్తుందని చెప్పారు.

60 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్

అనకాపల్లి మండలం కోడూరులో దాదాపు 60 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. 300 నుంచి 600 చదరపు మీటర్ల వరకు దాదాపు 250 ప్లాట్లతో లేఅవుట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిశ్రమల స్థాపనకు వీటిని కేటాయిస్తామని చెప్పారు. ఏపీఐఐసీ ద్వారా రూ.36 కోట్లతో డ్రైనేజీ, నీటి సౌకర్యం, రోడ్లు, వీధి లైట్లు, విద్యుత్ పనులు ప్రారంభిస్తామని వివరించారు. భూసేకరణకు భూములిచ్చిన రైతులకు ఇక్కడే ప్లాట్లు కేటాయించామన్నారు. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ, వ్యవసాయ ప్రాంతంగా మాత్రమే అనకాపల్లి మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జిల్లాగా ఏర్పడిన అనకాపల్లిలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఏపీఐఐసీ భూముల్లో మిగిలిన 70 ఎకరాలను కూడా పారిశ్రామిక పార్క్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఆనుకుని మరో 40 ఎకరాల భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. త్వరలో ఏపీఐఐసీ ద్వారా వారి భూములను సేకరిస్తామని చెప్పారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడారు. పారిశ్రామిక పార్కుకు భూమి ఇచ్చిన రైతు గొర్లి తాతారావు మరణించడంతో అతడి కుటుంబ సభ్యులకు రూ.1.4 కోట్ల చెక్కునుమంత్రి అమర్‌నాథ్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి పాల్గొన్నారు.

'జయలక్ష్మి' నిందితులకు రిమాండ్


సీతారామాంజనేయులు, విశాలాక్షిలను సబ్‌జైలుకు తరలిస్తున్న సీఐడీ పోలీసులు

కాకినాడ లీగల్: కాకినాడ, విశాఖ జిల్లాల్లో కార్యకలాపాలు సాగించి వందల కోట్ల రూపాయలను డిపాజిట్ల రూపంలో సేకరించి బోర్డు తిప్పేసిన ది జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో-ఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన ఆర్థిక నేరాల కేసులో నిందితులకు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో విశాఖపట్నం సీఐడీ పోలీసులు శనివారం ముగ్గురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో ఏ1 నిందితుడిగా సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, ఏ2గా వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, ఏ4గా రాయవరపు జయదేవమణి ఉన్నారు. వీరిలో రాయవరపు జయదేవమణిని శనివారం కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఎల్.శారదారెడ్డి 14 రోజుల రిమాండ్ విధించారు. అలాగే రాయవరపు సీతారామాంజనేయులు, రాయవరపు బద్రీ విశాలక్షిని ఆదివారం న్యాయమూర్తి ఎల్.శారదారెడ్డి ఎదుట హాజరుపరిచారు. వారికి కూడా 14రోజుల రిమాండ్ విధించారు. వీరు ముగ్గురిని కాకినాడ స్పెషల్ సబ్ జైలుకు తరలించారు.





నిజానికి ప్రేమ ఉండవలసిన చోటున ఉన్న ఖాళీ స్థలాన్ని కప్పడానికి గౌరవం అనే దాన్ని కనుక్కున్నారు.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, అక్టోబర్, 31

అక్షర లక్షలు

దక్షిణాసియా సాహిత్యపు ప్రతిష్ఠను పెంచుతూ ఈ ఏటి బుకర్ పురస్కారాన్ని శ్రీలంకకు చెందిన సెహన్ తిలకరత్న గెలుచుకున్నారు. మరణానంతర థ్రిల్లర్ 'ద సెవన్ మూన్స్ ఆఫ్ మాలీ అల్మీదా' ఆయనకు ఈ పురస్కారం తెచ్చిపెట్టింది. ఉన్నట్టుండి ఒకరోజు చావు నుంచి మేల్కొన్న ఫొటోగ్రాఫర్ మాలీ అల్మీదా తను దాచిన ఛాయాచిత్రాలను సరైన మనిషి చేతుల్లో పెట్టడానికి చేసే ప్రయత్నం ఈ నవల. దానికిగానూ అతడికి ఉన్న కాలం కేవలం ఏడు చంద్రులు. ఈ ప్రయాణంలో భాగంగా 1980–90ల నాటి శ్రీలంక సంక్షుభిత కాలాన్ని, అంతర్యుద్ధం వల్ల జరిగిన మానవ నష్టాన్ని నవల చిత్రిస్తుంది. ఇంత కల్లోలంలోనూ ప్రతి మానవ జీవితమూ విలువైనదేనన్న ఒక ఆదర్శం కోసం అన్వేషించడం బుకర్ న్యాయనిర్ణేతలను కదిలించింది; షార్ట్‌లిస్టులో ఉన్న ఆరుగురు రచయితల్లోంచి కరుణతిలక వైపు మొగ్గేలా చేసింది. ఒక శ్రీలంక రచయిత ఈ బహుమతిని పొందడం ఇది రెండోసారి. మొదటి రచయిత కెనడాలో స్థిరపడిన మైకేల్ ఆండాట్జీ. 1992లో 'ది ఇంగ్లిష్ పేషెంట్' నవలకుగానూ ఆయన ఈ గౌరవం పొందారు.

అక్టోబర్ నెలంతా సాహితీ మాసంగా గడిచిపోయింది. ఈ నెలలోనే అంతా ఎదురుచూసిన ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం ఫ్రెంచ్ రచయిత్రి ఆనీ ఎర్నోను వరించింది. ఆంగ్లంలో రాసిన, యునైటెడ్ కింగ్‌డమ్ లేదా ఐర్లాండ్‌లో ప్రచురించిన పుస్తకాలు మాత్రమే అర్హమయ్యే బుకర్ ప్రైజ్ 'పరిధి' పరిమితమైనది అయినప్పటికీ, దీని కోసం కూడా సాహిత్య లోకం ఆసక్తిగా చూసింది. ఆంగ్ల భాషా వ్యాప్తి పెరుగుతూండటమూ, ఇతర భాషల సాహిత్యాలు కుంచించుకుపోతుండటమూ, ఇతర భాషీయులు కూడా ఆంగ్లాన్ని తమ మాతృభాషలాగే స్వీకరించి సాహిత్యపరమైన ఆలోచనను కూడా ఆ భాషలోనే చేస్తూండటమూ, ఆంగ్ల సాహిత్యం నిత్యనూతనంగా ఉంటుండటమూ, ఇలా చాలా కారణాల వల్ల బుకర్ ప్రైజ్ అచ్చమైన అంతర్జాతీయ అవార్డు స్థాయిని పొందింది. ఈ పురస్కార విజేతకు 50 వేల పౌండ్ల నగదు లభిస్తుంది. బ్రిటిష్ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, దీని విలువ సుమారు 47 లక్షల రూపాయలు!

బుకర్ ప్రైజ్ పేరుతో ఇస్తున్నప్పటికీ 1969–2001 వరకు మాత్రమే బ్రిటిష్ ఫుడ్ హోల్‌సేల్ ఆపరేటర్ అయిన 'బుకర్ గ్రూప్ లిమిటెడ్' ఈ అవార్డుకు నిధులు సమకూర్చింది. అది తప్పుకొన్న తర్వాత, 2002–19 వరకు ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'మ్యాన్ గ్రూప్' ఇచ్చినందున మ్యాన్ బుకర్ ప్రైజ్ అని వ్యవహరించారు. 2019 నుంచి వెల్ష్ శ్రీమంతుడు మైకేల్ మోరిట్జ్ ఛారిటీ సంస్థ 'క్రాంక్‌స్టార్ట్' దీనికి నిధులు ఇస్తోంది. దాతలు మారుతున్నప్పటికీ, 'అత్యధిక పారితోషికం గల సాహిత్య పురస్కారాల్లో ఇదీ ఒక'టన్న ప్రతిష్ఠకు మాత్రం లోటురావడం లేదు. తమాషా ఏమిటంటే, దీన్ని తలదన్నే మొత్తాన్ని ఇస్తున్న పురస్కారాలు కూడా ఉన్నాయి.

యూఏఈకి చెందిన 'మిలియన్స్ పొయెట్' పోటీకి 50 లక్షల ధీరమ్స్ (సుమారు 11 కోట్ల రూపాయలు) ఇస్తున్నారు. అరబిక్ దేశాల్లోని అత్యుత్తమ కవులను వెతికే ఈ రియాలిటీ టెలివిజన్ కవితల పోటీ ప్రసారమైనప్పుడు, టీఆర్పీ రేటింగ్స్‌లో ఫుట్‌బాల్‌నే వెనక్కి నెట్టేస్తుంది. నగదును టాప్–5 కవులకు పంచుతారు. ఇక స్పెయిన్‌లో ఇచ్చే 'ప్రీమియో ప్లానెటా దె నావెలా' ప్రైజ్‌మనీ పది లక్షల యూరోలు. అంటే సుమారు 8 కోట్ల రూపాయలు. ప్రపంచంలో ఆర్థిక పరంగా ప్రస్తుతం ఇదే అత్యంత ఘనత వహించిన అవార్డు. 1952లోనే ఇది మొదలైంది. పుస్తకాల ప్రచురణ కర్త 'గ్రూపో ప్లానెటా' దీన్ని బహూకరిస్తుండటం గమనార్హం. ఇక 'ఆస్ట్రిడ్ లిండ్‌గ్రెన్ మెమోరియల్ అవార్డు' పేరుతో స్వీడన్‌లో ఇచ్చే పురస్కార విలువ 50 లక్షల స్వీడిష్ క్రోనాలు(సుమారు 37 లక్షల రూపాయలు). గుర్తుంచుకోవాల్సింది స్వీడన్ జనాభా అక్షరాలా ఒక కోటి నలభై లక్షలు మాత్రమే. ఇక అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ విజేతకు ఒక కోటి స్వీడిష్ క్రోనార్ల నగదు (సుమారు ఏడున్నర కోట్ల రూపాయలు)తోపాటు 18 క్యారెట్ల బంగారు పతకం బహూకరిస్తారు. మళ్లీ బుకర్ వద్దకే వస్తే– ఆంగ్లంలోకి అనువాదమైన ఇతర భాషా పుస్తకాల కోసం ప్రత్యేక విభాగంగా నెలకొల్పిన ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ పురస్కార నగదు కూడా 50,000 పౌండ్లు. దీన్ని రచయిత, అనువాదకులకు సమంగా పంచుతారు. పోయినేడాది హిందీ నవలా రచయిత్రి గీతాంజలి శ్రీ, అనువాదకురాలు డైసీ రాక్‌వెల్‌తో పాటు గెలుచుకున్నది ఇదే.

ఇంతేసి పారితోషికాలు, ఒక పుస్తకం కోసం సాహిత్య లోకం ఎదురుచూడటాలు తెలుగు నేలకు ఏమాత్రం సంబంధం లేని వ్యవహారంగా కనిపించడం లేదూ! ఉమ్మడిగా రెండు రాష్ట్రాల జనాభా సుమారు తొమ్మిది కోట్లు. అయినా ఒక రచయిత తన సొంత ఖర్చుతో వేసుకునే వెయ్యి కాపీలు అమ్మడం కూడా దుర్భరం. ఇలాంటి వాతావరణానికి కారణాలు ఏమిటి? పఠనాన్ని తగ్గించాయని చెప్పే అన్ని కారణాలూ అన్ని దేశాలకూ వర్తిస్తాయి కదా. మరెక్కడుంది లోపం? మన సంస్కృతిలో. 'చదవడం' అంటే మనకు అర్థం వేరే. 'ఒక దేశం తన కథకులను కోల్పోయిందంటే, తన బాల్యాన్ని కోల్పోయినట్టే' అన్నాడు పీటర్ హాండ్కే. మన జీవితమంతా మన చిన్నతనంలోనే ఉండిపోయిందని పెద్దయినకొద్దీ అర్థమవుతూ వస్తుంది. డబ్బులు మాత్రమే సర్వస్వమా అంటే– అది మన సారస్వత నిర్మాతలను మనం ఎలా గౌరవించుకుంటున్నాం అన్నది తెలియజేస్తుంది. బాక్సాఫీస్ కలెక్షన్లలో వెయ్యి కోట్లు దాటే సినిమాలు తీస్తున్న తెలుగు నేల మీద, ఒక తెలుగు రచయితకు కోటి రూపాయల బహుమతి ఇచ్చే ఊహయినా చేయగలమా?

మనం నేర్చుకోవలసిన పాఠం

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ నాయకుడిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ ఏకగ్రీవంగా ఎన్నికవడం, ఆ దేశ నూతన ప్రధాని కావడం గర్వించాల్సిన విషయమే. మరోవైపు, ఇది మన సొంత దేశం గురించి ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది. సునాక్ ఎదిగివచ్చిన తీరు అద్భుతమైన పరిణామమే కావచ్చు కానీ, మన దేశం విషయం ఏమిటి? మన జనాభాలో 14.3 శాతం మంది ముస్లింలు ఉన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే లోక్‌సభలో ముస్లింలకు 74 సీట్లు ఉండాలి. కానీ పార్లమెంటులో 27 మంది ముస్లిం ఎంపీలే ఉన్నారు. ఒక్క ముస్లిం ముఖ్యమంత్రి కూడా లేరు. 15 రాష్ట్రాల్లో ఒక్కరంటే ఒక్క ముస్లిం మంత్రి లేరు. గుజరాత్‌లో అయితే 1988 నుంచి లోక్‌సభకు గానీ, శాసన సభకు గానీ ఒక్క ముస్లింని కూడా బీజేపీ నిలబెట్టలేదు. దేశంలో 20 కోట్లమంది ముస్లింలు ఉన్నారు. కానీ వారిని ఎక్కడా కనిపించకుండా చేశాం. ఈరోజు సునాక్ సాధించిన అద్భుతమైన విజయాన్ని చూసి గర్వపడుతున్నప్పుడు, భారత్‌లో ఒక ముస్లిం ప్రధాని అయ్యే అవకాశం ఉందా అని ఎందుకు ప్రశ్నించుకోకూడదు?

చివరకు పట్టాభిషేకం జరిగిపోయింది. అది కూడా దీపావళి రోజు జరగటం 42 సంవత్సరాల హిందూ భక్తుడికి వ్యక్తిగతంగా ఎంతో విలువైన విషయం అయివుంటుంది. అయితే, నేను భిన్నమైన అంశాన్ని చెప్పాలనుకుంటున్నాను. బ్రిటన్ కన్జర్వేటివ్ పార్టీ నాయకుడిగా రిషి సునాక్ ఏకగ్రీవంగా ఎన్నికవడం, ఆ విధంగా దేశ నూతన ప్రధాని కావడం, అది కూడా 200 సంవత్సరాల చరిత్రలో అతి పిన్నవయస్కుడిగా ప్రధాని కావడం అనేది నా రెండో ప్రీతిపాత్రమైన దేశం గురించి నేను గర్వపడేలా చేస్తోంది. ఇది మన సొంత దేశం గురించి ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది. బ్రిటన్ నుంచి భారత్ స్పష్టమైన పాఠం నేర్చుకుంటుందా?



బ్రిటన్ ఏం చేసిందో ఒక్క క్షణం ఆగి ఆలోచించండి. ఆ దేశంలోని జనాభాలో 6.8 శాతం మంది వివిధ ఆసియన్ జాతులకు చెందిన ప్రజలున్నారు. వీరిలో 2.3 శాతం జనాభా భారతీయ మూలాలు కలిగి ఉన్నారు. ఇది చాలా చాలా చిన్న మైనారిటీ. అయినప్పటికీ, 1960లలో మాత్రమే దేశానికి వలసవచ్చిన తొలి తరం భారత సంతతి కుటుంబానికి చెందిన ఒక కుమారుడిని బ్రిటన్ 57వ ప్రధానమంత్రిగా కన్జర్వేటివ్ పార్టీ ఎంపీలు ఎన్నుకున్నారు. మన సొంత దేశంలో ఈ ఘటనపై వచ్చిన స్పందన ఎలా ఉంది అంటే, ఇలా జరిగిందా అనే అపనమ్మకం, అవును ఇలా జరిగిందనే సంతోషం రెండింటికీ అది రుజువుగా నిలుస్తోంది.

సునాక్ ఎదిగివచ్చిన తీరు అత్యంత అద్భుతమైన పరిణామమే కావచ్చు కానీ అది మాత్రమే పూర్తి కథ అని చెప్పలేం. బోరిస్ జాన్సన్ తొలి మంత్రివర్గం ఇరవై శాతం వరకు నల్లవారు లేదా ఆసియన్ మూలాలు కలిగివున్న వారితో కూడి ఉండింది. మునుపటి ప్రభుత్వంలోని నలుగురు ఛాన్సలర్‌లు, గత ప్రభుత్వ మంత్రివర్గాల్లోని ఇద్దరు హోం సెక్రటరీలు, లిజ్ ట్రస్ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి – వీరందరూ బ్రిటన్‌కి వలస వచ్చిన కుటుంబాలకు చెందినవారే. ఇవన్నీ కూడా ప్రభుత్వంలో అత్యంత కీలకమైన పదవులు. బహుశా వీటన్నింటికంటే ముఖ్యమైంది ఏమిటంటే, కన్జర్వేటివ్ పార్టీకి చెందిన 357 మంది ఎంపీల్లో 200 మందికి పైగా ఎంపీలు సునాక్‌ని బలపర్చడమే. సునాక్‌తో పోలిస్తే ఆయనతో పోటీ పడిన శ్వేత జాతి అభ్యర్థులు ఆయన దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారు.

ఇప్పుడు మనం భారత్ వైపు చూద్దాం. మన జనాభాలో 14.3 శాతం మంది ముస్లింలు ఉన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే లోక్‌సభలో ముస్లింలకు 74 సీట్లు ఉండాలి. కానీ పార్లమెంటులో 27 మంది ముస్లిం ఎంపీలే ఉన్నారు. భారత్‌లోని 28 రాష్ట్రాల్లో ఒక్క ముస్లిం ముఖ్యమంత్రి కూడా లేరు. 15 రాష్ట్రాల్లో ఒక్క రంటే ఒక్క ముస్లిం మంత్రి కూడా లేరు. మరో 10 రాష్ట్రాల్లో ఒకే ఒకే ముస్లిం మంత్రి ఉన్నారు. అది కూడా మైనారిటీ వ్యవహారాల మంత్రిగా మాత్రమే. 2014లో గానీ, 2019లో గానీ లోక్‌సభకు ఒక్క ఎంపీని కూడా బీజేపీ ఎన్నుకోలేదు. ఉత్తరప్రదేశ్‌లో ఇరవై శాతం జనాభా కలిగివున్న ముస్లింలకు ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా లేరు. 2017వ సంవత్సరంలో కూడా ఇదే పరిస్థితి. గుజరాత్‌లో అయితే 1988 నుంచి లోక్‌సభకు గానీ, శాసనసభకు గానీ ఒక్క ముస్లింని కూడా ఆ పార్టీ నిలబెట్టలేదు. అంటే 9 శాతం జనాభా ఇస్లామిక్ విశ్వాసం పాటిస్తున్న రాష్ట్రంలో 24 సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా వారిని దూరం పెట్టారన్న మాట.

నేను చెబుతున్న వాస్తవాలన్నీ ఆకార్ పటేల్ రాసిన 'అవర్ హిందూ రాష్ట్ర' పుస్తకం నుంచి ఉల్లేఖించినవే. ఇది మరింత కలవరపెట్టే విషయాలను వెల్లడిస్తోంది. దేశంలో 15 శాతం ముస్లిం జనాభా ఉంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 4.9 శాతం మంది మాత్రమే ముస్లింలున్నారు. పారామిలటరీ బలగాల్లో 4.6 శాతం మంది, ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ సర్వీసుల్లో 3.2 శాతం మంది ముస్లింలు మాత్రమే ఉంటున్నారు. ఇక భారత సైన్యంలో అయితే అత్యంత తక్కువగా 1 శాతం ముస్లింలు మాత్రమే ఉండటం గమనార్హం. ఇది మనలను కలవరపర్చాల్సిన విషయం మరి.

దీనికి సంబంధించి బ్రిటన్‌లో మీడియా ఎంత భిన్నంగా ఉంటోందో నన్ను చెప్పనివ్వండి. 'బీబీసీ' ఛానల్‌కేసి చూడండి. అక్కడ పనిచేసేవారిలో ఆసియన్ ముఖాలు ఎంత ఎక్కువగా ఉంటాయో చూసి మీరు షాక్ తింటారు. వారిలో కొన్ని పేర్లను మీరు చూడాలి మరి. మాథ్యూ అమ్రోలివాలా, గీతా గురుమూర్తి, జేమ్స్ కుమారస్వామి, జార్జ్ అలిగియా, నోమియా ఇక్బాల్, సమీరా హుస్సేన్, అమోల్ రాజన్, రజనీ వైద్యనాథన్, యోగితా లిమాయే, సికిందర్ కిర్‌మానీ, కమల్ అహ్మద్, ఫైజల్ ఇస్లామ్, దర్శిని డేవిడ్.

కాబట్టి, ఇప్పుడు బ్రిటన్ నుంచి భారత్ స్పష్టమైన పాఠాలు నేర్చవలసి ఉందని నేనెందుకు భావిస్తున్నానో మీకు అర్థమై ఉంటుంది. భారత్‌లో 20 కోట్లమంది ముస్లింలు ఉన్నారు. కానీ వారిని ఎక్కడా కనిపించకుండా చేశాం. వాళ్లను మనం చెదపురుగులు అని పిలుస్తాం. బాబర్ సంతానం అంటాం. అబ్బా జాన్ అని పేర్కొంటూ వారిని ఎగతాళి చేస్తాం. శ్మశాన్ ఘాట్, కబర్‌స్తాన్ మధ్య పోలికలు తీసుకొస్తూ వారిని కించపరుస్తాం. పైగా పాకిస్తాన్ వెళ్లిపోవాలని వారికి పదేపదే చెబుతుంటాం. కాబట్టి, ఈరోజు సునాక్ సాధించిన అద్భుతమైన విజయానికి గానూ మనం గర్వపడుతున్నప్పుడు, మనకేసి మనం ఎందుకు చూసుకోకూడదు? భారత్‌లో ఒక ముస్లిం ప్రధాని అయ్యే అవకాశం ఉందా అని ఎందుకు ప్రశ్నించుకోకూడదు?

పైగా చాలామంది గుర్తించలేని కొత్త విరోధాభాస కూడా ఇక్కడ ఉంది. బ్రిటన్ గురించి ఏమాత్రం అర్థం చేసుకోలేని మనలోని కొందరు బ్రిటిష్ వారు జాత్యహంకారులు అని ప్రకటించడంలో మాత్రం ముందుంటారు. సునాక్ ప్రధాని కావడానికి చాలా కాలం క్రితమే వారు ఘోరమైన తప్పుడు అవగాహనతో ఉన్నట్లు. ఎందుకంటే, దేశంలో ముస్లింల పట్ల మనం వ్యవహరిస్తున్న తీరును విమర్శించడం అటుండనీ, కనీసం దాన్ని గుర్తించడానికి కూడా ఒప్పుకోరు. దానికి బదులుగా ముస్లింల బుజ్జగింపు అని మాట్లాడటానికి ఇష్టపడతారు.

సునాక్ విజయగాథ మనకు స్ఫూర్తిగా ఉండాలని నేను ప్రార్థిస్తాను. కానీ ఈ విషయంలో కూడా నాది తప్పు అని రుజువవుతుందేమో అని భయపడుతున్నాను.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త సింగారం



చీర అనేది ఆస్ట్రేలియా విస్తృత సమాజంలో కూడా ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మారుతోంది (ఇండియాలో పనిచేస్తున్న ఆస్ట్రేలియా దౌత్యవేత్తల విషయంలోనే కాదు). భిన్న సామాజిక, అధికారిక సందర్భాలకు తగినట్టుగా ఆస్ట్రేలియన్ మహిళలు చీరలు కట్టుకుంటున్నారు.

– సారా స్టోరీ, ఇండియాలో ఆస్ట్రేలియా డిప్యూటీ హైకమిషనర్

కలుపుకొని పోవాలి



ప్రతి సందర్భమూ భిన్న దృష్టికోణాలు కలిగివుంటుందని ప్రపంచానికి నేర్పించింది ఇండియా. కాబట్టి, ప్రతి ఒక్కరి అభిప్రాయాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి.

– ఒమర్ ఘాజీ, కాలమిస్ట్

పనైపోతుంది!



ఒకే దేశం, ఒకే తలకట్టు అని ఎందుకు ఒకటి కొత్తది మొదలు పెట్టకూడదు?

– పత్రలేఖా ఛటర్జీ, విజిటింగ్ ఫెలో

అదే వాస్తవం



ఇరాన్‌కు అనుకూలంగా చేస్తున్న ర్యాలీలు, 'సాటానిక్ వర్సెస్' విషయంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా జరిపిన ర్యాలీల కంటే చాలా పెద్దవిగా ఉంటున్నాయి.

– జాక్సన్ హింకిల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అలవాటైంది



ఇప్పుడు ఎప్పుడోగానీ మాస్కు వేసుకోను. కానీ జేబులో ఒకటి లేకుండా మాత్రం ఇల్లు కదలడం లేదు.

– అభిజిత్ మజుందార్, జర్నలిస్ట్

బాల్యంలో వద్దు




పురుషుల లాగే, ఏ మతం అన్నదానితో నిమిత్తం లేకుండా ఆడపిల్లల చట్టబద్ధమైన వివాహ వయసును 21 ఏళ్లుగా తప్పనిసరి చేయాలి.

– కార్తీ పి. చిదంబరం, కాంగ్రెస్ ఎంపీ

'అనంత' సాంస్కృతిక సేనాని

సందర్భం



రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

జీవితాన్ని వెతుక్కునే దశ నుంచి జీవిత సాఫల్య పురస్కారం అందుకునే దశకు శాంతి నారాయణ ఎదగడం నల్లేరు మీద బండి నడకలా సాగలేదు. 'నీ కొడుక్కి చదువెందుకు, కూలికి పంపించు' అనిపించుకున్న దశ నుంచి ఎంఏ, పీహెచ్‌డీ చేసే దశకు శాంతి నారాయణ ప్రయాణం సునాయాసంగా జరగలేదు. సాంఘిక వివక్ష, ఆర్థిక అసమానతలను అనుభవించే దశ నుంచి, వాటిని నిర్మూలించాలనే రచనలు చేసే దశకు ఆయన చేరడం చిన్నపని కాదు. అదొక సంఘర్షణ. అదొక సమరం. బాల్యంలో తగిలిన గాయాలను స్వయంకృషితో, సహృదయుల చేయూతతో మాన్పుకుంటూ, మాన్పుకుంటూ గాయాలు లేని సమాజ నిర్మాణం లక్ష్యంగా సాహిత్య సృష్టి చేస్తున్న రచయిత డాక్టర్ శాంతి నారాయణ.

డెబ్బై అయిదేళ్ళ వయసుగల (1946) శాంతి నారాయణకు 50 ఏళ్ళ సాహిత్య జీవితం (1972–2022) ఉంది. ఆయన కవి, కథా రచయిత, నవలా రచయిత, ఫీచర్ రచయిత. జీవితాన్ని వెతుక్కుంటూ, 50 ఏళ్ళలో అనేక సామాజిక, సాహిత్య కార్యకలాపాల్లో నిమగ్నమౌతూ, యాభై ఏళ్ళలో అసంఖ్యాక రచనలు చేసిన నిబద్ధత, నిమగ్నత గల రచయిత. శాంతి నారాయణ జీవితం మూడు ముఖాలుగా సాగుతున్నది. 1. వ్యక్తిగత జీవితం. 2. సామాజిక జీవితం. 3. సాహిత్య జీవితం. శాంతి నారాయణ వ్యక్తిగత జీవితంలో కుల వ్యతిరేకి. లౌకిక వాది. భౌతికవాది. తాను కులాంతర వివాహం చేసుకోవడమేగాక, తన సంతానానికీ కులాంతర వివాహాలు చేశారు. ఈ విషయంలో ఆయన చాలామంది మహామహులను వెనక్కి నెట్టేశారు. రచయితగా శాంతినారాయణ గత అయిదు దశాబ్దాలలో 16 పుస్తకాలు ప్రచురించారు. ఆయన అవధాని కాబోయి ఆధునిక రచయిత కావడం గుర్తించదగిన విశేషం. 1972లో 'రక్తపు ముద్ద పిలిచింది' అనే కథా సంపుటి ప్రచురణతో ఆయన సాహిత్య జీవితం మొదలై, 2022లో 'ముడి', 'సాధన' అనే రెండు నవలల ప్రచురణ దాకా వచ్చింది. ఈ మధ్యలో 'నడిరేయి నగరం'(1978), 'కొత్త అక్షరాలమై' (2017) అనే కావ్యాలూ; 'రస్తా' (1976), 'పల్లేరు ముళ్ళు' (1998), 'నమ్ముకున్న రాజ్యం '(2004), 'కొండచిలువ' (2016), 'బతుకుబంతి' (2017) కథల సంపుటాలు; 'మాధురి' (1980), 'పెన్నేటి మలుపులు' (2001) వంటి నాలుగు నవలలు; 'నాలుగు అస్తిత్వాలు–నాలుగు నవలికలు' అనే గ్రంథం; 'నాగల కట్ట సుద్దులు' అనే ఫీచర్ రచన రెండు సంపుటాలు ప్రచురించారు.

శాంతి నారాయణ అనంతపురం జిల్లా సామాజిక రంగంలో క్రియాశీలక పాత్ర నిర్వహించారు. 1989కి ముందు రాయదుర్గంలో పనిచేస్తున్నప్పుడు అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతపురంకు బదిలీ అయ్యాక 1989–2002 మధ్య 'జిల్లా రచయితల సంఘం' ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా ఆయన అనేక విలువైన కార్యక్రమాలు నిర్వహించారు. ఏళ్ళతరబడి నిద్రావస్థలో ఉండిపోయిన జిల్లా రచయితల సంఘాన్ని పునరుజ్జీవింపజేయడంలో శాంతినారాయణ చురుకైన పాత్ర నిర్వహించారు. తెలుగు నవల వచ్చి 116 ఏళ్ళ చరిత్ర పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సు చరిత్రాత్మకమైనది. 2002–2004 మధ్య అనంతపురం జిల్లాను కరువు అతలాకుతలం చేసినప్పుడు అనంతపురం జిల్లా రచయితలు, కళాకారులు, మేధావులు చేసిన కరువు అధ్యయన యాత్ర, రైతు ఆత్మవిశ్వాస యాత్రల్లో శాంతి నారాయణ భాగస్వామి అయ్యారు. ఆ సమయంలో అనంతపురం జిల్లా రచయితల సంఘం తరఫున 'హొరుపు' అనే కవిత్వ సంకలనాన్నీ, 'ఇనుప గజ్జెల తల్లి' అనే కథల సంకలనాన్నీ సంపాదకత్వం వహించి ప్రచురించారు. అలాగే అనంతపురం జిల్లాలో దళితుల మీద దాడులు జరిగినప్పుడు దళిత సంఘీభావం సమితి ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలలో ఆయన పాల్గొన్నారు. తాను రచనలు చేయడమే కాకుండా, 'విమలా శాంతి సామాజిక సాహిత్య సేవా సమితి' స్థాపించి 2006 నుండి, 17 ఏళ్ళుగా, కవులు, కథా రచయితలకు పురస్కారాలిస్తున్నారు. ఇవాళ ప్రసిద్ధిగాంచిన రచయితలుగా పేరు పొందిన వాళ్ళలో చాలామంది ఆయన పురస్కారాలు తీసుకున్నవారే. అంతేగాక, విమలా శాంతి జీవిత సాఫల్య పురస్కారం స్థాపించి మొదటిసారిగా, 2021లో వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న ఆచార్య కేతు విశ్వనాథరెడ్డికి ఇచ్చారు. ఇది శాంతి నారాయణ బహుముఖీన జీవితం.



డా॥ శాంతి నారాయణ

వ్యాసకర్త ప్రముఖ సాహితీ విమర్శకులు
(రేపు డాక్టర్ శాంతి నారాయణకు 'వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార' ప్రదానం)

...అయినప్పటికీ చెరగని ముద్ర

సందర్భం



వనం జ్వాలా నరసింహారావు

సుమారు 28 సంవత్సరాల సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య భారతదేశంలో ఒక చీకటి అధ్యాయానికి తెర లేచిన చీకటి రోజులు నాకు ఇప్పటికీ చాలా స్పష్టంగా జ్ఞాపకం వున్నాయి. 1975 జూన్ 26న (25వ తేదీ అర్ధరాత్రి) అలనాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించారు. 1977లో తిరిగి ఎన్నికలు జరిగే వరకూ, 21 నెలలపాటు దారుణమైన ఎమర్జెన్సీ పాలన కొనసాగింది. సామ్యవాద, ప్రజాస్వామ్య మార్గంలో ఇందిరాగాంధీ నియంతగా వ్యవహరించిన ఆ సందర్భంలో ఎన్నో అనుభవాలు, మరెన్నో జ్ఞాపకాలు.

రాయబరేలిలో గెలుపుకోసం ఇందిర అనేక అక్రమాలకు పాల్పడ్డారని, కాబట్టి ఎన్నికను రద్దు చేయాలంటూ ఆమె చేతిలో ఓడిపోయిన అభ్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాని ఇందిరా గాంధీ లోక్‌సభ ఎన్నిక చెల్లదనీ, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్ లాల్ సిన్హా 1975 జూన్ 12న చరిత్రాత్మక తీర్పు ఇచ్చారు. ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఇందిర అనర్హురాలిగా న్యాయస్థానం ప్రకటించింది. ఆమె తక్షణమే రాజీనామా చేయాలని ప్రతి పక్షాలు ముక్త కంఠంతో డిమాండు చేశాయి. రాజీనామా ప్రసక్తే లేదని తేల్చి చెప్పడమే కాకుండా, యావత్ పాలనా యంత్రాంగాన్నీ తన గుప్పిట్లో పెట్టుకునే దిశగా అడుగులు వేసింది. యోధాన యోధులైన రాజకీయ నాయకులను నిర్బంధించే ప్రక్రియకు నాంది పలికింది. అలనాటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, ఆమె అనుంగు సహచరుడు సిద్దార్థ శంకర రే సలహా మేరకు దేశ సమగ్రత – సమైక్యతలకు తీవ్రమైన ముప్పు వాటిల్లనున్నదన్న కారణం చూపుతూ, 1975 జూన్ 25, అర్ధరాత్రి అత్యవసర పరిస్థితిని ప్రకటించింది ఇందిరా గాంధీ ప్రభుత్వం. దీనిపై కోర్టుకు వెళ్లటానికి వీలులేకుండా రాజ్యాంగానికి 39వ సవరణ తెచ్చింది. అసాధారణ అధికారాలను చేజిక్కించుకుని, పౌర హక్కులను కాలరాసింది. అంతర్గత భద్రత చట్టం కింద వందల, వేల సంఖ్యలో అరెస్టులు చేయించింది.

దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరితో సహా, జయప్రకాశ్ నారాయణ, మొరార్జీ దేశాయ్ వంటి ప్రతిపక్ష పార్టీల నాయకుల నుండి సాధారణ కార్యకర్తల వరకు వేలాదిమందిని జైల్లో పెట్టించింది. ప్రజలకు అత్యవసర పరిస్థితి విధింపు తాత్కాలికమే అని నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. ఆర్థిక, రాజకీయ సుస్థిరత కొరకు అంటూ... జరగాల్సిన సార్వత్రిక ఎన్నికలను ఒక ఏడాది వాయిదా వేసింది. అన్ని పత్రికా వార్తలపైనా సెన్సారు వచ్చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ రాయటానికి వీలులేదు. 'మీసా' వంటి చట్టాలను కాంగ్రెస్ అధిష్ఠానం యథేచ్ఛగా తమ కనుకూలంగా వాడుకుంది.

ప్రముఖ నాయకుల ఫోన్లను ట్యాప్ చేయించింది. ప్రభుత్వంలో ఏ హోదాలేని ఇందిరాగాంధీ కొడుకు సంజయ్ గాంధీ రాజ్యాంగేతర శక్తిగా అవతరించాడు. ఢిల్లీ నగరంలోని తుర్కమన్ గేటు, ఇతర ప్రాంతాలలో పెద్ద సంఖ్యలో ఉన్న మురికివాడలను బుల్డోజర్లు పెట్టి కూల్చివేశారు. అలాగే పేదవాళ్లు ఎక్కువగా పిల్లలను కనడం వల్లనే దేశానికి సమస్యలొస్తున్నాయని చెప్పి మురికివాడలలో నిర్బంధంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాడు సంజయ్.



హఠాత్తుగా, 1977 జనవరిలో ఎన్నికల నిర్ణయం ప్రకటించింది ఇందిరా గాంధీ. జైళ్లలో నిర్బంధించిన వారందరినీ విడుదల చేయించింది. ఎమర్జెన్సీ దురాగతాలను ఎదుర్కోవాలని జైలు నుంచే జయప్రకాశ్ నారాయణ 'సంపూర్ణ విప్లవం' అంటూ ఇచ్చిన పిలుపు దేశ రాజకీయాల దిశను మార్చివేసింది. అప్పటి వరకూ చిన్న చిన్న పార్టీలుగా ఉన్న అనేక పార్టీలన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చి జనతాపార్టీగా ఏర్పడ్డాయి. ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. ఇందిర అనుంగు సహచరుడు జగ్జీవన్ రామ్ కూడా ప్రతి పక్షాల సరసన చేరాడు.

లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ నాయకత్వంలో జనతా పార్టీకి వామపక్షాల మద్దతు కూడా లభించింది. కాంగ్రెస్‌లోని 'యంగ్ టర్క్స్' కూడా వారితో జత కట్టారు. 1977 మార్చ్ 20న జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఇందిరాగాంధీని ఆమె నియోజకవర్గంలోనూ, ఆమె సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీని దేశంలోను దారుణంగా ఓడించారు. ప్రప్రథమ కాంగ్రేసేతర ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారు ఓటర్లు. మొరార్జీ దేశాయ్ ప్రధాని అయ్యారు.

అవిశ్వాస తీర్మానం కారణంగా మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం, ఆయన స్థానంలో ఇందిర మద్దతుతో చరణ్ సింగ్ ప్రధానిగా పదవిని చేపట్టడం, రాజీనామా చేయడం; దరిమిలా జరిగిన ఎన్నికల్లో ఓడిపోవడం తెలిసిన విషయమే. ఆ లోక్‌సభ ఎన్నికలలో 529 స్థానాలకుగాను 351 స్థానాలు గెలుచుకుని తన సత్తాను నిరూపించుకున్న ఇందిరాగాంధీ తిరిగి ప్రధానమంత్రి అయ్యారు.

'ఆపరేషన్ బ్లూ స్టార్' పేరుతో అమృత్‌సర్‌లోని గోల్డెన్ టెంపుల్– హర్మందిర్ సాహిబ్‌పై జరిగిన సైనిక దాడికి నిరసనగా, అంగరక్షకులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్‌లు జరిపిన కాల్పుల్లో ఇందిరా గాంధీ హత్యకు గురై 38 సంవత్సరాలు నిండాయి. సామ్యవాద, ప్రజాస్వామ్య మార్గంలో ఆమె నియంతృత్వ పోకడలను పక్కనపెడితే, అలీన ఉద్యమ నాయకురాలిగా, మహిళా ప్రధానిగా, అరుదైన వ్యక్తిత్వం గల వ్యక్తిగా ప్రపంచ స్థాయిలో ఇందిరాగాంధీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదనడంలో మాత్రం సందేహం లేదు.

వ్యాసకర్త తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్ఓ
మొబైల్: 80081 37012
(నేడు ఇందిరాగాంధీ 38వ వర్ధంతి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.సప్తమి రా.3.27 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.8.54 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** సా.4.18 నుండి 5.47 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.05 నుండి 12.53 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.11 వరకు, **అమృతఘడియలు:** రా.1.12 నుండి 3.01 వరకు : **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు : **సూర్యోదయం** 6.01 : **సూర్యాస్తమయం** 5.27.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899


కృష్ణాజిల్లా తేలప్రోలులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్


గుంటూరు జిల్లా గొర్లవారిపాలెంలో పథకాలను వివరిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఇంటింటా ఆనందం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్ద ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజాప్రతినిధులతో ప్రజలు చెప్పారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు. - సాక్షి, నెట్‌వర్క్


నంద్యాల జిల్లా వడ్లరామాపురంలో ప్రభుత్వ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


పార్వతీపురం మన్యం జిల్లా గిరిశిఖర గ్రామం సోయిల్‌గూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కళావతి

క్లుప్తంగా

భీమిలి జోన్‌లో 828 మందికి ఇళ్ల పట్టాలు


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి , జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో రూ.400 కోట్ల విలువైన ఇళ్లస్థలాలు 40 వేల మందికి ఇచ్చినట్లు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఆయన ఆదివారం విశాఖపట్నం రెండోవార్డు చిల్డ్రన్స్ పార్కులో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలిసి 1, 2, 3 వార్డులకు (భీమిలి జోన్‌కు) చెందిన 828 మంది లబ్ధిదారులకు రెండోవిడత ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. నూతనంగా నియమితులైన వలంటీర్లకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఐసీడీఎస్ నిర్వాహకులకు ప్రభుత్వం అందించిన 232 సెల్‌ఫోన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండోవిడత 15 వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తున్నామని, వీటిలో భీమిలి జోన్‌లో 828 మంది లబ్ధిదారులున్నారని తెలిపారు. ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమానికి టీడీపీకి చెందిన 2, 3 వార్డుల కార్పొరేటర్లు రాకపోవడాన్ని తప్పుబట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కరికి పట్టా ఇవ్వలేకపోయారని చెప్పారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తలకిందులుగా తపస్సు చేసినా విశాఖ రాజధాని కాకుండా అడ్డుకోలేరని పేర్కొన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కోసం చేపట్టిన గర్జన చంద్రబాబు, పవన్, లోకేశ్‌లకు కంటగింపుగా మారిందని చెప్పారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి సూచనల మేరకు తగరపువలస, చేపలుప్పాడలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. 1, 4 వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, దౌలపల్లి ఏడుకొండలు, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు చరిత్ర అందించాలి

- ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- కొండవీటి మ్యూజియంలో విగ్రహాల ఆవిష్కరణ


నాగమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీలు అయోధ్యరామిరెడ్డి, పి.బ్రహ్మానందరెడ్డి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరు చరిత్రను తెలుసుకుని భావితరాలకు అందించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం హౌస్‌గణేష్ గ్రామ శివారులోని కొండవీటి రెడ్డి రాజుల వారసత్వ మ్యూజియంలో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. అనవేమారెడ్డి విగ్రహాన్ని గోల్కొండ గ్రూప్ హోటల్స్ చైర్మన్ ఎస్.రామిరెడ్డి, గోన గన్నారెడ్డి విగ్రహాన్ని ఎస్.నరసింహారెడ్డి, మహాకవి శ్రీనాథుడి విగ్రహాన్ని మారం జైపాల్‌రెడ్డి, అవచి తిప్పయ్యశెట్టి విగ్రహాన్ని బొమ్మిడాల కృష్ణమూర్తి, కవి వేమన విగ్రహాన్ని బి.తాతిరెడ్డి, నాయకురాలు నాగమ్మ విగ్రహాన్ని ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నీలం సంజీవరెడ్డి విగ్రహాన్ని నంద్యాల ఎంపీ పి.బ్రహ్మానందరెడ్డి, శిలాప్రాంగణాన్ని అఖిలభారత రెడ్ల సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు టి.నరసింహారెడ్డి ఆవిష్కరించారు. మాచర్ల ప్రాంతానికి చెందిన కవి కొండసాని ఆంజనేయరెడ్డి (సుమశ్రీ) రచించిన 12వ శతాబ్దానికి చెందిన నాయికామణి నాగమ్మ (ద్విశతి) పుస్తకాన్ని ఎంపీ అయోధ్యరామిరెడ్డి ఆవిష్కరించారు. అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ అప్పటి రాజరిక వ్యవస్థలో రెడ్డిరాజులు కొండవీడును కేంద్రంగా చేసుకుని ప్రజలకు సుస్థిరమైన పాలన అందించారని చెప్పారు. ఘనమైన చరిత్రను తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొండవీటి కోట అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్, ప్రధాని మోదీల సహాయ సహకారాలు తీసుకుంటానని తెలిపారు. రాష్ట్ర మద్య విమోచన కమిటీ చైర్మన్ వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రెడ్డి రాజులు అన్ని కులాలవారితో సామరస్యంగా మెలిగి సుస్థిర పాలన అందించారని చెప్పారు. కొండవీటి కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో అనేకమంది రాజుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కవి కొండసాని ఆంజనేయరెడ్డి ప్రసంగించారు. ఎంపీ భాస్కరరెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, బాలకృష్ణారెడ్డి, బి.మరియకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అంబేడ్కర్ విగ్రహ ప్రాజెక్టు పనులు

- పురోగతిపై ప్రతివారం మంత్రులు, అధికారుల సమీక్ష
- 125 అడుగుల విగ్రహంలో ఇప్పటికే 40 శాతం తయారీ పూర్తి
- జనవరి నెలాఖరుకు విజయవాడకు చేరనున్న విగ్రహం
- విజయవాడ స్వరాజ్య మైదానంలో రాత్రి, పగలు శ్రమిస్తున్న 400 మంది
- ఏప్రిల్ 14న విగ్రహావిష్కరణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పనులకు గతేడాది డిసెంబర్ 22న శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. పనుల పురోగతిపై మంత్రుల కమిటీ, అధికారులు ప్రతివారం సమీక్షిస్తున్నారు. దీంతో అతి తక్కువ సమయంలోనే రికార్డు స్థాయిలో పనులు పూర్తికావచ్చాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతికి ఈ విగ్రహాన్ని ప్రారంభించేలా 400 మంది సిబ్బంది రాత్రి, పగలు శ్రమిస్తున్నారు.


విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న పనులు

విగ్రహ నిర్మాణంలో ప్రత్యేకతలెన్నో..

గత టీడీపీ ప్రభుత్వం అమరావతిలోని ఒక మారుమూల ప్రాంతంలో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటు చేస్తామని హడావుడి చేసి ఆ ప్రాజెక్టును అటకెక్కించింది. వైఎస్ జగన్ అధికారం చేపట్టిన వెంటనే విజయవాడ నగర నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు 2020 జూలైలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు కాంట్రాక్టు సంస్థను ఖరారు చేశారు. డిజైన్లు పూర్తి చేసి గతేడాది డిసెంబర్‌లో పనులు చేపట్టారు. దాదాపు వంద అడుగుల ఎత్తైన పీఠం(ఫెడస్టాల్)పై 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. దీంతో 225 అడుగుల ఎత్తుతో దేశంలో ఈ విగ్రహం కూడా ప్రత్యేకంగా నిలవనుంది. హరియాణాలోని నాథురామ్ ఆర్ట్స్ చేపట్టిన విగ్రహ తయారీ పనులను మంత్రుల కమిటీ ఇటీవల పరిశీలించింది. 125 అడుగుల విగ్రహాన్ని 1200 ముక్కలు (భాగాలు)గా తయారు చేసే పని దాదాపు 40 శాతం పూర్తి అయ్యింది. ఈ విగ్రహాన్ని జనవరి నెలాఖరు నాటికి విజయవాడకు తరలించనున్నారు. అలాగే విగ్రహం ఏర్పాటుకు సపోర్టుగా ఉండేందుకు 125 అడుగుల ఎత్తైన స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్రేమ్‌ను హైదరాబాద్‌లోని నాచారంలో వేగంగా రూపొందిస్తున్నారు. 350 టన్నుల స్టీల్‌తో ఇది తయారవుతోంది. దీన్ని నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక విగ్రహం ఏర్పాటు కోసం విజయవాడలో చేపట్టిన మొదటి దశ పనులను జనవరి 18 నాటికి పూర్తి చేయనున్నారు. రెండో దశ పనుల్లో భాగంగా కన్వెన్షన్ సెంటర్, బేస్‌మెంట్ పార్కింగ్ జీ ప్లస్ 2, పరిసరాల అభివృద్ధి పనులను కూడా వేగంగా పూర్తి చేస్తామని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు.

'అమరజీవి' త్యాగాన్ని తెలుగుజాతి మరువదు

- పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ సభలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగుజాతి ఎన్నటికీ మరువదని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మండేపూడి ఆనందకుమార్ ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. వీరభద్రస్వామి మాట్లాడుతూ..తెలుగు జాతి అభ్యున్నతి కోసం పొట్టిశ్రీరాములు ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఉద్యమించారన్నారు. వారి త్యాగాలను నేటి తరం స్మరించుకోవాలన్నారు. వారి వారసులుగా పిలిపించుకోవటంలో ఆర్యవైశ్యులు ఎంతో గర్విస్తారని చెప్పారు. అటువంటి మహనీయుల విగ్రహాలను చూసి వారిని స్మరించుకోవడం ద్వారా ఎంతో స్ఫూర్తిని పొందుతారన్నారు. అలాంటి మహనీయుల విగ్రహాలను, దేవతల ఆలయాలను చంద్రబాబు ధ్వంసం చేశారని వీరభద్రస్వామి మండిపడ్డారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ విజయవాడలో అన్ని గుళ్ళు కూల్చేసి మరుగుదొడ్లు కట్టిన దుర్మార్గుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. స్థానిక కార్పొరేటర్ మండెపూడి చటర్జీ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సమాచార హక్కు చట్టం కమిషనర్ రేపాల శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి తదితరులు

సినీ పరిశ్రమకు అండగా నిలిచిన సీఎం జగన్

- ప్రముఖ సంగీత దర్శకుడు కోటి
- గుంటూరులో ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ

పాత గుంటూరు: తెలుగు సినీ పరిశ్రమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్.కోటి చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో గానగంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి గుంటూరు నగరం నడిబొడ్డున స్థానం కల్పించారని తెలిపారు. గుంటూరు నాజ్ సెంటర్‌లోని ఐలాండ్‌లో కళాదర్బార్ సంస్థ వ్యవస్థాపకుడు పాతూరి రంగారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత దర్శకులు కోటి... ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలిసి బాలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ బాలు తన మొదటిపాట నుంచి అన్ని పాటలు పాడి తనను ఆశీర్వదించారని అన్నారు. అలాంటి మహానుభావుడి విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం కల్పించిన రంగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలు పాడిన పాటలను కోటి ఆలపించి అభిమానులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో విగ్రహ శిల్పి రాజ్‌కుమార్ వడయార్, కార్పొరేటర్లు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బాలు విగ్రహావిష్కరణలో సంగీత దర్శకుడు కోటి తదితరులు

ఎకరాకు రూ.20 లక్షల పరిహారం

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షలు
- ప్రతి కుటుంబం ఇంటి నిర్మాణానికి ఐదుసెంట్ల స్థలం
- ఇంట్లో ఒకరికి ఉద్యోగం
- భావనపాడు పోర్టును మూలపాడు పోర్టుగా మారుస్తాం
- మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి: ఉత్తరాంధ్ర పారిశ్రామికవాడగా అభివృద్ధి చెందడానికి మూలపేట, విష్ణుచక్రం గ్రామాల వారి త్యాగం చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చెప్పారు. వారు ఆదివారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్టు నిర్మాణంపై సంతబొమ్మాళి మండలంలోని మూలపేట గ్రామంలో మూలపేట, విష్ణుచక్రం గ్రామాల వారితో సమావేశమయ్యారు. ఆ గ్రామాల వారికి ఇవ్వనున్న పరిహారం వివరాలు తెలిపారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ పోర్టు వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని చెప్పారు. ఎకరాకి రూ.20 లక్షల చొప్పున రైతులకు పరిహారం ఇస్తామన్నారు.



జిల్లాలో అత్యధిక పరిహారం ఇదేనని తెలిపారు. ఇంటికి విలువ కట్టి రెట్టింపు పరిహారం ఇస్తామని చెప్పారు. వాస్తు ప్రకారం లేఅవుట్‌లు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి ఐదుసెంట్ల స్థలం ఇంటి నిర్మాణానికి ఇస్తామని, మోడల్ ఆర్ అండ్ ఆర్ కాలనీగా మారుస్తామని పేర్కొన్నారు. 18 ఏళ్లు దాటిన వారికి రూ.10 లక్షల పీడీఎఫ్ ప్యాకేజీ ఇస్తామన్నారు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇప్పిస్తామని, భావనపాడు పోర్టును మూలపేట పోర్టుగా మారుస్తామని హామీ ఇచ్చారు. నవంబర్ చివరిలోగానీ, డిసెంబర్ మొదటి వారంలోగానీ మూలపేట పోర్టుకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ పోర్టు వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వసంతరెడ్డి పాల్గొన్నారు.

ఐక్యతా పరుగు..!

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం జాతీయ ఐక్యతా దినోత్సవం (సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి) సందర్భంగా ఐరన్‌మ్యాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరుగు పోటీ నిర్వహించారు.ఏపీ, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన 2,500 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహక సంఘం కార్యదర్శి, ఐఆర్ఎస్ అధికారి ఉండేల రామనాథరెడ్డిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అభినందించారు. - ప్రొద్దుటూరు కల్చరల్

పరుగు పోటీలో క్రీడాకారులు


1,133 ఆవ గింజలతో వల్లభాయ్ పటేల్ చిత్రం

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రోరైటర్ రవికుమార్ ఆవ గింజలతో సర్దార్ వల్లభాయ్ పటేల్ ముఖచిత్రాన్ని రూపొందించాడు. ఎన్నో చిత్రాలను తోటకూర, ఆవ గింజలతో తయారు చేస్తోన్న రవికుమార్ ఈ నెల 31న వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని తయారు చేశాడు. 1,133 ఆవ గింజలను వినియోగించి ఈ చిత్రాన్ని రూపొందించారు. - మాకవరపాలెం



మైనార్టీ రిజర్వేషన్.. మెజార్టీ ఫలాలు


చిన్న తురకపాలెం గ్రామ ఏరియల్ వ్యూ

- ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన దివంగత నేత వైఎస్సార్
- కలసి వచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం
- భారీగా లాభపడ్డ చిన్న తురకపాలెం గ్రామ యువత
- చిన్న ఊళ్లో 29 మంది డాక్టర్లు.. 100 మందికి పైగా ఇంజనీర్లు
- ఇదంతా మహానేత చలువే అంటున్న గ్రామస్తులు

సాక్షి, నరసరావుపేట : తాతల నాటి ఆస్తులంటూ లేవు. నాన్న కూడబెట్టిన సంపద అసలే లేదు. ఫీజు కడదామంటే డబ్బులుండవు. చదువుకుందామనే ఆసక్తి ఉన్నా, కుటుంబ పరిస్థితుల రీత్యా మధ్యలోనే చదువు మాని ఏదో పని వెతుక్కోవాలి. దశాబ్దన్నర క్రితం వరకు ఆ గ్రామ విద్యార్థుల పరిస్థితి ఇది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింల సంక్షేమం కోసం వారిని 'బీసీ–ఈ'గా గుర్తిస్తూ రిజర్వేషన్లు కల్పించడం వరంగా మారింది. తద్వారా వందలాది మంది ఉద్యోగాలు పొందారు. ధనికులకే పరిమితమైన వైద్య విద్యలో సైతం పదుల సంఖ్యలో నిరుపేదలు ఉచితంగా సీట్లు పొందారు. డాక్టర్లుగా స్థిరపడ్డారు. రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుంటూ మరెందరో ఉన్నత ఉద్యోగాలు సాధించి, గ్రామంలో సామాజిక, ఆర్థిక మార్పులకు శ్రీకారం చుట్టారు.

ప్రతి వీధికో డాక్టర్..

పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలం చిన్న తురకపాలెం గ్రామంలో మొత్తం మైనార్టీలే ఉంటారు. 750 దాకా ఇళ్లు ఉన్న ఈ గ్రామంలో దాదాపు 4 వేల జనాభా ఉంది. గతంలో ఆ గ్రామస్తులు మొత్తం కేవలం పాత గోనె సంచులతో వాన పట్టలు (టార్పాలిన్ తరహాలో) కుట్టి, వాటి అమ్మకం ద్వారా జీవనం సాగించే వారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాక ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇవ్వడంతో పాటు, ఉన్నత చదువులు చదువు కోవడానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించారు. ఈ అవకాశాలను వారు సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. 2004కు ముందు ఈ గ్రామంలో ఉన్నత చదువులు చదివిన వారిని వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఉద్యోగం చేస్తున్న, లేదా ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారు కనిపిస్తున్నారు. ఇప్పటికే ఏడుగురు ఎంబీబీఎస్ పూర్తి చేయగా, మరో 22 మంది డాక్టర్ విద్యను అభ్యసిస్తున్నారు. వంద మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉండగా, మరో 200 మందికి పైగా ఇంజనీరింగ్ చదువుతున్నారు. 14 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ కొలువుల్లో ఉన్నారు. పిల్లలు వృద్ధిలోకి రావడంతో 50 శాతం మంది గోనె పట్టలు కుట్టే వృత్తి నుంచి తప్పుకున్నారు. పలువురు వివిధ వ్యాపారాలు ప్రారంభించారు. ప్రతి విద్యార్థి ఇప్పుడు బడిబాట పట్టారు. వైఎస్సార్ హయాంలో గ్రామంలో 420 కుటుంబాలకు పక్కా ఇళ్లను నిర్మించారు. మూడు పూటలా తినడానికి తిండి లేని స్థితి నుంచి.. ఇప్పుడు మరొకరికి పెట్టే స్థితికి వచ్చామంటే అది మహానేత వైఎస్సార్ చలువే అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కళ్ల ముందే ఎంతో మార్పు..



మా గ్రామంలో 2005కు ముందు ఉన్నత చదువులు చదువుకున్న వారు చాలా తక్కువ. వైఎస్సార్ దేవుడిలా 4 శాతం రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశ పెట్టి, మా గ్రామంలో వందలాది మంది యువత ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు వచ్చేలా చూశారు.
– మహమ్మద్ అలీ, రిటైర్డ్ హెడ్‌మాస్టర్

ఆ ధైర్యంతోనే పీజీకి సిద్ధమవుతున్నా..



మాది సామాన్య కుటుంబం. మా నాన్న గోతాల వ్యాపారం చేసే వారు. వైద్యంలో పీజీ పూర్తి చేసి, ప్రజలకు సేవలందించాలనేది నా కోరిక. బీసీ–ఈ కోటాలో ఒంగోలు మెడికల్ కళాశాలలో నాకు మెడిసిన్ సీటు వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకుంటూ ఎంబీబీఎస్ పూర్తి చేశాను. రిజర్వేషన్ ఉందనే ధైర్యంతోనే ఇప్పుడు పీజీకి సన్నద్ధం అవుతున్నా. బీసీ–ఈ రిజర్వేషన్ మాలాంటి వాళ్లకు గొప్ప వరం.
– డా. షేక్ సిలార్ రుక్సానా, చిన్న తురకపాలెం

రిజర్వేషన్ వల్లే ఎంబీబీఎస్ చదువుతున్నా



మా నాన్న దినసరి కూలీ. మాకు గ్రామంలో సెంట్ వ్యవసాయ భూమి కూడా లేదు. నీట్‌లో 4,700 ర్యాంక్ వచ్చింది. 4 శాతం రిజర్వేషన్ వల్ల శ్రీకాకుళం నిమ్స్‌లో సీటు లభించింది. వైఎస్సార్ విప్లవాత్మక నిర్ణయం వల్లే నేను డాక్టర్ కాబోతున్నాను. సామాన్యులు ఎంబీబీఎస్ చేయాలంటే మామూలు విషయం కాదు. ప్రభుత్వ కళాశాలలో సీటు రావాలన్న నా కోరికను బీసీ–ఈ రిజర్వేషన్ తీర్చింది.
– షేక్ బాదర్ ఆఫ్రిది, ఎంబీబీఎస్ మూడో ఏడాది, శ్రీకాకుళం నిమ్స్

తినడానికి సైతం కష్టపడ్డాం..



మా నాన్న మత ప్రార్థనలు చేయడం వల్ల నెలకు రూ.వెయ్యి ఇచ్చేవారు. ఉన్నత చదువులు చదివించడం అసాధ్యమన్న సమయంలో వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్, 4 శాతం రిజర్వేషన్ల వల్ల మంచి కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశాను. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వల్ల ఇప్పుడు నెలకు రూ.2 లక్షలు సంపాదిస్తున్నాను. మా అన్న అబ్దుల్ రహ్మాన్ ఎంటెక్ పూర్తి చేసి ప్రస్తుతం సౌత్‌ఆఫ్రికాలో నెలకు రూ.4 లక్షలకు పైగా జీతం పొందుతున్నారు. – ఇర్షాద్ అహ్మద్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

రైతుల ముసుగులో చేస్తున్న దొంగ ఉద్యమానికి కాలం చెల్లింది

763వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : వికేంద్రీకరణ ఫలాలు భావితరాలకు అందించడం ద్వారా పదింతల అభివృద్ధి జరుగుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 763వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అధికారం కోసం పాకులాడుతున్న ఓ సామాజిక వర్గం రాష్ట్ర ప్రజలకు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదన్నారు. రాజధాని పేరుతో ఉద్యమాలు చేస్తున్న వారిలో ఒక్క సెంటు కూడా పూలింగ్‌కు ఇవ్వని వారే ఎక్కువగా ఉన్నారని విమర్శించారు. రైతుల ముసుగులో పెట్టుబడిదారులు చేస్తున్న దొంగ ఉద్యమానికి కాలం చెల్లిందని స్పష్టం చేశారు. బాబు అండ్ కో విశాఖ, కర్నూలు ప్రాంతాల్లో రాజధానులు వద్దనడం దారుణమని మండిపడ్డారు. అమరావతి పేరుతో చంద్రబాబు చేసిన అవినీతి లీలలు, గ్రాఫిక్స్‌తో ఎల్లో మీడియాలో చేసిన బాగోతాలన్నీ ప్రజలకు తెలిసిపోయాయన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విశాఖలో టీడీపీ, వైఎస్సార్‌సీపీల భూకబ్జాలు

బీజేపీ నేతలు జీవీఎల్, సోము వీర్రాజు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): విశాఖలో జరిగిన భూ కబ్జాలే బీజేపీ ప్రధాన ఎన్నికల అజెండా అని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. విశాఖతో పాటు రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాల్లో పేదల భూములు జీవో 22ఏలో చేర్చడంపై గత కొంతకాలంగా బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. ఇటీవల ఈ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లగా.. 22ఏ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి గవర్నర్ సిపార్సు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విశాఖ పార్టీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుతో కలిసి మీడియాతో మాట్లాడారు. విశాఖలో వేల కోట్ల విలువైన భూములను వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలు కబ్జాలు చేశారని జీవీఎల్ ఆరోపించారు. వారిని ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామన్నారు. విశాఖలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదేనన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
GM (ఆక్షన్స్) కార్యాలయం, మార్కెటింగ్ శాఖ
ఇ-వేలం ప్రకటన
406 లాట్ల ఉపయోగించిన /డ్యామేజ్ అయిన వస్త్రాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ e-KONUGOLU పోర్టల్‌లో 14.11.2022 నుండి 21.11.2022 వరకు నిర్వహించబోయే ఇ-వేలం ద్వారా TTD డిస్పోజ్ చేస్తున్నది. తదుపరి వివరాల కోసం www.konugolu.ap.govt.in/www.tirumala.orgకు లాగాన్ కావలెను లేదా 0877-2264429ను సంప్రదించగలరు.
Roc No.PR4/13947/Adv.No.268/PRO/2022, Dt:30.10.2022 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సునామీ భయం ప్రాణాలు తోడేసింది

మనీలా: సునామీ భయం ఫిలిప్పీన్స్ పర్వతప్రాంత ప్రజల ప్రాణాలు తీసింది. అక్కడ కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం భారీ అలలు వచ్చి పడటంతో సునామీ ముంచుకొస్తోందని మగుందనావో ప్రావిన్స్‌లోని కుసియాంగ్ గ్రామవాసులు భయపడ్డారు. గతంలో ఆ గ్రామాన్ని భయంకర సునామీ ముంచెత్తింది. నాటి నేటికీ వెంటాడుతున్నాయి. దాంతో వారంతా హుటాహుటిన కొండ వద్దకు చేరుకున్నారు. అప్పటికే కుండపోతగా కురుస్తున్న వర్షాల ధాటికి అక్కడ మట్టి, బురదచరియలు విరిగిపడి ఉన్నాయి. ఆ ఊబిలో చిక్కి దాదాపు 20 మంది సజీవ సమాధి అయ్యారు. అయితే, ఈసారి మృత్యువు మరో రూపంలో వారిని కబళించింది. వాయవ్య ఫిలిప్పీన్స్‌ను అతలాకుతలం చేస్తున్న నాల్గే తుపాను కారణంగా ఆయా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ తుపాను ప్రభావ వర్షాల కారణంగానే కుసియాంగ్ గ్రామంలో బురదచరియలు విరిగిపడ్డాయి. 'ఏటా ఇక్కడి వారు సునామీ వస్తే ఎలా అప్రమత్తంగా ఉండాలనేది ప్రాక్టీస్ చేస్తూ ఉంటారు. ఘటన జరిగినప్పుడు సైతం వార్నింగ్ బెల్స్ మోగడంతో చాలా మంది కొండ వద్ద ఉన్న చర్చి వద్దకు పరుగులు తీశారు. అదే వారి ఉసురు తీసింది'' అని ఆ ప్రావిన్స్ మంత్రి చెప్పారు.

క్లుప్తంగా...

151కి చేరుకున్న సియోల్ తొక్కిసలాట మృతులు

సియోల్ : దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో ఇటావెన్‌లో జరిగిన హాలోవీన్ పార్టీలో తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య 151కి పెరిగింది. మృతుల్లో అత్యధికులు టీనేజ్ నుంచి 20 ఏళ్ల వయసు వారే. తొక్కిసలాట ప్రాంతంలోనూ, ఆస్పత్రి వద్ద దృశ్యాలు గుండెల్ని పిండేస్తున్నాయి. పార్టీకి ఏకంగా లక్ష మంది హాజరు కావడం, పార్టీకి వెళ్లే ప్రాంతానికి వెళ్లే వీధి ఇరుగ్గా ఉండడంతో ఈ దుర్ఘటన జరిగింది. తొక్కిసలాటలో ఊపిరాడక నిస్తేజంగా కింద పడిపోయిన యువతీయువకుల్ని చూసి అందరూ కంటతడి పెట్టుకుంటున్నారు.

ఢిల్లీకి మళ్లీ గాలాడటం లేదు!

న్యూఢిల్లీ: దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వాయు నాణ్యత అధ్వాన్నంగా మారింది. ఆదివారం నమోదైన వాయు కాలుష్య సూచీలో పంట వ్యర్థాల వాటా ఏకంగా 26 శాతానికి చేరింది! పంట వ్యర్థాల వాటా ఇంతగా పెరగడం ఈ ఏడాదిలో ఇదే తొలిసారి. 24 సగటు వాయు నాణ్యత సూచీ(ఏక్యూఐ) ఆదివారం ఆనంద్ విహార్ ప్రాంతంలో అత్యంత ప్రమాదకర స్థాయిలో 449కు పెరిగింది. పరిస్థితి మరింత దిగజారకుండా చూసేందుకు ఢిల్లీ సర్కార్ రంగంలోకి దిగింది. నిర్మాణ రంగ కార్యకలాపాల నిలిపివేత, నిర్మాణాల కూల్చివేతలపై నిషేధం తదితర ఆంక్షల కఠిన అమలును పర్యవేక్షించేందుకు 586 బృందాలను క్రియాశీలకం చేసింది. ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్(సీఏక్యూఎం) పలు ఆంక్షలను విధిస్తూ శనివారం నిర్ణయం వెలువరించడం తెల్సిందే.

రుణ యాప్‌లపై తక్షణ చర్యలు

న్యూఢిల్లీ : చైనా నియంత్రణలో ఉన్న రుణాల యాప్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ రాష్ట్రాల పోలీసు వ్యవస్థల్ని ఆదేశించింది. ఈ యాప్‌ల ద్వారా రుణాలిచ్చిన తర్వాత బకాయి వసూళ్లకు వేధింపులు, బ్లాక్ మెయిల్ చేయడం వంటివి చేస్తూ ప్రజల్ని దోపిడి చేస్తూ ఉండడంతో పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఈ యాప్‌లతో జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థ, పౌరుల రక్షణపై తీవ్రమైన వ్యతిరేక ప్రభావం పడుతోందని కేంద్ర హోంశాఖ పేర్కొంది.

వందకు చేరిన మరణాలు

మొగదిషు(సోమాలియా): శనివారం సోమాలియా దేశ రాజధాని నగరం మొగదిషులో జరిగిన రెండు జంట కారు బాంబు పేలుళ్ల ఘటనలో మరణాల సంఖ్య వందకు చేరుకుందని ఆ దేశ అధ్యక్షుడు హసన్ షేక్ ఆదివారం ప్రకటించారు. రద్దీగా ఉండే ప్రాంతంలో పేలుళ్లు సంభవించడంతో మరో 300 మంది గాయాలపాలయ్యారని ఆయన చెప్పారు. గత ఐదేళ్లకాలంలో సోమాలియాలో జరిగిన అతిపెద్ద దాడి ఇదే కావడం గమనార్హం. విద్యాశాఖ కార్యాలయం గోడ వద్ద తొలి పేలుడు జరగ్గా, రద్దీగా ఉన్న ఒక రెస్టారెంట్ ముందు మరో కారు బాంబు పేలింది. అల్ ఖైదా ప్రోద్బలంతో పనిచేసే అల్ సబాబ్ ఉగ్ర సంస్థే ఈ పేలుళ్లు జరిపి ఉంటుందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. గతంలో చాలా సార్లు మొగదిషులో అల్‌సబాబ్ సంస్థే పేలుళ్లకు తెగబడింది.

ఉమ్మడి పౌరస్మృతిపై బీజేపీ ఉద్దేశమేంటి: కేజ్రీవాల్

భావ్‌నగర్: ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)పై అధికార బీజేపీ అసలు ఉద్దేశాన్ని బయటపెట్టాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. నిజంగా ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి రావాలని బీజేపీ కోరుకుంటే దేశవ్యాప్తంగా ఒకేసారి అమలు చేయాలని అన్నారు.


బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా హిమాచల్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇలా...

మరో మూడేళ్లలో 'ఎగిరే కారు'

కృషి చేస్తున్న అలెఫ్ ఏరోనాటిక్స్ సంస్థ

వాషింగ్టన్: గాల్లో ప్రయాణించే కారు.. ఈ వార్త కొత్తదేమీ కాకపోయినా ఇలాంటి వాహనం ఇంకా అందుబాటులోకి రాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఇతర కంపెనీల కంటే తామే ముందుగా ఎగిరే కారును మార్కెట్‌లోకి తీసుకురావాలని అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్ మాటియోలో ఉన్న అలెఫ్ ఏరోనాటిక్స్ అనే సంస్థ తీవ్రంగా కృషి చేస్తోంది. మరో మూడేళ్లలోపే మార్కెట్‌లోకి తీసుకొస్తామని చెబుతోంది. గాలిలో ప్రయాణించే కారు తయారీలో అలెఫ్ ఏరోనాటిక్స్ ఇంజనీర్లు నిమగ్నమయ్యారు. ఈ కారులో 8 ప్రొపెల్లర్స్, చుట్టూ జల్లెడ లాంటి బాడీ ఉంటుందని చెబుతున్నారు. ఇది నిలువుగా గాల్లోకి ఎగురుతుంది. నిర్దేశిత ఎత్తుకు చేరుకున్న తర్వాత 90 డిగ్రీలు మళ్లుతుంది. అనంతరం వేగంగా గాల్లో దూసుకెళ్తుంది. ఎగిరే కారు ధర 3 లక్షల డాలర్లు (రూ.2.47 కోట్లు) ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకంగా రన్‌వే అవసరం లేదని, సాధారణ రోడ్లపై కూడా ఈ కారును టేకాఫ్ చేయొచ్చని ఇంజనీర్లు వెల్లడించారు. గాలిలో గంటకు 260 మైళ్ల (418.429 కిలోమీటర్లు) వేగంతో ప్రయాణిస్తుందని చెప్పారు. ఇది పూర్తిగా విద్యుత్‌తో నడిచే ఎలక్ట్రిక్ కారు. 2025 నుంచి విక్రయాలు ప్రారంభించనున్నారు.



సౌర, అంతరిక్ష రంగాల్లో భారత్ అద్భుతాలు

ప్రపంచమే అబ్బురంగా చూస్తోంది: మోదీ ● త్వరలో దేశమంతటా సూర్యగ్రామాలు



వడోదరలో సి–295 విమాన తయారీ కేంద్రంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ''సౌర, అంతరిక్ష రంగాల్లో భారత్ అద్భుతాలు చేస్తోంది. ఆ రంగాల్లో మనం సాధిస్తున్న విజయాలను చూసి ప్రపంచమే ఆశ్చర్యపోతోంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 36 ఉపగ్రహాలను ఇస్రో ఒకేసారి విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రయోగించడాన్ని దేశానికి యువత ఇచ్చిన ప్రత్యేక దీపావళి కానుకగా అభివర్ణించారు. ఆదివారం నెలవారీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''స్వయంసమృద్ధి దిశగా మా ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది తాజా తార్కాణం. ఒకప్పుడు మనకు క్రయోజనిక్ రాకెట్లు ఇచ్చేందుకు నిరాకరించారు. కానీ మన శాస్త్రవేత్తలు దాన్ని సవాలుగా తీసుకుని దేశీయ పరిజ్ఞానం సాయంతోనే వాటిని నిర్మించి చూపించారు. ఇప్పుడు పుంఖాను పుంఖాలుగా ఉపగ్రహాలను పంపి చూపుతున్నారు. ఫలితంగా ప్రపంచ అంతరిక్ష వాణిజ్య మార్కెట్లో భారత్ పెద్ద శక్తిగా నిలిచింది. అంతరిక్షంలోనూ ప్రైవేటు రంగానికి తలుపులు తెరవడంతో కొత్త స్టార్టప్‌లు పుట్టుకొచ్చి విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి'' అన్నారు.

పాత సవాళ్లు వదిలేద్దాం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ప్రతి భారతీయుడికి ఒక గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పాత సవాళ్లను ఇక వదిలేద్దామని, నూతన అవకాశాల నుంచి లబ్ధి పొందుదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన రోజ్‌గార్ మేళానుద్దేశించి ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. వేగవంతమైన అభివృద్ధి కోసం కొత్తగా ఆలోచించాలని, కొత్త మార్గంలో పయనించాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమానంగా అందాలన్నదే తమ ఆశయమని ఉద్ఘాటించారు. మనమంతా కలిసి జమ్మూకశ్మీర్‌ను ఉన్నత శిఖరాలను చేర్చుదామని పిలుపునిచ్చారు. 21వ శతాబ్దంలో ప్రస్తుత దశాబ్దం జమ్మూకశ్మీర్ చరిత్రలో చాలా ముఖ్యమైన దశాబ్దమని చెప్పారు. పాత సవాళ్లను పక్కనపెట్టాల్సిన సమయం వచ్చిందన్నారు. జమ్మూకశ్మీర్‌లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికై, రోజ్‌గార్ మేళాలో నియామక పత్రాలు అందుకున్న 3,000 మంది యువతకు ప్రధాని మోదీ అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మరో 700 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేయడానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

తయారీ హబ్‌గా భారత్

వడోదర: రవాణా విమానాల తయారీలో భారత్ అగ్రగామిగా మారబోతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గుజరాత్‌లోని వడోదరలో రూ.22 వేల కోట్లతో యూరోపియన్ సి–295 మధ్యతరహా రవాణా విమానాల తయారీ కేంద్రానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. భారత వైమానిక దళం(ఐఏఎఫ్) కోసం ఈ విమానాలను తయారు చేయబోతున్నారు. ప్రపంచంలో భారత్ అతిపెద్ద తయారీ హబ్‌గా అవతరించిందని నరేంద్ర మోదీ ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో ఆర్థిక సంస్కరణ విషయంలో నూతన చరిత్రను రాస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు స్థిరంగా, దార్శనికతతో కూడి ఉన్నాయన్నారు. కొత్త మైండ్‌సెట్, కొత్త వర్క్‌కల్చర్‌తో ఇండియా ముందడుగు వేస్తోందని చెప్పారు. పెద్ద పెద్ద వాణిజ్య విమానాలు కూడా మన దేశంలో తయారయ్యే రోజులను మనం చూడబోతున్నామని తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా'తోపాటు 'మేక్ ఫర్ వరల్డ్' అనేదే మన నినాదమని వివరించారు. సి–295 ఎయిర్‌క్రాఫ్ట్‌లతో భారత వైమానిక దళం బలోపేతం కావడంతోపాటు మనదేశంలో విమానయాన రంగానికి ప్రోత్సాహం లభిస్తుందని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఆ దిశగా ఇదొక మైలురాయి అని అభివర్ణించారు.

మొదెరా స్ఫూర్తి: ప్రపంచమంతా పర్యావరణహిత సౌర విద్యుత్ కేసి మళ్లుతోందని మోదీ అన్నారు. ''పీఎం కుసుమ్ యోజన ద్వారా ఎంతోమంది ఇళ్లపై సోలార్ ప్లాంట్లు పెట్టుకున్నారు. కరెంటు బిల్లులు తగ్గించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి లాభపడుతున్నారు. గుజరాత్‌లోని మొదెరా దేశంలో తొలి సోలార్ గ్రామంగా నిలిచింది. ఈ స్ఫూర్తితో దేశమంతటా సూర్యగ్రామ్‌లు వెలుస్తాయి. ఇది త్వరలోనే భారీ ప్రజా ఉద్యమంగా మారడం ఖాయం'' అని జోస్యం చెప్పారు.

కోమాలో ఉంటూ బిడ్డకు జన్మ..

ఢిల్లీ ఎయిమ్స్‌లో అరుదైన సంఘటన

న్యూఢిల్లీ: ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై, ఆసుపత్రిలో చేరి 7 నెలలుగా కోమాలోనే ఉంటున్న ఓ గర్భిణి పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ అరుదైన సంఘటన ఢిల్లీ ఎయిమ్స్‌లో గత వారం చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్ షహర్‌కు చెందిన 23 ఏళ్ల షఫియా రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఈ ఏడాది ఏప్రిల్ 1న ఆమెను ఎయిమ్స్‌కు తీసుకొచ్చారు. ప్రమాదం జరిగినప్పుడు షఫియా 40 రోజుల గర్భంతో ఉంది. అప్పటినుంచి ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. 18 వారాల గర్భంతో ఉన్నప్పుడు వైద్యులు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేశారు. గర్భంలో శిశువు ఆరోగ్యంగానే ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 22వ తేదీన సాధారణ ప్రసవం జరిగింది. పూర్తి ఆరోగ్యంగా ఉన్న ఆడ శిశువు జన్మించిందని వైద్యులు చెప్పారు. షఫియా ఇంకా కోమాలోనే ఉందని, కోలుకునే అవకాశాలు 10–15 శాతం మాత్రమే ఉన్నాయని న్యూరోసర్జన్ డాక్టర్ దీపక్ గుప్తా వెల్లడించారు.

లిజ్ ట్రస్ ఫోన్ హ్యాక్?

లండన్ : బ్రిటన్ మాజీ ప్రధాని లిజ్ ట్రస్ ఫోన్ హ్యాకింగ్ వార్తలు కలకలం రేపుతున్నాయి. విదేశాంగ మంత్రిగా ఉండగా ఆమె ఫోన్‌ను రష్యా అధ్యక్షుడు పుతిన్ కోసం పని చేసే రష్యా గూఢచారులు హ్యాక్ చేసి సున్నితమైన సమాచారాన్ని తస్కరించారని డెయిలీ మెయిల్ పేర్కొంది. మూడు నెలల క్రితం ట్రస్ ప్రధాని రేసులో ఉన్న సమయంలో ఈ విషంలో బయటకు వచ్చినా నాటి ప్రధాని బోరిస్ జాన్సన్ దానిని రహస్యంగా ఉంచారని పేర్కొంది.



కట్టింది 1880లో...!

తీగల సాయంతో వేలాడే మోర్బీ సస్పెన్షన్ బ్రిడ్జిపై నడవడం సందర్శకులకు మధురానుభూతి కలిగిస్తుంది. నిత్యం వందలాది మంది దీన్ని సందర్శిస్తుంటారు. ఇది 140 ఏళ్ల నాటిది! 1879 ఫిబ్రవరి 20న అప్పటి ముంబై గవర్నర్ రిచర్డ్ టెంపుల్ దీని నిర్మాణాన్ని ప్రారంభించారు. 1880లో నిర్మాణం పూర్తయ్యింది. ఇందుకు అప్పట్లోనే రూ.3.5 లక్షలు ఖర్చయ్యాయి. వంతెన పొడవు 765 అడుగులు (233 మీటర్లు). వెడల్పు 1.25 మీటర్లు. దీని నిర్మాణానికి అవసరమైన సామగ్రిని ఇంగ్లండ్ నుంచి తెప్పించారు. ఇది మోర్బీ పట్టణంలోని దర్బార్‌గఢ్, నజార్‌బాగ్ ప్రాంతాలను అనుసంధానిస్తుంది. దీన్ని చారిత్రక వారసత్వ కట్టడాల జాబితాలో చేర్చారు.


తెగిన బ్రిడ్జిపై చిక్కుబడ్డ బాధితులు

91 మంది మృతి


ప్రమాదానికి ముందు జనంతో కిటకిటలాడుతున్న తీగల వంతెన

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. సాయమందేదాకా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. వారి హాహాకారాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డవాళ్లు, స్థానికులు వీలైనంత మందిని కాపాడే ప్రయత్నం చేశారు. అనంతరం ప్రభుత్వ సిబ్బంది వారికి జత కలిశారు. బాధితులను పడవల్లో ఒడ్డుకు చేర్చారు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చని అధికారులు వెల్లడించారు. 60 దాకా మృతదేహాలను నది నుంచి వెలికితీశారు. జాతీయ విపత్తు సహాయక బృందాలూ రంగంలోకి దిగాయి. అర్ధరాత్రి దాటాక కూడా వెలికితీత చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సామర్థ్యానికి మించిన భారమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదానికి ముందు చాలామంది వంతెనపై గంతులు వేస్తూ, దాని వైర్లను లాగుతూ కన్పించారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

వంతెన ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత రాహుల్ గాంధీ, పలు రాష్ట్రాల సీఎంలు తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గుజరాత్‌లోనే ఉన్న మోదీ దీనిపై సీఎం భూపేంద్ర పటేల్‌తో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ వచ్చారు. బాధితులకు అవసరమైన అన్నిరకాల సాయమూ అందించాలని ఆదేశించారు. సీఎం అన్ని కార్యక్రమాలూ రద్దు చేసుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలని ఆదేశించారు. ప్రమాదంపై దర్యాప్తుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేశారు. మృతుల కుటుంబాలకు గుజరాత్ ప్రభుత్వం రూ.4 లక్షలు, కేంద్రం రూ.2 లక్షల పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు కేంద్ర, రాష్ట్రాలు చెరో రూ.50 వేలు ఇవ్వనున్నాయి. మోదీ అహ్మదాబాద్‌లో తలపెట్టిన రోడ్ షోను ప్రమాదం నేపథ్యంలో రద్దు చేసుకున్నారు.


సహాయక చర్యల్లో స్థానికులు..

1979లో బద్దలైన మచ్చూ డ్యాం...
వేలాదిమంది జలసమాధి

మోర్బీ పట్టణంలో తీగల వంతెన ప్రమాదం 1979లో ఇదే మచ్చూ నదిపై జరిగిన ఘోర దుర్ఘటనను మరోసారి గుర్తుకు తెచ్చింది. 1979 ఆగస్టు 11న మోర్బీ సమీపంలోని మచ్చూ–2 డ్యామ్ తెగిపోయింది. దాంతో పట్టణాన్ని భారీ వరద ముంచెత్తింది. ఈ విషాదంలో 2,000 మందికిపైగా చనిపోయారు. సౌరాష్ట్రలో కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించడానికి ఈ డ్యామ్‌ను 1972లో నిర్మించారు.


శవాలను వెలికితీస్తూ..

రక్షణ లేని బాల భారతం!

చిన్నారులపై ప్రతిఏటా పెరుగుతున్న నేరాలు
- 2021లో 53,874 పోక్సో కేసులు నమోదు
- బాల కార్మిక చట్టం కింద తెలంగాణలో 305 కేసులు
- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: దేశంలో బాలలపై నేరాల సంఖ్య ప్రతిఏటా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2021లో 53,874 పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్) కేసులు నమోదైనట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలను బట్టి స్పష్టమవుతోంది. బాలలపై జరిగే నేరాల్లో ప్రతి మూడింటిలో ఒకటి లైంగిక నేరమే కావడం గమనార్హం. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం.. దేశంలో బాలలపై నేరాలకు సంబంధించి 2020లో 1,28,531 కేసులు, 2021లో 1,49,404 కేసులు నమోదయ్యాయి. అంటే ఏడాదిలోనే కేసులు 16.2 శాతం పెరిగాయి. 2021లో పోక్సో చట్టం సెక్షన్ 4, 6 కింద 33,348 కేసులు నమోదయ్యాయి. వీటిలో 33,036 కేసులు బాలికలపై జరిగిన అఘాయిత్యాలకు, 312 కేసులు బాలురపై జరిగిన అఘాయిత్యాలకు సంబంధించినవి. దేశ వ్యాప్తంగా బాలల అపహరణలకు సంబంధించి గతేడాది 67,245 కేసులు నమోదయ్యాయి.

ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధిక నేరాలు

బాలలపై నేరాల వ్యవహారంలో కేంద్ర పాలిత ప్రాంతాల పరంగా చూస్తే ఢిల్లీలో అత్యధికంగా 7,783 కేసులు రిజిస్టరయ్యాయి. 2021లో 140 మంది చిన్నారులు అత్యాచారం, ఆపై హత్యకు గురయ్యారు. మరో 1,402 మంది కేవలం హత్యకు గురయ్యారు. అత్యధిక నేరాలు ఉత్తరప్రదేశ్‌లోనే బయటపడ్డాయి. గర్భంలోనే శిశువులను చిదిమేసినట్లు గతేడాది 121 కేసులు రిజిస్టరయ్యాయి. వీటిలో మధ్యప్రదేశ్‌లో 23, గుజరాత్లో 23 నమోదయ్యాయి. ఆత్మహత్య చేసుకొనేలా బాలలను ప్రేరేపించినట్లు 359 కేసులు వచ్చాయి. గత ఏడాది 49,535 మంది చిన్నపిల్లలు కనిపించకుండా పోయారు. గతేడాది బాల కార్మిక చట్టం కింద 982 కేసులు నమోదు చేశారు. వీటిలో అత్యధికంగా 305 కేసులు తెలంగాణ రాష్ట్రంలోనే నమోదు కావడం గమనార్హం. బాల్యవివాహ నిషేధ చట్టం కింద గతేడాది 1,062 కేసులు పెట్టగా, ఇందులో ఎక్కువ కేసులు కర్ణాటక, తమిళనాడు, అస్సాంలో నమోదయ్యాయి.

ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

- సీజేఐకి మమత విజ్ఞప్తి
- అధికారాలన్నింటినీ చెరబట్టారంటూ బీజేపీపై మండిపడ్డ బెంగాల్ సీఎం


కార్యక్రమంలో సీజేఐతో మమత

కోల్‌కతా: ''దేశంలో ప్రజాస్వామ్యం ఎక్కడుంది? అధికారాలన్నింటినీ క్రమంగా అధికార పార్టీ నేతృత్వంలోని ఒకే ఒక వర్గం చెరబడుతోంది. ఈ పెడ ధోరణి ఇలాగే కొనసాగితే దేశం అంతిమంగా అధ్యక్ష తరహా పాలనలోకి వెళ్లేందుకు ఎంతో కాలం పట్టదు'' అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆందోళన వెలిబుచ్చారు. ఈ పరిస్థితుల్లో దేశాన్ని కాపాడేందుకు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం తప్పనిసరని అభిప్రాయపడ్డారు. ఆదివారం నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్ (ఎన్‌యూజేఎస్) స్నాతకోత్సవంలో మమత పాల్గొన్నారు. వర్సిటీ చాన్సలర్ అయిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్‌తో సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. ''దయచేసి ప్రజాస్వామ్యాన్ని, దేశ సమాఖ్య వ్యవస్థను కాపాడండి'' అంటూ సీజేఐని అభ్యర్థించారు. ఏ అంశంపై అయినా కోర్టుల్లో తీర్పు వెలువరించడానికి ముందే మీడియా సొంత తీర్పులు ఇచ్చేస్తోందంటూ మండిపడ్డారు. ''వారు ఎవరినైనా నిందించొచ్చా? ఎవరి మీదైనా అభియోగాలు మోపొచ్చా? మా ప్రతిష్ట మాకు ప్రాణం. అది పోతే సర్వం పోయినట్టే. ఇలా మాట్లాడుతున్నందుకు మన్నించండి. తప్పయితే క్షమాపణలు చెబుతా. ప్రజలు న్యాయవ్యవస్థపై నమ్మకం కోల్పోయారని నేననడం లేదు. కానీ కొద్ది రోజులుగా పరిస్థితులు బాగా దిగజారుతున్నాయి. ప్రజలు నిశ్శబ్దంగా రోదిస్తున్నారు. వారి ఆక్రందనను న్యాయ వ్యవస్థ ఆలకించాలి. ఈ అన్యాయం బారి నుంచి కాపాడాలి'' అని సీజేఐని కోరారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 31 । అక్టోబర్ । 2022



ఐల్యాండ్‌లో సండే సందడి

భవానీ ద్వీపానికి పర్యాటకులు క్యూ కట్టారు. కార్తిక మాసం తొలి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో బోట్లు ఉదయం నుంచి అటు ఇటూ తిరుగుతూనే ఉన్నాయి.

-8లో



ఆర్యవైశ్యులది కీలక పాత్ర

జాతి నిర్మాణంలో ఆర్యవైశ్యులది కీలక పాత్ర అని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. భవానీపురంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు.

-8లో

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్, మండల స్థాయిలోనూ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

తిరుపతమ్మకు పుష్పాలంకరణ



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): తిరుపతమ్మను ఆదివారం వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లతో బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. పూల అలంకరణకు విజయవాడకు చెందిన దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కల్పన దంపతులు సహకారం అందజేశారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవ రావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఏఈఓ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

'ఎన్జీవో' కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తూర్పు కృష్ణాజిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించి ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యవర్గానికి సంబంధించి నామినేషన్లు ఒక్కొక్కటి మాత్రమే దాఖలు కావటంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఉల్లి కృష్ణ, సహాధ్యక్షుడిగా కేపీ రావు, ఉపాధ్యక్షులుగా బి. రాజేంద్రకుమార్, ఎంఎస్ పాషా, కె. రామ్మోహనరావు, ఎస్. సునీల్ కుమార్, జీఎస్‌వీఎస్‌ఏ నరసింహారావు ఎన్నికయ్యారన్నారు. కార్యదర్శిగా ఎ. వెంకటేశ్వర రావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్. హేమ ప్రకాష్, సహాయ కార్యదర్శులుగా కె. శ్రీనివాస రావు, కేవీ కోటేశ్వరరావు, ఎం. రజనికుమారి, పి. సుకుమార్, మహిళా సహాయ కార్యదర్శిగా ఎం. జాస్మిన్, కోశాధికారిగా ఎస్. రమేష్ ఎన్నికైనట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై షష్ఠిని పురస్కరించుకుని ఆదివారం సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ స్వామి వారి ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు కల్యాణాన్ని జరిపించారు. కార్తిక మాసం నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు తమ పేరిట స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించుకున్నారు. అనంతరం వారికి ప్రత్యేక క్యూలైన్ మార్గం గుండా దుర్గమ్మవారి దర్శనానికి అనుమతించారు.

స్కేటింగ్‌లో విజయవాడ క్రీడాకారుల సత్తా



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర రోలర్ స్కేటింగ్ పోటీల్లో విజయవాడ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు అద్భుత క్రీడా ప్రతిభ కనబర్చి ఎనిమిది(నాలుగు బంగారు, ఒక రజతం, మూడు కాంస్యం) పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 27, 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో ఈ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో విజయవాడకు చెందిన కె.కైవల్య రెండు బంగారు, ఒక కాంస్యం, ఎం.జోయల్‌ఆదర్శ్ కాంస్య పతకం, బాలికల విభాగంలో ఎం.జెస్సీరాజ్ ఒక బంగారు, ఒక రజతం, పి.చైత్రదీపిక ఒక బంగారు, ఒక కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ పి.సత్యనారాయణను విజయవాడ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సురేష్‌కుమార్, కార్యదర్శి కె.శశికుమార్, రాష్ట్ర అసోసియేషన్ చైర్మన్ జె.సుధాకరరెడ్డి, సహాయ కార్యదర్శి పి.థామస్య్య అభినందించారు.

దురాగత పాలన

- రాజధాని పేరిట టీడీపీ రాక్షసక్రీడ
- ఒళ్లు గగుర్పొడిచే అరాచకాలు
- భూమి కోసం రైతులతో బంతాట
- సమీకరణలో పేదలు సమిధలు
- నాటి పోలీస్ చర్యలతో హడలిన రైతునేతలు
- అన్యాయాలను సరిదిద్దాలంటూ నేడు వినతులు

రాజధాని పేరిట భూసమీకరణకు తాము అంగీకరించేదిలేదని, సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని రైతులు భీష్మించుకున్నారు. అలాంటి వారిని నానా విధాలుగా బెదిరింపులకు గురిచేశారు. విషయం మా దృష్టికి రావడంతో ఆరుగురు లాయర్ల బృందం నిజనిర్ధారణ (ఫ్యాక్ట్ ఫైండింగ్)కమిటీగా ఏర్పడి రాయపూడి, మందడం తదితర గ్రామాల రైతులతో మాట్లాడి రాత్రి పదిన్నరప్పుడు విజయవాడకు తిరిగి వస్తుండగా మఫ్టీలోని ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు నిర్మానుష్య ప్రాంతంలో నిలిపేశారు. మీ పరిధి ఎక్కడ? ఇక్కడకు ఎందుకు వచ్చారు? మీకు ఇక్కడేం పని? అంటూ నిలదీశారు. న్యాయవాదులమని చెప్పినా, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నా లెక్కచేయలేదు. మఫ్టీలో ఉన్న మీరెవరు? మీరెందుకు ప్రశ్నిస్తున్నారని అడిగినా సమాధానం లేదు. చివరకు పరిచయమున్న ఓ పోలీసు ఉన్నతాధికారి సిఫార్సుతో ఇళ్లకు చేరుకోగలిగాం. 'ఇదిగో చూడండి, ఈ రోజు ఎలాగో బయటపడ్డారు. ఇంకోసారి రైతులకు మద్దతంటూ వచ్చారో మీకేం జరుగుతుందో అంచనాకు కూడా అందదు. జాగ్రత్త' అనే వారి హెచ్చరిక గుర్తొచ్చినప్పుడల్లా ఆనాటి అరాచకాలు కళ్లముందు కదలాడుతుంటాయి.

– రాయపూడి ప్రాంతానికి చెందిన ఓ లాయరు మాటలివి..



ఆనాడు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఓ అరటితోటలో టీడీపీ దుండగులు వెదురు బొంగుల గుట్టను తగలబెట్టగా మిగిలిన బూడిద వద్ద రైతులు (ఫైల్)

దయ్యాలు వేదాలు వల్లించడమంటే.. మాజీ సీఎం చంద్రబాబు మాటలను సరిపోల్చవచ్చంటారు అమరావతి పరిధిలోని 29 గ్రామాలకు చెందిన పేదవర్గాలు, రైతులు, రైతునేతలు. అప్పట్లో రైతులకు మద్దతు పలికిన సామాజికవేత్తలు, రాజకీయ పార్టీల నాయకులు అనేక సందర్భాల్లో సర్కారు తీరును తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. గుంటూరు జిల్లా తుళ్లూరు, మంగళగిరి మండలాల్లో రాజధాని పేరిట రియల్ వ్యాపారానికి పోలీసుల ద్వారా బాబు ప్రభుత్వం అండగా నిలిచింది. రాక్షస క్రీడను కొనసాగించింది. భూమి కోసం రైతులను, వారికి మద్దతిచ్చిన వారిని రేయింబవళ్లు టీడీపీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు బంతాట ఆడుకున్నారు.

– సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

ఒక్కొక్కరుగా పెదవి విప్పుతూ..

భూసమీకరణకు అంగీకరింపజేయడానికి టీడీపీ ఎన్నెన్ని అరాచకాలకు పాల్పడిందో, దురాగతాలు చేసిందో బాధితులు ఒక్కొక్కరుగా పెదవివిప్పుతున్నారు. ప్రభుత్వమిచ్చిన అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు చట్టాలను సాకుగా చూపి బాబు బృందం అదిరించి, బెదిరించి, మోసగించిన వైనాన్ని ప్రస్తుతం బట్టబయలు చేస్తున్నారు. తమ నుంచి లాగేసుకున్న, రిజిస్ట్రేషన్ చేయని భూముల ప్యాకేజీ తమకే దక్కాలని, కౌలు మొత్తాన్ని ఇప్పించాలని, భూములు తిరిగి ఇచ్చేసినా సాగుచేసుకుంటామంటున్నారు. నవులూరు, కురగల్లు, ఎర్రబాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు మంగళగిరి రెవెన్యూ అధికారులను కలిసి పైమేరకు వినతిపత్రాలు అందజేశారు. 29 గ్రామాల పరిధిలో జరిగిన అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో టీడీపీ నాయకుల్లో ఆందోళనలు అధికమవుతున్నాయి.

భూ సమీకరణకు ససేమిరా అనడంతో...

ల్యాండ్ పూలింగ్ స్కీం నోటిఫికేషన్ వెలువడగానే రాయపూడి, మోదుగలింగాయపాలెం, మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం పరిధిలోని రైతులు ఆందోళనలకు దిగారు. మూడు పంటలు పండే బంగారం లాంటి భూములను తామిచ్చేది లేదని, రాజధాని కోసం ప్రత్యామ్నాయ భూములు చూసుకోవాలని, ఎల్‌పీఎస్ ఇచ్చిన ప్రకటనను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎక్కడికక్కడ రోడ్డెక్కారు.

11 చోట్ల తోటలు ధ్వంసం..

రైతులు ఆందోళన చేపట్టగానే పదకొండు చోట్ల అరటి తోటలు, చెరుకు తోటలను టీడీపీ పెద్దలు ధ్వంసం చేయించారు. తగులబెట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ వాళ్లే కారకులంటూ తమ వందిమాగధులచేత ప్రచారం చేయించారు. రాయపూడికి చెందిన కొండెపాటి శ్రీనాథ్ చౌదరి, నందిగం సురేష్, గద్దె చినతిరుపతి రావు, గద్దె మీరా.. ఇలా అనేకుల పేర్లు బయటపెట్టారు. తమ పొలాల్లో నుంచి రోడ్డు వేయడానికి వీల్లేదన్న వారిని బెదిరించడానికి మీరే తోటలను తగులబెట్టారంటూ గ్రామాల్లోకి పోలీసులను పంపి అరెస్టులు చేయించారు. గ్రామాల్లోని టీడీపీ నాయకుల ద్వారా భూములు ఇవ్వాల్సిందేనని ఒత్తిళ్లు చేయించారు. ఇళ్ల వద్దకు వెళ్లి రెచ్చగొట్టారు. గొడవలు పెట్టుకున్నారు. అప్పటి మంత్రులు పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, రావెల కిషోర్‌బాబు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ గ్రామాల్లో కలియతిరిగారు. ప్రతి రివ్యూలో వారున్నారు. సానుకూలత లేకపోవడంతో అడ్డూఅదుపు లేని అరాచకాలకు తెగబడ్డారు.

అమ్మో! ఆ పోలీసుల బెదిరింపులు..

గుంటూరు, ఇరుగుపొరుగు జిల్లాల నుంచి అనుకూలురైన సీఐ స్థాయి అధికారులను చంద్రబాబు, లోకేష్‌ల ఆదేశాలతో నాటి ఉన్నతాధికారులు రప్పించారు. ఎల్‌పీఎస్‌కు అంగీకరించని వారి జాబితాలను గ్రామాల వారీ సిద్ధం చేసుకున్నారు. ఎవరెవరిని ఏ రీతిలో బెదిరించాలో తమ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకుని 29 గ్రామాలకు మఫ్టీలో పోలీసులను పంపారు. హెచ్చరికలకు లొంగని వారిని తుళ్లూరు స్టేషన్‌కు రప్పించడం, ఉదయం నుంచి అక్కడే ఉంచుతూ తోటలు తగులబడిన రోజంతా మీరేం చేశారో వివరంగా రాతపూర్వకంగా ఇవ్వాలని తీసుకోవడం, ఆ తర్వాత ఇలా కాదంటూ కాగితాలను చించేయడం, మళ్లీమళ్లీ రాయించడం, రోజుల తరబడి అక్కడే ఉంచేయడం చేసేవారు. అన్నపానీయాలు లేకుండా, కాలకృత్యాలకు వెళ్లనీయకుండా, స్టేషన్ వద్ద కూర్చోనివ్వకుండా, ఒక్కచోట నిల్చోనీయకుండా, ఎవరినీ పలకరించనీయకుండా, రాత్రి వేళలో కంటిమీద రెప్ప వేయనీయకుండా మేల్కొనే ఉండాలంటూ హుకుం జారీ చేసేవారు. బైండోవర్ కేసుల పేరిట రోజుల తరబడి బెదిరించారు. ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరిస్తే సరేసరి, లేదంటే పదే పదే మళ్లీ పిలిపిస్తుంటామంటూ మానసిక హింసకు గురిచేశారు. చూశారా స్టేషన్ల వద్ద మీవారిలా ఇబ్బందులు పడుతున్నారంటూ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి భూములు ఇచ్చేస్తే సమస్యలు ఉండవంటూ ఒత్తిడి తెచ్చేవారు. ఇలా రెండున్నర వేల మందికిపైగా హింసకు గురయ్యారని బాధితవర్గాలు 'సాక్షి'కి వివరించాయి.

ఆధారాలు లేకుండా..

మావోయిస్టు ప్రాంతాల్లోలా రాజధాని గ్రామాల్లోనూ అప్పటి ప్రభుత్వం కూంబింగ్ చేయించేది. రోడ్లపై కనిపిస్తే కేసు తప్పదని హెచ్చరిస్తూ భూములను ఇస్తున్నట్లుగా బలవంతంగా రైతుల నుంచి అంగీకారపత్రాలు తీసుకునేది. పోలీసులను రప్పించినట్లు, డ్యూటీలు చేయించినట్లు రికార్డుల పరంగా బయటపడకుండా జాగ్రత్త పడింది. అనేక సందర్భాల్లో స్థానిక పోలీసులను కాకుండా ఏపీఎస్‌పీ బెటాలియన్ల నుంచి రప్పించేవారు. ఆ వివరాలు రికార్డుల్లో లేకుండా జాగ్రత్తపడ్డారు. పోలీసులను మఫ్టీలో దించిన ప్రభుత్వం తుళ్లూరు స్టేషన్ వద్ద వారికి రోజుకు వెయ్యి మందికి పైగా భోజనాలు వడ్డింపజేసేది.

భయభ్రాంతులకు గురిచేశారు



నాడు పూలింగ్ కోసం భూములివ్వని రైతులను భయభ్రాంతులకు గురిచేశారు. లేనిది ఉన్నట్లు సృష్టించి అధికారులు, నాయకులూ గ్రామాల్లో తిష్టవేసి పోలీసులు కవాతు చేసేవారు. బూట్ల చప్పుళ్లు రేయింబవళ్లు వినిపించేవి. ఓ సామాజికవర్గం, పెద్ద రైతులు భూములు ముందుగా ఇచ్చి చిన్న రైతులను ఇబ్బందులు పెట్టారు.

– తురకా శ్రీనివాసరావు, బోరుపాలెం

అభూత కల్పనలు



దళితుల భూములపై కన్ను పడిన టీడీపీ నాయకులు రాజధాని ప్రాంతంలో మీ భూములు ఉచితంగా లాగేసుకుంటారనే అభూత కల్పనలు సృష్టించారు. అరటితోటల దహనం వంటి కేసులలో సంబంధం లేని వ్యక్తులను తీసుకెళ్లి ఇబ్బందులకు గురిచేశారు. దీంతో పోలీసుల తీరును చూసి చిన్నా, చితకా రైతులు భయభ్రాంతులకు గురై బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితులు ఉండేవి.

– గద్దర్ చెన్నకేశవ మాతంగి, హరిశ్చంద్రపురం

క్రీడల అభివృద్ధికి కృషి

మంత్రి జోగి రమేష్



అథ్లెట్‌లను సన్మానించిన మంత్రి జోగి రమేష్

విజయవాడ స్పోర్ట్స్: క్రీడాకారులు ఎదుర్కొనే సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ప్రస్తావిస్తానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. 36వ జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన ఐదుగురు రాష్ట్ర అథ్లెట్‌లను విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మంత్రి జోగి రమేష్ ఆదివారం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో అథ్లెట్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు క్రీడాకారులు, కోచ్‌లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన 17 మంది అథ్లెట్‌లలో ఐదుగురు అథ్లెట్‌లు ఆరు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. గాయాల పాలైన క్రీడాకారులకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న బెస్ట్ ఫిజియోథెరిపి వైద్యులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రాష్ట్ర అథ్లెట్‌లు జ్యోతి యర్రాజి(విశాఖపట్నం), జ్యోతికశ్రీ(తణుకు), కార్తీక(విజయవాడ), రష్మీ(విజయవాడ), సౌమ్య మురుగున్(విజయవాడ)లను సన్మానించి, బెస్ట్ ఆస్పత్రి వైద్యులు సమకూర్చిన నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. తొలుత మంత్రి జోగి రమేష్ అథ్లెటిక్ కోచ్‌లు వంశీధర్, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, బెస్ట్ ఫిజియోథెరిపీ వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఏఏ కార్యదర్శి ఆకుల హైమ, ప్లానింగ్ కమిటీ చైర్మన్ టి. నాగేశ్వరరావు, అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహాయ కార్యదర్శి ఆకుల రాఘవేంద్రరావు, ట్రిపుల్ ఒలింపియన్ అథ్లెట్ సత్తి గీత, కోచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇండోర్ రోయింగ్ పోటీలు



రోయింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి ఇండోర్ రోయింగ్(ఎర్గోమీటర్) చాంపియన్‌షిప్ విజయవాడ కానూరులోని కేసీపీ సిద్దార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. అండర్–12, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ స్త్రీ, పురుషుల విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఆంధ్రప్రదేశ్ రోయింగ్, స్కల్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తరుణ్ కాకాని, కార్యదర్శి వి.వి.రావు ఈ పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీల్లో విజేతలకు ఏసీపీ చెంచురెడ్డి, సిద్ధార్థ స్కూల్ కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు బహుమతులు అందజేశారు.

ఇంద్రగిరి..కార్తిక సందడి

భక్తులతో కిక్కిరిసిన దుర్గమ్మ కొండ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కార్తిక మాసం తొలి ఆదివారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు విశేష సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప, శివ దీక్షాధారులు విచ్చేయడంతో కొండపై ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఆది దంపతుల దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే కొండపైకి కార్లు, ఇతర రవాణా వాహనాలను అనుమతించలేదు. కేవలం ద్విచక్ర వాహనాలు, దేవస్థాన బస్సులను మాత్రమే అనుమతించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్‌ల నుంచి నడిచే దేవస్థాన బస్సులు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయగా, రద్దీ మరింత పెరిగింది. సాయంత్రం 3.30 గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది.

టికెట్ల ద్వారా రూ. 22 లక్షల ఆదాయం

అమ్మవారి దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ. 22 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. భక్తుల కోసం దేవస్థానం వీఐపీ రూ. 500 టికెట్, బంగారు వాకిలి రూ. 300 టికెట్‌తో పాటు రూ. 100 టికెట్లను విక్రయించింది. ఆదివారం ఒక్క రోజే దేవస్థానానికి రూ. 40 లక్షల మేర ఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 15 లక్షల మేర ఆదాయంతో పాటు సుమారు 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.



అమ్మవారి ముఖమండపం వద్ద భక్తుల రద్దీ

తలనీలాలకు బారులు తీరిన భక్తులు

అమ్మవారికి తలనీలాలు సమర్పించేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దుర్గాఘాట్ ఎదురుగా ఉన్న అరండల్ సత్రంలో భక్తులు తలనీలాలు సమర్పిస్తుంటారు. ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తలనీలాలు సమర్పించేందుకు తరలి రాగా, వారు గంటల తరబడి క్యూలైన్‌లోనే వేచి ఉండాల్సి వచ్చింది. శుక్రవారం, ఆదివారం ఆరు బయట షామియానాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

నేడు వీఎంసీ కౌన్సిల్

102 అంశాలతో కూడిన అజెండా సిద్ధం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సమావేశం జరగనుంది. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో నగరంలోని ఆయా డివిజన్లలో చేసే పలు అభివృద్ధి పనులపై చర్చించి, సభ్యులు తీర్మానాలు చేయనున్నారు. మొత్తం 102 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు.

ప్రధానాంశాలు..

- 40వ డివిజన్‌లోని ఆర్టీసీ వర్క్‌షాపు వద్ద ఎమ్మార్వో కార్యాలయం రోడ్డు నుంచి సీతారామయ్య వీధి వరకు నూతనంగా ఆర్‌సీసీ స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మించేందుకు రూ.76.33 లక్షలు అంచనాలను వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి ఖర్చు చేయటానికి అధికారులు ప్రతిపాదన చేశారు.
- సర్కిల్–2 పరిధిలోని 58వ డివిజన్ నందమూరి నగర్‌లో వైవీ రావు ఎస్టేట్స్‌లో, 30వ డివిజన్ జేవీఆర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన 1,500 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు రిజర్వాయర్లకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 3.30 కోట్లు అంచనాలు వేయగా.. అదనంగా ఒక్కో దానికి రూ. 86.49 లక్షలు ఖర్చైందని, ఈ మొత్తాన్ని కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి చెల్లించేందుకు కౌన్సిల్‌కు ప్రతిపాదన వచ్చింది.
- 60వ డివిజన్‌లోని అజిత్‌సింగ్‌నగర్‌లో వాంబే కాలనీ 62, 63వ బ్లాక్, 58వ డివిజన్‌లోని కనకదుర్గ నగర్ డీపీ స్టేషన్ వద్ద ఉన్న ఖాళీ స్థలానికి రక్షణగా ప్రహరీ నిర్మించేందుకు రూ. 32 లక్షలను 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చు చేయటానికి కౌన్సిల్ ఆమోదానికి ప్రతిపాదన వచ్చింది.
- 8వ డివిజన్‌లోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు మదర్‌థెరీసా జంక్షన్ నుంచి నేషనల్ హైవే 16 వరకు రోడ్డు ఎండ్–టూ–ఎండ్ వరకు ఇరువైపుల పేవర్‌బ్లాక్స్ వేయటానికి రూ. కోటి అంచనాలు రూపొందించగా వాటికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదానికి ప్రతిపాదన వచ్చింది.
- సర్కిల్–3 పరిధిలోని పుల్లేటికట్ట జంక్షన్ నుంచి ఏలూరురోడ్డులోని కల్వర్టు వరకు స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి అవసరమైన రూ.80 లక్షల నిధులను ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ప్రతిపాదన వచ్చింది.



రక్తదానం చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ టి.కె. రాణా



పోలీసులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

త్యాగ స్మరణం.. రక్తదానం

పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విజయవాడలోని సిటీ పోలీస్ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఆదివారం నిర్వహించారు. వైద్య శిబిరంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు పోలీసులకు వైద్య సేవలందించారు. బీపీ, సుగర్, ఈసీజీ, కంటి తదితర పరీక్షలు చేశారు. రక్తదాన శిబిరంలో సివిల్, ట్రాఫిక్, ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరాలను జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా పరిశీలించారు. డీసీపీలు కె.శ్రీనివాసరావు, ఉదయరాణి, ఏడీసీపీలు వెంకటరత్నం, సర్కార్ పర్యవేక్షించారు.

– విజయవాడ స్పోర్ట్స్

క్లుప్తంగా

గోడౌన్‌లో ట్రాక్టర్లు అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గోడౌన్‌లో ఉంచిన పాత ట్రాక్టర్లు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చిట్టినగర్‌కు చెందిన సయ్యద్ హాజీ స్నేహితుడు హన్నుతో కలిసి పాత ట్రాక్టర్లు కొనుగోలు చేసి వాటిని ఇనుప సామగ్రి కొనే వారికి అమ్ముతుంటారు. ఇందుకు గాను హన్నుకు కమీషన్ ఇస్తూ ఉంటాడు. ఈ నెల 10న హన్ను ఒరిస్సాలో రెండు పాత ట్రాక్టర్లు కొనుగోలు చేసి హాజీకి పంపాడు. హాజీ వాటిని కోళా వద్ద ఉన్న ఇమ్రాన్ గోడౌన్‌లో ఉంచాడు. ఈ నెల 27న ఇమ్రాన్ గౌడౌన్ వద్దకు వెళ్లి చూడగా రెండు పాత ట్రాక్టర్లు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని ఆరా తీసినా వాటి ఆచూకీ తెలియలేదు. బాధితుడు హాజీ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పెదన:మండలంలోని బలిపర్రు సమీపంలోని పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల మేరకు... ఆదివారం ఉదయం బలిపర్రు సమీపంలోని పంట కాలువలో 30 నుంచి 40 సంవత్సరాలు వయస్సు కలిగిన పురుషుడి మృతదేహం కొట్టుకువచ్చిందని సమాచారం వచ్చిందన్నారు. మృతదేహంపై నీలం రంగు బనియన్ ఉందని, దానిపై తెలుపు రంగులో శ్యామ్ ఇనిస్టిట్యూట్ అని ఆంగ్లంలో ముద్రించి ఉందన్నారు. మెడలో ఒక తాయత్తు, ఎడమకాలుకు నల్లతాడు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడి సమాచారం తెలిసిన వారుంటే 08672–248333, 9440796418, 9441315365 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ):విజయవాడ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం దక్షిణం వైపు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండటాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న వారు స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 52 సంవత్సరాలు ఉంటుందని, లావుగా ఉండి, వంటిపై పచ్చరంగు లుంగీ, ఎరుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతుడి గురించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440765053, 0866–2576006 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని కోరారు.

వైభవంగా కావడి మహోత్సవం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): కొత్తపేట ఇంద్రకీలాద్రిపై కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో కావడి మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్కందషష్ఠి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు ఆదివారం షణ్ముఖ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి 11 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు దుర్గాఘాట్ నుంచి కావడులను ధరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పాలకావడి, పన్నీరుకావడీ, విబూది కావడి, చందనకావడి తదితర మొక్కులను తీర్చుకున్నారు. పలువురు భక్తులు నోటికి శూలాలు గుచ్చుకొని మొక్కులు చెల్లించారు.



నోటికి శూలాన్ని గుచ్చుకున్న భక్తులు

కావడులతో ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కావడులతో నృత్యాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్బారావు పర్యవేక్షించారు.

ఆసరా జాతీయ అధ్యక్షుడిగా తరుణ్

విజయవాడ స్పోర్ట్స్:అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ కన్స్యూమర్ అవేర్‌నెస్ (ఏఏఎస్ఆర్ఏఏ) జాతీయ అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన తరుణ్ కాకాని ఎన్నికయ్యారు. ఆసరా జాతీయ పాలకమండలి సమావేశం చెన్నైలో ఈ నెల 28న నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడిగా తరుణ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆసరా చీఫ్ ప్యాట్రన్ సుల్తాన్ ఆలీ చేతుల మీదుగా నియామక పత్రాలను తరుణ్ అందుకున్నారు. వినియోగదారుల తరుపున పోరాడేందుకు ఈ సంస్థను నెలకొల్పినట్లు తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం -2019 ప్రకారం ఇప్పటి వరకు వినియోగదారులకు అనుకూలంగా 275 కేసులను గెలిచినట్లు



తరుణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

చెప్పారు. వాణిజ్య పద్ధతులు, బీమా క్లెయిమ్‌లు, వ్యాపార సేవల్లో లోపాలను సరిచేసేందుకు మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చిరంజీవి తదితరులు తరుణ్‌ను అభినందించారు.

అడ్వకేట్స్ క్రికెట్ టోర్నీ విజేత తమిళనాడు జట్టు



విజేతగా ట్రోఫీ అందుకున్న తమిళనాడు జట్టు



రన్నర్స్‌గా ట్రోఫీ అందుకున్న ఆంధ్ర జట్టు

ఇబ్రహీంపట్నం (మైలవరం): ఏపీ అడ్వకేట్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గొందేశి పూర్ణచంద్రరెడ్డి మెమోరియల్ క్రికెట్ ట్రోఫీ విజేతగా తమిళనాడు జట్టు నిలిచింది. మూడో సౌత్ ఇండియా అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల అడ్వకేట్స్ జట్లు పాల్గొన్నాయి. ఒక్కొక్క జట్టు మూడేసి జట్లతో తలపడింది. తమిళనాడు అత్యధికంగా మూడు మ్యాచుల్లో, ఆంధ్రప్రదేశ్ రెండు మ్యాచ్‌లలో విజేతలుగా నిలిచాయి. దీంతో తమిళనాడు జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకోగా, రన్నర్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ క్రాంతికుమార్, బెస్ట్ బ్యాట్స్‌మెన్ అరుణ్‌కుమార్, బెస్ట్ బౌలర్‌గా భరత్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా క్రాంతికుమార్ నిలిచారు. ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి, అతిథులుగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

ఐఎంఏ నగర శాఖ కమిటీ బాధ్యతలు స్వీకారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ 2022–23 సంవత్సరానికి గాను ఎన్నికైన నూతన కార్యవర్గం ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ ఎంఏ రెహమాన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కోలా విజయశేఖర్, డాక్టర్ సీహెచ్ మనోజ్‌కుమార్, కార్యదర్శిగా డాక్టర్ డాక్టర్ పీవీ దుర్గారాణి బాధ్యతలు చేపట్టారు. సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ కర్లపూడి వాసు, డాక్టర్ అక్కినేని శివరామ్, కోశాధికారిగా బీఎస్‌బీఎన్ చౌదరిలతో పాటు మరో 30 మంది కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. 2021–22 సంవత్సరానికి అధ్యక్ష కార్యదర్శులుగా వ్యవహరించిన డాక్టర్ రశీకసంఘ్వీ, డాక్టర్ కొంగర రవికాంత్‌లు ఎక్స్ అఫిషియో సభ్యులుగా వ్యవహరించనున్నారు. బీఎంఏ సభ్యులుగా డాక్టర్ మెహబూబ్ షేక్, డాక్టర్ ఎం.సూర్యవంశీ బాధ్యతలు చేపట్టారు.

జాతి నిర్మాణంలో ఆర్యవైశ్యులది కీలక పాత్ర

ఏపీ శాసనసభ డెప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డెప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, అన్నా వెంకట రాంబాబు, తదితరులు


భవానీపురం(విజయవాడ పశ్చిమ): జాతి నిర్మాణంలో ఆర్యవైశ్యులది కీలక పాత్ర అని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆధ్యాత్మిక, సేవా రంగాలకు ఆర్యవైశ్యులు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురం బబ్బూరి గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధన, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఆర్యవైశ్యులతో వినోద, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసిన సంఘం ప్రతినిధులను ఆయన అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఆర్యవైశ్య వ్యాపారులకు జగనన్న ఇస్తున్న మనోధైర్యానికి కృతజ్ఞులై ఉంటారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. వ్యాపార రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాజకీయంగా ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆర్యవైశ్యులపై ఎంతో అభిమానం చూపేవారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, మద్దాలి గిరిధర్, ఆర్టీఐ చీఫ్ కమిషనర్ రేపాల శ్రీనివాస్, ఏపీ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ (కొండపల్లి బుజ్జి), విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, పోతుల సురేష్, గుడిపాటి కిషోర్, ఆత్మూరి శ్రీదేవి, శేగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. వినోద కార్యక్రమాలు అలరించాయి.



కార్యక్రమంలో అభివాదం చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య నాయకులు

మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ

పటమట(విజయవాడ తూర్పు): మద్యం మత్తులో యువకులు ఘర్షణ పడిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లికి చెందిన నవీన్, హర్షవర్ధన్ వర్గాల మధ్య గత కొంతకాలంగా వివాదాలున్నాయి. వివాదాలను సెటిల్ చేయడానికి పటమటకు చెందిన వంశీ అనే యువకుడు రెండు వర్గాలను మద్యం పార్టీ కోసం గాయత్రినగర్‌లోని ప్రైవేటు భవనంకు పిలిచాడు. మద్యం తాగిన అనంతరం ఆ మత్తులో వారి మధ్య మాట మాట పెరిగి వివాదం చోటుచేసుకుంది. నవీన్ తల మీద హర్షవర్ధన్ బీరు సీసాతో కొట్టడంతో తల పగిలింది. దీంతో నవీన్‌ను చికిత్స నిమిత్తం ఆటోనగర్ బస్ టెర్మినల్ ఎదురుగా ఉన్న లిబర్టీ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం నవీన్ వర్గం హర్షవర్ధన్‌కు ఫోన్ చేసి హాస్పిటల్ దగ్గరకు వస్తే తేల్చుకుందామని రెచ్చగొట్టారు. దీంతో హర్షవర్ధన్ మరో నలుగురు యువకులను వెంటపెట్టుకొని కర్రలు, ఇనుప రాడ్లు తీసుకుని కారులో హాస్పిటల్ వద్దకు వచ్చారు. అక్కడ రెండు వర్గాలు తీవ్రంగా ఘర్షణ పడ్డారు. హాస్పిటల్ సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొనే సరికి యువకులు పరారయ్యారు. కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.





భవానీ ఐలాండ్‌లో సండే సందడి

విజయవాడ భవానీ ద్వీపంలో సందడి నెలకొంది. కార్తికమాసం తొలి ఆదివారం నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. బోటులో ఐలాండ్‌కు చేరుకొని సాయంత్రం వరకు ఎంతో సంతోషంగా సేదతీరారు. కుటుంబాలతో సహా వచ్చి ఐలాండ్‌లో వన భోజనాలు చేశారు. చిన్నారులు, మహిళలు ఆట పాటలతో ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అంగన్‌వాడీ వర్కర్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

కంకిపాడు: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కృష్ణా జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా తొమ్మిదో మహాసభలు కంకిపాడు మార్కెట్‌యార్డులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నిర్మల, రమాదేవి, కోశాధికారిగా శివలీల, మరో 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర నాయకులు ఎస్‌సిహెచ్ సుప్రజ, సీహెచ్ రవి, మాదాల వెంకటేశ్వరరావు, కుమారి పాల్గొన్నారు.

నేడు దేవదాయశాఖలో స్పందన

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): దేవదాయ, ధర్మదాయ శాఖ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.శాంతి తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరుగుతుందన్నారు.

తెనాలిలో యువకుడి దారుణ హత్య

పాతకక్షలతో స్థానిక యువకుల ఘాతుకం



బత్తుల అనిల్(ఫైల్)

తెనాలిరూరల్: పట్టణంలోని సుల్తానాబాద్‌లో వడ్డెర కాలనీకి చెందిన యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. పాత కక్షల నేపథ్యంలో ఇదే ప్రాంతానికి చెందిన కొందరు యువకులు కత్తులతో పొడిచి హత్య చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్ వడ్డెర కాలనీలోని శివాలయం సమీపంలో నివసించే బత్తుల అనిల్ (26)కు స్థానికంగా ఉండే కొందరు యువకులతో గతంలో పలుమార్లు ఘర్షణలు జరిగాయి. కొంత కాలంగా వీరి మధ్య ఆధిపత్యపోరు కూడా నడుస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని ఇక్కడి నుంచి బెంగళూరుకు పంపించేశారు. అనిల్ గత ఆరు నెలలుగా అక్కడే ఉంటూ తాపీ పనులు చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత పనుల నిమిత్తం అనిల్ శనివారం ఉదయం తెనాలి చేరుకున్నాడు. ఉదయం నుంచి వివిధ పనులతో తిరుగుతున్న అనిల్ ఆదివారం ఉదయానికి సుల్తానాబాద్‌లోని ఆంజనేయ స్వామి గుడి రోడ్డు చివర్లో గల ఓ అప్పడాల కంపెనీ ముందు శవమై కనిపించాడు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అనిల్ మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు.

బంధువుల ఆందోళన

అనిల్ హత్య విషయం తెలుసుకుని వడ్డెర కాలనీకి చెందిన అతని బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. తరచూ మద్యం సేవిస్తూ స్థానికంగా అల్లర్లకు పాల్పడే చింటూ, రంగారావు, రాజేష్, ప్రేమ్, హరీష్, యశ్వంత్ కలిసి అనిల్‌ను కత్తితో పొడిచి హత్య చేశారని ఆరోపించారు. ఇంట్లో ఉన్న అనిల్‌ను నమ్మకంగా ఫోన్ చేసి బయటకు పిలిపించి ఘర్షణకు దిగినట్లు చెప్పారు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో అనిల్‌తో గొడవ పడి శివాలయం ఎదురుగా కత్తితో గుండెలపై పొడిచారని స్థానికులు చెబుతున్నారు. వీరు మద్యం మత్తులో గతంలో అనేక సార్లు ఇక్కడి యువకులపైనా దాడి చేశారని ఆరోపించారు.

సీసీ కెమెరాల్లో నమోదు...

దాడి నేపథ్యంలో నిందితుల నుంచి తప్పించుకునే క్రమంలో ఆంజనేయస్వామి గుడి రోడ్డు చివరకు అనిల్ పరుగులు పెట్టిన దృశ్యాలు అక్కడ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రాణభయంతో పారిపోయి వచ్చిన బాధితుడు మార్కెట్ యార్డు పక్క రోడ్డులోని అప్పడాల కంపెనీ వరకూ వచ్చి అక్కడ కుప్పకూలి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. త్రీ టౌన్ సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
ఎస్ఎంఇ బీసెంట్ రోడ్ బ్రాంచ్ (63640), విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా

స్వాధీనత ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) క్రింద
(చర మరియు స్థిరాస్తుల కొరకు)

ఇందుమూలముగా, భారతీయ స్టేట్ బ్యాంక్, ఎస్ఎంఇ, బీసెంట్ రోడ్ బ్రాంచ్ (63640), ఎన్టీఆర్ జిల్లా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 3తో చదివే సదరు సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో రుణగ్రహీతలు : 1) మెస్సర్స్ శ్రీ సాయిబాబా ఫిల్లింగ్ స్టేషన్, ప్రొప్రైటర్ శ్రీ విస్సకోట శ్రీనివాస రావు, డోర్ నెం.14-6-10, [illegible] -520003, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, 2) శ్రీ విస్సకోట శ్రీనివాసరావు, తండ్రి : నాగేశ్వరరావు, ఫ్లాట్ నెం. 306, 2వ అంతస్తు, సాయి బాలాజీ ఎన్‌క్లేవ్, [illegible], లబ్బీపేట-520010, ఎన్టీఆర్ జిల్లా, 3) శ్రీమతి విస్సకోట లక్ష్మి అన్నపూర్ణ, భర్త : శ్రీనివాసరావు, ఫ్లాట్ నెం. 306, 2వ అంతస్తు, సాయి బాలాజీ ఎన్‌క్లేవ్, [illegible], లబ్బీపేట-520010, ఎన్టీఆర్ జిల్లా. CC A/c Nos.4054869953, GECL A/c No. 39444311990 and GECL Extn A/c No.40584473520 వారికి బకాయి మొత్తం తేది.25.08.2022 నాటికి రూ.1,09,24,303/- (అక్షరాల ఒక్క కోటి తొమ్మిది లక్షల ఇరవై నాలుగు వేల మూడు వందల మూడు రూపాయలు మాత్రమే) మరియు తేది.26.08.2022 నుండి భవిష్యవడ్డీ + ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొదలగు వాటితో సహా నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.25.08.2022 న డిమాండ్ నోటీసును జారీ చేసినారు. [illegible]

[illegible] 25.10.2022 తేదిన దిగువ సంతకందారు లాంఛనాత్మకంగా స్వాధీనత తీసుకొన్నారని రుణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

[illegible] CC A/c Nos. 4054869953, GECL A/c No. 39444311990 and GECL Extn A/c No.40584473520 వారి బకాయి మొత్తం తేది.25.08.2022 నాటికి రూ.1,09,24,303/- (అక్షరాల ఒక్క కోటి తొమ్మిది లక్షల ఇరవై నాలుగు వేల మూడు వందల మూడు రూపాయలు మాత్రమే) మరియు భవిష్యవడ్డీ తేది.26.08.2022 నుండి భవిష్యవడ్డీ + ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొదలగు వాటితో సహా మొత్తానికి భారతీయ స్టేట్ బ్యాంక్, ఎస్ఎంఇ బీసెంట్ రోడ్ బ్రాంచ్ (63640), ఎన్టీఆర్ జిల్లా వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. [illegible]

రుణగ్రహీత(లు) సెక్యూర్డు ఆస్తుల విడిపించుకొనుటకు గల సమయం విషయమై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించవలెను.

స్థిరాస్తి వివరములు:
శ్రీమతి విస్సకోట అన్నపూర్ణ గారిచే తనఖా ఉంచబడిన ఆస్తి
షెడ్యూలు - "ఎ"

పార్టు - 1 : [illegible]

పార్టు 2 : [illegible] దస్తావేజు నెం.8044/2007, తేది.06.11.2007 ప్రకారం ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధి, [illegible] వార్డు నెం.28/2, [illegible] నెం.10 & 11, [illegible] నెం.11, పాత అసెస్‌మెంట్ నెం.[illegible], కొత్త అసెస్‌మెంట్ నెం.216974, పాత అసెస్‌మెంట్ నెం.25976[illegible], కొత్త అసెస్‌మెంట్ నెం.218367, డోర్ నెం.39-2-22 & 39-2-23 [illegible] 1983.64 [illegible] 45.98 [illegible] 1760 [illegible] "సాయి బాలాజీ ఎన్‌క్లేవ్" రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ లోని ఫ్లాట్ నెం.306 [illegible] శ్రీమతి విస్సకోట లక్ష్మి అన్నపూర్ణ, భర్త : శ్రీనివాసరావు గారికి చెందినది. హద్దులు : [illegible]
ఉత్తరం : [illegible] మున్సిపల్ రోడ్.
ఫ్లాట్ నెం.306 హద్దులు : తూర్పు : [illegible], దక్షిణం : ఫ్లాట్ నెం.305, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఫ్లాట్ నెం.307.

తేది : 25.10.2022
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ శ్రీనివాస డిఫెన్స్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc. ✆ 99493 08940
■ From Andhra University BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA, PG Diploma. Authorised Study & Exam Centre. Cont: 80747 27692
■ గోల్డెన్ బ్రైట్ ఎడ్యుకేషన్ చదువు ఏదైనా వేరు ఒక్కటే, టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ (ఐటీ), ఎంటెక్, ఎంబీఏ (ఐటీ) ఫస్ట్ ఎయిడ్, గోల్డ్ ఎప్రైజర్, వంటల్లు, అక్యుపంచర్, ల్యాబ్ అసిస్టెంట్ అన్ని పారామెడికల్ కోర్సులకు. www.bssve.in. ఫోన్: 99639 76832
■ పారామెడికల్ B.VOC డిగ్రీ కోర్సులు – M.L.T. అనస్థీషియా, రేడియాలజీ, కార్డియాక్ కేర్, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ. అర్హత : ఇంటర్ ఏ గ్రూపైనా పాస్ / ఫెయిల్. UGC, ప్రభుత్వ గుర్తింపు – చదువుతూ సంపాదించు అవకాశం– ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్. అడ్మిషన్లకు సంప్ర : CIMS, విజయవాడ : 95813 84578

DISTANCE EDUCATION
■ ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc, MBA, MCA, డైరెక్ట్ 10th, ఒకే సం॥లో ఇంటర్. భవ్య అకాడమి (since - 2001) VJA Ph: 97053 35676

REAL ESTATE
PLOT FOR SALE
■ ఊటీ (Ooty, Tamilnadu) అహ్లాదకరమైన వాతావరణంలో 50 సెంట్లు ప్లాట్లు Guest Houses & విల్లాలు కట్టుటకు అమ్మబడును. Ph: 9500108888

TO LET
■ కృష్ణలంక నవీన్ దగ్గర స్టేట్‌బ్యాంక్ రోడ్డులో అన్ని ఆధునిక సౌకర్యాలతో A/c రూములు, ఫ్యామిలీ పోర్షన్లు ఉద్యోగులకు, విద్యార్థులకు, వ్యాపారులకు, ఫ్యామిలీలకు అద్దె కొరకు సంప్ర. ✆ 83099 04493

SERVICES
BUSINESS OFFER
■ శ్రీ వాసవి కుబేర పరిశ్రమ: తక్కువ పెట్టుబడితో ప్లాస్టిక్ వస్తువులు తయారయ్యే మిషన్లు కలవు. ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాము. * హైడ్రాలిక్ మిషన్స్ కలవు. ✆ 98491 23006
■ ఊటీ (హిల్ స్టేషన్) తమిళనాడు ఊటీలో హై ఎండ్ రిసార్ట్ నిర్మాణం చేయుటకు 50% వాటాను పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి ఉన్న ఎవరైనా. 9500108888ని సంప్రదించండి.

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

WANTED
■ Wanted Tele Callers & Executives in ICICI Bank Personal Loans DSA, Salary: 10,000 + Cont ✆ 95335 44440
■ VJAలోని ప్రముఖ షాపింగ్ మాల్‌లో పని చేయుటకు అనుభవంగల ASO, మేల్ సెక్యూరిటీ గార్డులు కావలెను. మంచి జీతం, PF, ESI. వీక్లీ ఆఫ్స్, Q:10-12th, వ: 22-45. ✆ 78938 84421
■ విజయవాడ, లెనిన్ సెంటర్, మొబైల్ షాపులో సేల్స్ చేయుటకు అనుభవం కలిగిన సేల్స్ గర్ల్స్ కావలెను. సంప్ర॥ ✆ 99852 96525
■ విజయవాడ, సూర్యారావుపేటలోని లాండ్రీ షాపు నందు పనిచేయుటకు వర్కర్లు మరియు డ్రైవర్ కావలెను. సంప్రదించండి ✆ 94943 99626
■ విజయవాడ నక్కలరోడ్డులోని దంత వైద్యశాలలో పనిచేయుట కొరకు అసిస్టెంట్లు కావలెను. సంప్రదించండి ✆ 98496 79454
■ హౌస్ కీపింగ్ బాయ్స్, సూపర్‌వైజర్స్, పెట్ట ఇంటర్నేషనల్ క్యాంపస్ నందు కావలెను. 8 గం. డ్యూటీ, 7am-3pm, 2pm-10pm, 10pm-7am, శాలరీ. 9,500/- + PF, ESI. ✆ 81791 34727.
■ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీసులో పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. జీతం + ఇన్సెంటివ్ కలదు. సంప్రదించండి ✆ 99490 01969
■ అనుభవం గల క్వాలిఫైడ్ నర్సులు-1 (ANM/GNM), పున్నమ్మ ఫిజియోథెరపీ హాస్పిటల్ నందు పనిచేయుటకు కావలెను. అడ్రస్: 29-26-44, జగదంబ వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2 ✆ 98852 22525
■ విజయవాడ సిటీ & కృష్ణాజిల్లా చుట్టు ప్రక్కల గ్రామాలలో న్యూ ప్రైవేట్ బ్యాంకులలో ఉద్యోగ అవకాశములు కలవు. Qly: 7th to PG. జీ: 12,000/- to 35,000/-. ✆ 73868 79373
■ మంగళగిరి టూ వీలర్ ఆటోమొబైల్ షాపు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్ బాయ్స్ & గర్ల్స్ వెంటనే కావలెను. సంప్రదించండి. ✆ 97050 91906/73869 05677
■ Accountant Required for Publication, Accounts knowledge, 3 to 4 yrs Exp. in Tally, Hanumanpet, Vijayawada. What'sapp Resume. Cont: 9154121921
■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే ఉంటూ పార్ట్ టైం 1 గం॥ పోస్టల్ కవరుపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పు॥ కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. సంప్ర: 70329 51147
■ High End Motor Cycles సేల్స్‌లో 1-5 సం॥ అనుభవం ఉన్న సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం + Incentives. మరియుసర్వీస్ అడ్వైజర్, టెక్నీషియన్లు కావలెను.వివరాలకు: కాసా మోటార్స్. Ph: 9100882228
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగాకావలెను.ఆయా,వార్డ్‌బాయ్స్, నర్సులు, వంటవారు, RMP Dr. Q: 5th-డిగ్రీ, 10-30 వేలు జీతం,ఫో+రూం ఫ్రీ. Hyd. 7995374999
■ TANMAYEE ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్‌వద్ద, పైపుల రోడ్డు, విజయవాడ. ఆయాలు, వంట మనిషి కావలెను. వయసు 20 నుండి 50 సం॥ Ph: 9652423559,7093911010, 9573000987
■ అర్జెంటుగా టెలికాలర్స్-5 కావలెను జీ: 25000/-, వ: 20-30. రోజుకి 5 Ads బుకింగ్ (టార్గెట్ బేస్) TV 24x7 News TV Channel అజిత్‌సింగ్ నగర్, విజయవాడ. 8978315155
■ Walk in Interview Medical Representative HQ: Tirupathi & Vijayawada Qly: Any Graduation or D.Pharmacy. Ph: 8919730457

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి తగిన ఫలితాలు పొందలేకపోతే సంస్థ బాధ్యత వహించదు. ప్రకటనలిచ్చేవారు జేబీలో డబ్బు కట్టమని కోరే వారితో జాగ్రత్తగా ఉండాలి. ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ ప్రకటన కోసం! స్పందన కోసం!!
సాక్షి దినపత్రికలో ప్రకటనలకై మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
9010223734 7569567403 9912220543 8978012195 9912220545 9505507329 9247242829 9010577706 9951602985 8519918874 8099777189 9912220547 9010577706 9010210382 9951020399 9912220544
ఎన్టీఆర్ జిల్లా + కృష్ణాజిల్లా వాడుక లైన్లు రూ.600/- ప్రతి అదనపు లైను రూ.150/- + 5% GST

క్లుప్తంగా

నేడు జనశిక్షణ సంస్థాన్‌లో రాష్ట్రీయ ఏక్‌తా దివస్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు హెచ్‌బీ కాలనీలో తమ ట్రెనింగ్ సెంటర్‌లో రాష్ట్రీయ ఏక్‌తా దివస్ పేరుతో సభ నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జనశిక్షణ సంస్థాన్ చైర్ పర్సన్ విద్యాకన్నా, భవానీపురం వార్డు సచివాలయం ఉమెన్ పోలీస్ సెక్రటరీ వెంకట లక్ష్మి అతిథులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రణాళికతో పిల్లల పెంపకం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రణాళికతో పిల్లలను పెంచాలని ఏపీ ప్లానింగ్ , డెవలప్ మెంట్ సీఈఓ కె.శివశంకర్ అన్నారు. యూసీ మాస్ అబాకస్ అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యాన ఆదివారం నగరంలో మెంటల్ , అర్థమాటిక్ ఇంటర్నల్ కాంపిటీషన్స్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది రవికుమార్, యూసీమాస్ డైరెక్టర్ సురేష్, టరీ ప్రతినిధులు కె.నాగరాజు, సీతారామిరెడ్డి, బాబూరావు, యూసీమాస్ విజయవాడ ప్రతినిధి పూర్ణిమ పాల్గొన్నారు.

పటమట సీఐగా కాశీవిశ్వనాథ్



పటమట(విజయవాడ తూర్పు): పటమట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కాశీవిశ్వనాథ్‌ను నియమిస్తూ పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదివారం ఉత్తర్వులిచ్చారు. కంకిపాడు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ కృష్ణాజిల్లా ఎస్పీ పి. జాషువ ఉత్తర్వులిచ్చారు. గతంలో కాశీనాథ్ ట్రెనీ ఎస్సైగా పటమటలో విధులు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని వన్‌టౌన్ సీఐగా, స్పెషల్‌బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహించారు.

నేటి నుంచి తపాలా శాఖలో విజిలెన్స్ వారోత్సవాలు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): తపాల శాఖ విజయవాడ డివిజన్ పరిధిలో సోమవారం నుంచి నవంబర్ ఆరో తేదీ వరకూ విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ పోస్టాఫీసెస్ ఎం.హరిప్రసాదశర్మ తెలిపారు. ఈ ఏడాది 'అభివృద్ధి చెందిన భారతదేశం - అవినీతి రహిత భారతదేశం' నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన ఉదయం పదకొండు గంటలకు సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో క్విజ్‌లు, సదస్సులు, వర్క్‌షాప్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలను ఆయా కేంద్రాల్లో వివరించి పరిష్కారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.

సొరియాసిస్ రోగులకు ఉచిత వైద్య శిబిరం



పటమట(విజయవాడ తూర్పు) : స్థానిక పోస్టల్ కాలనీలోని భాస్కర కేరళ ఆయుర్వేద ఆస్పత్రి, పంచకర్మ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ శిరీష నిర్వహణలో సొరియాసిస్ రోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పటమటలోని ఆస్పత్రి ప్రాంగణంలో డాక్టర్ శిరీష మాట్లాడుతూ సొరియాసిస్ దీర్ఘకాలిక వ్యాధని, ఇది చర్మంపై దురద, పొలుసులతో దద్దుర్లు కలిగిస్తుందన్నారు. దీన్ని ముందుగానే తెలుసుకుంటే వ్యాధిని నివారించవచ్చన్నారు. ఈ నెల 29 నుంచి జరుగుతున్న శిబిరం సోమవారంతో ముగుస్తుందని తెలిపారు. పలువురికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు.

వెనిగళ్ల చిరస్మరణీయుడు

పటమట(విజయవాడ తూర్పు): ఆటోనగర్ మోటర్ పెయింటర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఆటోనగర్ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు దాన్ని మరింత అభివృద్ధి చేసిన వెనిగళ్ల సుబ్బారావు చిరస్మరణీయుడని సంఘకార్యవర్గ సభ్యులు మేడిశెట్టి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం అసోసియేషన్ హాల్ వద్ద వెనిగళ్ల సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో సభ్యులు సీతారామయ్య, సురేష్, రవి, సీతారామయ్య, ఆటోనగర్ మోటరు అనుబంధ సంఘాల ప్రతినిధులు సుబ్బారావుకు నివాళులర్పించారు.

విద్యార్థుల స్వచ్ఛ భారత్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కాలేజీ వద్ద ఉన్న ఫ్లెవైర్‌పై చెత్తను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా ఆర్యవైశ్యుల వన సమారాధన



భవానీపురం బబ్బురి గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య వనసమారాధన, ఆత్మీయ సమ్మేళనంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, చిత్రంలో ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, అన్నా వెంకట రాంబాబు, ఎమ్మెల్సీ పోతుల సునీత, తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



ఆత్మీయ సమ్మేళనంలో సత్కారం



వనభోజనాల్లో ఆర్యవైశ్యులు



అలరించిన ఆధ్యాత్మిక ప్రదర్శన

విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన ఆదివారం భవానీపురం బబ్బూరి గ్రౌండ్స్‌లో కార్తిక వన సమారాధన, ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. వేలాది మంది ఆర్యవైశ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వినోద, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. జబర్దస్త్ బృందంతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పాడుతున్న సాయి చరణ్, దామిని

ఆధునిక కవిత్వంలో మార్పులు స్వాగతించాలి



పురస్కారాలు అందజేస్తున్న దాట్ల దేవదానం రాజు, శిఖామణి, బుద్ధ ప్రసాద్ తదితరులు

విజయవాడ కల్చరల్: ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులను స్వాగతించాలని కవిసంధ్య సాంస్కృతిక సంస్థ ఉపాధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు అన్నారు. కవిసంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ ఎంజీరోడ్డులోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం శిఖామణి సమగ్రసాహిత్యం 5, 6 సంపుటాల ఆవిష్కరణ సభ, శిఖామణి జీవిత సాఫల్య పురస్కారం, ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ కవిత్వంలో సామాజిక చిత్రీకరణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. కవి శిఖామణిని కవిత్వ దీప శిఖామణిగా అభివర్ణించారు. కవిసంధ్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు శిఖామణి మాట్లాడుతూ సంస్థ ద్వారా యువ కవులకు ప్రోత్సాహక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని వారికి పురస్కారాలు అందిస్తునట్లు వివరించారు. శిఖామణి సాహిత్యసరస్వం గ్రంథాలను పూర్వ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఖాదర్ మొహియుద్దీన్‌కు శిఖామణి జీవిత సాఫల్య పురస్కారం, యువ కవి అనిల్ డేనికి కవి సంధ్య యువ పురస్కారం ప్రదానం చేశారు. కవులు మువ్వా శ్రీనివాస్, విశ్రాంత అధ్యాపకుడు భూసురపల్లి వెంకటేశ్వర్లు, చారిత్రక పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రసంగించారు వివిధ రంగాలకు చెందిన కొండెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అరసవిల్లి గిరిధర్, కొల్లూరి , ప్రసేన్, నేలపూరి రత్నాజీ, మందరపు హైమవతి, కోసూరి రవికుమార్‌లకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు.

ఘాట్లలో పుణ్యస్నానాలకు అనుమతి



దుర్గాఘాట్ వద్ద భక్తుల రద్దీ



ఘాట్‌లో బారికేడ్లు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

దుర్గా, భవాని, పున్నమి ఘాట్లలో ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని స్నానఘాట్లలో భక్తులు కార్తిక మాసం పుణ్యస్నానాలు ఆచరించడానికి ప్రభుత్వ యంత్రాంగం అనుమతించింది. దీంతో సోమవారం నుంచి దుర్గాఘాట్, భవానీఘాట్, పున్నమి ఘాట్లలో భక్తులు, భవానీలు, అయ్యప్పలు, శివదీక్షాధారులు పుణ్యస్నానాలు చేయనున్నారు. కరోనా నేపథ్యంలో 2020 మార్చి నుంచి భక్తులు నదిలోకి దిగడానికి అనుమతి నిరాకరించారు. ప్రస్తుతం దుర్గాఘాట్‌లో భక్తులు జల్లు స్నానాలు చేయగానికి షవర్లను దుర్గగుడి దేవస్థానం ఏర్పాటు చేసింది. సుమారు రెండున్నర ఏళ్ల తర్వాత భక్తులకు అనుమతి లభించింది. గతంలో దసరా, భవానీ దీక్షల సమయంలో, కారిక్త మాసంలో నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతించాలని భక్తుల నుంచి డిమాండ్ వినిపిస్తూ వస్తోంది. ఈ ఏడాది కార్తిక మాసంలో తొలి సోమవారం నుంచి భక్తులు నదిలోకి దిగి పుణ్యస్నానాలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. రెండు రోజులుగా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ, మున్సిపల్ కమిషనర్‌తో పాటు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, పలువురు అధికారులు స్నానఘాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పుణ్యస్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు.

ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

దుర్గాఘాట్ వద్ద నది లోపలకు భక్తులెవరు నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కార్తిక మాసం తొలి సోమవారం నేపథ్యంలో పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో స్నానఘాట్‌లో భక్తులు దుస్తులు మార్చుకునేందుకు గదులు, శానిటేషన్‌తో పాటు పోలీసు, ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తున్నారు.

ఆదివారం కిటకిటలాడిన స్నానఘాట్లు

ఆదివారం తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో పాటు కార్తీక వన సమారాధన నిమిత్తం తోటలకు వచ్చిన వారు సైతం దుర్గాఘాట్‌లో స్నానాలు చేశారు. భక్తుల తాకిడి పెరగడంతో పోలీసులు సిబ్బందిని ఏర్పాటుచేశారు.

ఆధ్యాత్మిక చింతన.. ఆనందం..

ప్రాంతీయ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన

పటమట(విజయవాడ తూర్పు): వన సమారాధనతో ఆధ్యాత్మిక చింతన, ఆనందం కలుగుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. రామలింగేశ్వరనగర్‌లో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం ప్రాంతీయ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తిక వన సమారాధనలో ముఖ్య అతిథులుగా దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు బొప్పన భవకుమార్ పాల్గొని పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభించారు. బొప్పన మాట్లాడుతూ ఐకమత్యం తెలిపే సంప్రదాయాలకు ప్రతీక ఇలాంటి కార్యక్రమాలని పేర్కొన్నారు. ప్రాంతీయ విశ్వ బ్రాహ్మణ సంఘ సభ్యులు నాగభూషణం, సురేష్, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు వినియోగించుకోండి



వైద్య పరీక్షలు చేస్తున్న యూరాలజిస్టు పవన్‌సాయి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): నిరుపేద వృద్ధులు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను వినియోగించుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ ఆకాంక్షించారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ తాము ట్రస్ట్ ఆధ్వర్యాన నగరంలోని వృద్ధులకు ఆయుర్వేద, హోమియోపతి, అల్లోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆయుర్వేద డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాదరావు, హోమియోపతి వైద్యులు కోన వీరబ్రహ్మం, అల్లోపతి డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల, యూరాలజిస్టు డాక్టర్ పవన్‌సాయి పోతుల వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు అభినందనీయం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రాష్ట్రంలోనే తొలి సారిగా మెడికల్ రిహాబిలిటేషన్, రికవరీ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అన్నారు. విజయవాడ రామచంద్రానగర్‌లో సిబార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలీవ్ మెడికల్ రీహబ్, రికవరీ సెంటర్, కృష్ణ డెంటల్ ఆస్పత్రిని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ ఈ సెంటర్‌లో అత్యాధునిక సదుపాయాలతో రిహాబిలిటేషన్ సేవలు, దీర్ఘకాలిక వ్యాధులకు రికవరీ చికిత్సలు అందుబాటు ధరల్లో అందించడం మంచి పరిణామం అన్నారు. సెంటర్ డైరెక్టర్, సీఈఓ లింగమనేని ప్రణీత్ మాట్లాడుతూ పక్షవాతం , నరాలు, కీళ్ల వ్యాధులతో దీర్ఘకాలంగా బాధపడుతూ చికిత్సలు అవసరమైన వారికి సేవల అందించేందుకు రిహాబిలిటేషన్, రికవరీ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిబార్ ఎడ్యుకేషనల్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ముక్కామల అప్పారావు, డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్, డాక్టర్ తోట కృష్ణమోహన్, డాక్టర్ రేవతి పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు కృషి

ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి



పురస్కారాలు పొందిన వారితో శేషగిరిరావు, వెంకట సుబ్బయ్య, ప్రకాష్ తదితరులు

విజయవాడ కల్చరల్: కవులు, రచయితలు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పిలుపునిచ్చారు. రమ్యభారతి సాహిత్య మాసపత్రిక ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 12, 13 వ వార్షిక సోమేపల్లి జాతీయ సాహిత్య పురస్కాల సభ నిర్వహించింది. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ రచయితలు రాసికన్నా వాసికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఏపీలో గ్రంథాలయ సంస్థ ద్వారా రచయితల గ్రంథాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనతో పుస్తకాలను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలుగా తీర్చిదిద్దుతున్నామని విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సభాధ్యక్షుడు విద్యావేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ కథానిక సజీవ జలపాతమన్నారు. సోమేపల్లి జాతీయ పురస్కారాల కమిటీ చైర్మన్ సోమేపల్లి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ తెలుగు కథను జాతీయ స్థాయిలో నిలబెట్టాలని దాని ద్వారా యువ రచయితలను ప్రోత్సహించడానికి 13 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో కథానిక పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. రమ్యభారతి సంపాకుడు చలపాక ప్రకాష్ కథల పోటీ విశేషాలను వివరించారు. సత్యాజీ, శ్రీకంఠస్ఫూర్తి ప్రసంగించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

విజేతలు వీరే

జడసుబ్బారావు, నారాయణ గూండ్ల, బీవీ శివప్రసాద్, జి రంగబాబు, శింగరాజు శ్రీనివాసరావు, కృపాకర్ పోతుల, ప్రాంద్రంకి సుబ్రమణి, పోన్నాడ సత్యప్రకాషరావు, కేవీ మోహనారెడ్డి, కేవీ మేఘనారెడ్డి, కేవీ లక్ష్మణరావు, డాక్టర్ సుగుణరావు

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినాసుల్తానా హఫీజుల్లా అన్నారు. బాల్‌బ్యాడ్మింటన్ సబ్‌జూనియర్ బాలబాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పోటీలు సింగ్‌నగర్‌లోని ఎంకే బేగ్ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం జరిగాయి. కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పోటీలను రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వి.వి.వి. ప్రసాద్, సహాయ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.వి.ప్రసాద్ పర్యవేక్షించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో జరిగింది. సామర్లకోటకు చెందిన సురేష్(40) లారీ క్లీనర్. కృష్ణలంకలో ఒక గది అద్దెకు తీసుకున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అతను బందరు లాకుల వద్ద జాతీయ రహదారిని దాడుతుండగా బస్టాండ్ నుంచి వారధి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెనమలూరు: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు పోరంకిలో ఆదివారం నిర్వహించారు. వివిధ విభాగాల్లో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో 18 మంది బాలికలు విజేతలుగా నిలిచారని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ తెలిపారు. వ్యాసరచన పోటీల విజేతలకు డీఈఓ తాహెరా సుల్తానా బహుమతులు అందజేశారు. అనంతరం పదాధికారులతో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, డాక్టర్ రంగారావు, డాక్టర్ పద్మలత, సభ్యులు డి.మోహన్ రావు, వి.లక్ష్మీప్రసూన తదితరులు పాల్గొన్నారు.

భక్తుడి పర్సులో నగదు చోరీకి యత్నం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): అమ్మవారి దర్శనం కోసం దేవస్థానం బస్సులో వస్తున్న ఓ భక్తుడి పర్సును చోరీ చేసేందుకు యత్నించిన దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆదివారం ఉదయం అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు దుర్గాఘాట్ వద్ద దేవస్థానం బస్సు ఎక్కాడు. అతని వెనుకే గుర్తు తెలియని ఓ వ్యక్తి బస్సు ఎక్కాడు. భక్తుడి జేబులో నుంచి రూ. 30 వేల నగదును చోరీ చేసేందుకు యత్నించాడు. ఆ భక్తుడు తన జేబులో ఉన్న డబ్బు తీస్తున్నట్లు గ్రహించాడు. అదే సమయంలో పక్కనే ఉన్న మరో భక్తుడు ఈ విషయాన్ని గమనించి దొంగను పట్టుకున్నారు. భక్తుడి జేబులో నుంచి తీసిన నగదును అక్కడే పడేసి తనకు సంబంధం లేదని బుకాయించాడు. బస్సులో ఉన్న వారు అతన్ని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఘటన జరిగిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉందని తెలుసుకున్న పోలీసులు దుర్గాఘాట్ వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశారు.

నేడు జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ

కంకిపాడు: జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు సోమవారం ఉదయం 7.30 గంటలకు కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తామని ఎంఈఓ కనకమహాలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. కంకిపాడు ఎస్‌బీఐ సెంటర్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌జీఓలు పాల్గొనాలని కోరారు. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సందడి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): సత్యనారాయణపురం శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం ఉత్సాహంగా జరిగింది. నాటి స్నేహితులతో ఆడిపాడి సందడి చేశారు. వారు మాట్లాడుతూ తాము ఇక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ విద్యాబుద్ధులతో నేడు ఈ స్థాయికి చేరుకున్నామని తెలిపారు. విద్యాభారతి అఖిల భారత జనరల్ సెక్రటరీ కాశీపతి మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలన్నారు. పూర్వ విద్యార్థులు సన్నిధి సుబ్బారావు, పి.సూర్య నారాయణ మూర్తి, నాగార్జున రాజు తదితరులు మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.వి.షణత్ కృష్ణ , సహ ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ ఈస్ట్ :
99122 20539, 90101 31135
Office mail : sakshiads@gmail.com

చిన్న పరిశ్రమలతో లక్షలాది ఉద్యోగాలు

ఉపాధికి ఊతమిచ్చే ఎంఎస్ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం



సాక్షి, అమరావతి: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) నిరుద్యోగులకు వరం. వీటి ద్వారా భారీ సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తున్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చిన్న పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహాన్నిస్తోంది. వీటి ద్వారా లక్షలాది ఉద్యోగాలతోపాటు భారీగా పెట్టుబడులూ వస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిశ్రమలకు భారీగా ప్రోత్సాహకాలనిస్తున్నారు. కోవిడ్ సంక్షోభంలో కూడా ఈ పరిశ్రమలు నిలదొక్కుకొనేందుకు వివిధ రకాల ప్రోత్సాహకాలతో ఆదుకున్నారు. దీంతో ఈ రంగం రాష్ట్రంలో దినదినాభివృద్ధి చెందుతోంది. 2019 జూన్ నుంచి 2022 సెప్టెంబర్ మధ్య మూడేళ్లలో 1,06,249 ఎంఎస్ఎంఈ యూనిట్లు కొత్తగా ఏర్పాటుకాగా, వీటి ద్వారా 7,22,092 మందికి ఉపాధి లభించింది. రూ.14,656 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. కేంద్ర మంత్రిత్వ శాఖకు చెందిన ఎంఎస్ఈ పోర్టల్ 'ఉదయం' కూడా ఈ వివరాలను పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 2,32,998 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉండగా అందులో 45.6 శాతం ఈ మూడేళ్లలో వచ్చినవే. ఈ మొత్తం ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా 19,41,974 మందికి ఉపాధి లభిస్తుండగా అందులో 7.22 లక్షల మందికి ఈ మూడేళ్లలో లభించినవే. ఎంఎస్ఎంఈ రంగంలో ప్రతి కోటి రూపాయల పెట్టుబడి మీద సగటున 61 మందికి ఉపాధి లభిస్తోంది. ప్రతి యూనిట్ సగటున 8 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎంఎస్ఎంఈ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుండటంతో యూనిట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. కోవిడ్ వంటి కష్ట కాలంలో రీస్టార్ట్ ప్యాకేజ్ రూపంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని ఆదుకోవడమే కాకుండా వరుసగా ప్రతి ఏడాదీ రాయితీలను ఇవ్వడం పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచుతోంది. గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈలతో కలిపి అన్ని పరిశ్రమలకు రూ.3,409.66 కోట్ల పారిశ్రామిక బకాయిలు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని బాగా దెబ్బతీసింది. ఇటువంటి సమయంలో ఎంఎస్ఎంఈలను ఆదుకోవడానికి గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు బకాయి పెట్టిన రూ.962.05 కోట్లతో పాటు ప్రస్తుత కాలానికి రూ.362.48 కోట్ల ప్రోత్సాహకాలు కలిపి మొత్తం రూ.1,324.53 కోట్లు వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. వరుసగా మూడో ఏడాది మరో రూ.738.59 కోట్లు విలువైన ప్రోత్సాహక రాయితీలను చెల్లించడానికి ప్రణాళికను సిద్ధం చేస్తోంది. అంతే కాకుండా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించే విధంగా ప్రతి జిల్లాలో రెండు క్లస్టర్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే 53 క్లస్టర్లను గుర్తించి, 16 క్లస్టర్లకు డీపీఆర్‌లను సిద్ధం చేసింది. ఈ 16 క్లస్టర్ల ద్వారా మరో 28,270 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

అంతర్జాతీయ విక్రయానికి అవకాశం

రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు తయారు చేసిన ఉత్పత్తులను అంతర్జాతీయంగా విక్రయించుకునేలా వీటిని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) ప్రవేశపెట్టిన ఎంఎస్ఎంఈ మార్ట్‌తో అనుసంధానం చేశాం. ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణాలిచ్చేలా బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంటున్నాం. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ప్రాజెక్టు ప్రతిపాదన దగ్గర నుంచి విక్రయం వరకు అన్ని విధాలుగా చేయూతనిస్తున్నాం.

– వంకా రవీంద్రనాథ్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్

● తెలంగాణ

తెలంగాణలో సీబీఐకి 'నో ఎంట్రీ'

సాక్షి, హైదరాబాద్: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు తెలంగాణలో దాడులు, దర్యాప్తు చేసే అధికారాన్ని నిరాకరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో సీబీఐ దాడులు, దర్యాప్తునకు వీలు కల్పించే 'సాధారణ సమ్మతి (జనరల్ కన్సెంట్)'ని ఉపసంహరించుకుంది. ఈ మేరకు రహస్యంగా రెండు నెలల కిందే జీవో 51ను జారీ చేసింది. ఎలాంటి నేరాల విషయంలోనైనా తెలంగాణలో దర్యాప్తు చేసేందుకు ప్రతి కేసుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముందస్తుగా సమ్మతి తీసుకోవాల్సి ఉంటుందని అందులో స్పష్టం చేసింది.

దాడులపై ఊహాగానాల నేపథ్యంలో..

టీఆర్ఎస్ నేతలపై సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దాడులు చేయించనుందనే ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే 'ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1946'కి సంబంధించిన సభ్యులందరికీ గతంలో జారీ చేసిన సాధారణ సమ్మతిని ఉపసంహరించుకుంటూ రాష్ట్ర హోంశాఖ ఆగస్టు 30న రహస్యంగా జీవో 51 జారీ చేసింది. ఈ చట్టం కిందే సీబీఐ ఏర్పాటైంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో తెలంగాణలో సీబీఐకి ప్రవేశాన్ని నిరాకరించినట్టు అయింది. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులపై దర్యాప్తు చేసే అధికారాన్ని సైతం సీబీఐ కోల్పోయినట్టే. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ శాఖలు/సంస్థల ఉద్యోగులపై దర్యాప్తు విషయంలో సీబీఐ పాత్రను రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పోషించాల్సి ఉండనుంది.

ఎమ్మెల్యేలకు ఎర కేసు నేపథ్యంలో..

నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు భారీగా డబ్బు, పదవులు ఇస్తామని ఎర వేసి కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన ముగ్గురిని ఇటీవల సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో కేసు దర్యాప్తును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఏర్పాటు చేసిన సిట్‌కు అప్పగించాలంటూ బీజేపీ వేసిన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు శనివారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో సీబీఐకి సాధారణ సమ్మతిని ఉపసంహరించుకుంటూ జీవో నం.51 జారీ చేశామని.. సీబీఐ ప్రవేశానికి అనుమతి లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. దీనితో రెండు నెలల కింద రహస్యంగా జారీ అయిన జీవో తాజాగా బహిర్గతమైంది. ఇప్పటికే దేశంలో 8 రాష్ట్రాలు సీబీఐకి సాధారణ సమ్మతిని ఉపసంహరించుకోగా.. తెలంగాణ 9వ రాష్ట్రంగా మారింది.

మా వడ్లు కొనలేరు.. వందకోట్లతో ఎమ్మెల్యేలను కొంటారా?

- మునుగోడు ఎన్నికల సభలో బీజేపీపై కేసీఆర్ మండిపాటు
- టీవీల్లో చూసింది కొంతే... ఇంకా చాలా ఉంది
- ఢిల్లీ పీఠం దుమ్ము రేగుతుంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ''ఢిల్లీ బ్రోకర్‌గాళ్లు వచ్చి తెలంగాణ ఆత్మగౌరవాన్ని కొందామని చూశారు. ఒక్కొక్కరికి రూ.వంద కోట్లు ఇస్తాం. పార్టీ విడిచిపెట్టి రమ్మంటే మనోళ్లు వారిని ఎడమ కాలు చెప్పుతో కొట్టారు. రాజకీయం అంటే అమ్ముడుపోవడం కాదురా.. మేం అంగట్లో సరుకులం కాదని తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టారు. నిన్నమొన్న మీరు టీవీల్లో చూసింది గింతే. కానీ దొరికిన దొంగతనం ఎంతో ఉంది. ఢిల్లీ పీఠమే దుమ్ము రేగిపోయే పరిస్థితి ఉంది. రాబోయే రోజుల్లో అవన్నీ బయటపడతాయి'' అని తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. వడ్లు కొనడం చేతకాదు కానీ రూ.100 కోట్లతో ఎమ్మెల్యేలను కొంటారట అని బీజేపీపై మండిపడ్డారు. రూ.వంద కోట్లు ఇస్తామంటే గడ్డిపరకతో సమానమన్న నిఖార్సైన తెలంగాణ బిడ్డలు లాంటివారు రాజకీయాల్లోకి రావాలన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరులోని బంగారిగడ్డలో నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు.

ఇంకా ఎందుకీ కిరాతకం?

దేశంలో ప్రధాని పదవిని మించి ఇంకా ఏముంది? మోదీకి రెండుసార్లు అవకాశం వచ్చింది కదా? ఇంకా ఎందుకీ కిరాతకం? ఆయన ప్రమేయం లేకుండానే ఆరెస్సెస్ వ్యక్తులు హైదరాబాద్ వచ్చారా? మోదీ తెచ్చిన విద్యుత్ సంస్కరణల పేరిట మీటర్లు పెట్టుకొని కొంపలు ఆర్పుకుందామా? రూ.వందల కోట్ల అక్రమ ధనం తెచ్చి ప్రజా ప్రతినిధులను సంతలో పశువుల్లా కొని ప్రభుత్వాలను కూల్చే అరాచక వ్యవస్థ మంచిదా? ఇంత అరాచకం జరుగుతుంటే మౌనంగా ఉందామా? ఎవరో ఒక తలమాసినోడు తడిబట్టలతో ప్రమాణం చేస్తవా? అంటడు. ఇంకొకడు వచ్చి పొడి బట్టలతో ప్రమాణం చేస్తవా? అంటడు. దొరికిన దొంగలు జైల్లో కనిపిస్తలేరా?

నాడు సిద్ధిపేట.. నేడు మునుగోడు

సిద్దిపేట ప్రజలు నన్ను తెలంగాణ పోరాటానికి పంపిస్తే రాష్ట్రాన్ని సాధించా. ఇవాళ మునుగోడు ప్రజలకు గొప్ప అవకాశం దక్కింది. పునాది రాయి పెట్టే అవకాశం వచ్చింది. తెలంగాణలా దేశాన్ని బాగుచేయాలని ఈ రోజు పుట్టుకొస్తున్నదే బీఆర్ఎస్ పార్టీ. రాష్ట్రం ఏర్పడి 8 ఏళ్లు అయినా మోదీ నీటి వాటా ఎందుకు తేల్చడం లేదు. రూపాయి పతనానికి బాధ్యులు ఎవరు? ధరల పెరుగుదలకు కారణం ఎవరు? సిలిండర్ రూ.1200 చేసింది ఎవరు? పెట్రోల్, డీజిల్ ధరలు పెంచింది ఎవరు? మనలను నూకలు తినమన్న వాడి తోకలు కత్తిరించాలి.

బీజేపీ, టీఆర్ఎస్ రెండూ ఒక్కటే

- ఆ రెండు పార్టీలు ప్రజల గొంతుకను నొక్కేస్తున్నాయి
- ఎన్నికలప్పుడే కొట్లాడుతాయి.. ఆ తర్వాత కలిసి పోతాయి
- షాద్‌నగర్ సభలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ధ్వజం



సాక్షి, రంగారెడ్డి: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వాలు రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే డ్రామాలు ఆడుతుంటాయని, తర్వాత రెండు పార్టీలు కలిసి పని చేస్తుంటాయని, పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టిన ప్రతి బిల్లులకు టీఆర్ఎస్ మద్దతు పలకడమే ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు. ఈ రెండు ప్రభుత్వాలు ప్రజల గొంతును నొక్కేస్తున్నాయని, రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నాయని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి హింసను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు.'భారత్ జోడో యాత్ర' ఆదివారం సాయంత్రం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చేరింది. యాత్రలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గం శివారులో ఏర్పాటు చేసిన సభలో రాహుల్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేనేత రంగం, చిరు వ్యాపారులపై జీఎస్టీని ఎత్తేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ధరణి పోర్టల్‌ను సంస్కరించి ప్రభుత్వం గుంజుకున్న దళితుల భూములను మళ్లీ వాళ్లకు పంచి, ఆ భూములపై వారికి సర్వహక్కులు కల్పిస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెట్టాల్సిన ఖర్చును కమీషన్ల కోసమే ఇరిగేషన్ ప్రాజెక్టులకు మళ్లిందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిలిపేసి పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం చేసిందన్నారు.

ప్రాధాన్య పనులు వేగంగా

▶ మొదటి పేజీ తరువాయి

కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్నారు.

అత్యధికంగా రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ పనులు

గడప గడపకు మన ప్రభుత్వంలో అత్యధికంగా అంతర్గత రహదారులు, మంచినీటి పథకాలు, డ్రైనేజీ పనులను మంజూరు చేస్తున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ 'సాక్షి'కి తెలిపారు. విద్యుత్ లైన్ల మార్పు పనులకు డిమాండ్ ఉందని, ట్రాన్స్‌కోకు అడ్వాన్స్ చెల్లింపులు లేకుండా వీటిని చేపట్టాలని ఆదేశించినట్లు చెప్పారు. అడ్వాన్స్ చెల్లింపుల నుంచి వీటికి మినహాయింపు కల్పించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన పనులను అప్‌లోడ్ చేసిన వారం లోగా మంజూరు చేయడంతో పాటు నెల రోజుల్లోనే ప్రారంభిస్తున్నామన్నారు.

ఈ నెల 27 వరకు పనులు మంజూరు, ప్రారంభం ఇలా..

జిల్లా	మంజూరు సంఖ్య	ప్రారంభమైన పనులు
విజయనగరం	504	122
అల్లూరి సీతారామరాజు	287	111
వైఎస్సార్	637	359
ఏలూరు	402	309
విశాఖపట్టణం	307	61
ఎన్టీఆర్	422	27
గుంటూరు	362	119
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	667	215
అంబేద్కర్ కోనసీమ	526	37
నంద్యాల	389	282
తూర్పు గోదావరి	622	415
తిరుపతి	743	459
శ్రీ సత్యసాయి	643	372
కాకినాడ	511	408
చిత్తూరు	1,129	747
కృష్ణా	348	166
అన్నమయ్య	433	252
కర్నూలు	479	292
ప్రకాశం	639	494
శ్రీకాకుళం	907	636
పల్నాడు	583	276
బాపట్ల	493	364
అనంతపురం	972	651
అనకాపల్లి	736	163
పశ్చిమ గోదావరి	621	264
పార్వతీపురం మన్యం	801	647
మొత్తం	15,163	8,248

పెదకాకాని శివాలయంలో కార్తీక శోభ



పెదకాకాని శివాలయం క్యూలైన్లలో భక్తులు

పెదకాకాని: శివాలయం కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా భక్తులతో కళకళలాడింది. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి యజ్ఞాల బావి వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో ఆది, సోమవారాలలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే అభిషేకపూజలు, దర్శనానికి అనుమతిస్తున్నట్టు వెల్లడించారు. కార్తీక నిత్యాభిషేక పథకానికి రూ.2 వేలు చెల్లించి నెలంతా స్వామి పరోక్ష అభిషేక సేవలో పాల్గొనవచ్చని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య శివాలయాన్ని సందర్శించారు. స్వామిని దర్శించుకుని అభిషేక, పంచహారతుల పూజల్లో పాల్గొన్నారు.

నేటి నుంచి విజ్ఞాన్‌లో అంతర్జాతీయ కాన్ఫరెన్స్

- ముఖ్య అతిథిగా నోబెల్ గ్రహీత డాక్టర్ సర్ రిచర్డ్ జె.రాబర్ట్స్ రాక
- యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమైన ప్రీ-కాన్ఫరెన్స్ ట్యుటోరియల్



విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రీ కాన్ఫరెన్స్ ట్యుటోరియల్ కార్యక్రమంలో స్పందన్ చౌదరి

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ కాన్ఫరెన్స్ జరుగుతుందని వీసీ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. ఫ్రాంటీర్స్ ఇన్ న్యూట్రిషన్, మెడికల్ జీనోమిక్స్ అండ్ డ్రగ్ డిస్కవరీ (ఇన్‌టిక్స్–22) అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రీ–కాన్ఫరెన్స్ ట్యుటోరియల్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ సర్ రిచర్డ్ జె.రాబర్ట్స్ హాజరుకానున్నారని తెలిపారు. కాన్ఫరెన్స్‌కు బెంగళూరులోని ఐఐఎస్సీ మాజీ డైరక్టర్ జి.పద్మనాభన్, హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ కె.తంగరాజ్ వస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ప్రారంభించిన ప్రీ–కాన్ఫరెన్స్ ట్యుటోరియల్‌లో అండర్‌స్టాండింగ్ ఆఫ్ నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశాన్ని అహ్మదాబాద్‌లోని యూనిపత్ ల్యాబ్స్‌కి చెందిన డాక్టర్ స్పందన్ చౌదరి తెలియజేశారు. మెషిన్ లెర్నింగ్ స్ట్రాటజీస్ ఫర్ బయోలాజిస్ట్స్ అనే అంశాన్ని పూణేలోని ఫ్లేమ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ జయరామన్ కె.వలది వివరించారు. ఆయా విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనతో ప్రజా సమస్యల పరిష్కారం

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి



సాక్షి, బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలను ఎంతగానో ఆకర్షించాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తోందని వివరించారు. బాపట్ల పట్టణంలో 2011లో 2600 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అప్పటి కలెక్టర్ రామాంజనేయులు పూర్తి విచారణ జరిపి పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

ఆరోగ్యానికి అభయం

పేదలకు అపర సంజీవనిగా 'ఆరోగ్య శ్రీ'

- ప్రొసీజర్ల పెంపుతో మరింత అండ
- పథకం పరిధిలోకి మొత్తం 3,255 రకాల చికిత్సలు
- ఉమ్మడి కృష్ణాలో 13.50 లక్షల కుటుంబాలకు మేలు
- 198 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు
- ఆరోగ్య ఆసరా పథకంతో రోగులకు చేయూత
- ఇబ్బందులు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత చికిత్స



ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న రోగులు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని కార్పొరేట్ ఆస్పత్రి గడప తొక్కితే.. ఎలాంటి జబ్బుకైనా ఉచిత వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందుకోసం ఆరోగ్య శ్రీ పథక సేవలను మరింత విస్తృతం చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 13.50 లక్షల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. రాష్ట్రంలో 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ఆరోగ్య శ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్లకు మాత్రమే చికిత్సలు జరుగుతున్నాయి. వైద్య రంగాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని తొలివిడతలో 2,446 ప్రొసీజర్స్‌కు పెంచడంతో పాటు, ప్రస్తుతం వాటికి 809 ప్రొసీజర్లను జోడించి మొత్తం 3,255 రకాల చికిత్సలను పథకం పరిధిలోకి తెచ్చారు.

ఉమ్మడి జిల్లాలో సేవలు ఇలా..

- రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వార్షికాదాయం రూ.5 లక్షలు ఉన్న వారికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చింది.
- దీంతో ఉమ్మడి కృష్ణాలో లబ్ధిదారులకు సంఖ్య 13.50 కుటుంబాలకు పెరిగింది.
- జిల్లాలోని 198 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలను 2019–20లో 58,562 మంది పొందగా, ప్రభుత్వం రూ.152.91 కోట్లు ఖర్చు చేసింది.
- 2020–21లో 58754 మందికి సేవలు అందించగా, రూ.132.78 కోట్లు ప్రభుత్వం వెచ్చించింది.
- 2021–22లో 93,148 మంది పథకం కింద చికిత్స పొందగా, రూ.195.36 కోట్లు వారి కోసం వివిధ ఆస్పత్రులకు చెల్లించింది.
- 2022 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 28 వరకూ 66,708 మంది చికిత్స పొందగా, రూ.144.67 కోట్లు విడుదల చేసింది.

ఆసరాతో భరోసా..

ఆరోగ్య శ్రీ పథకంలో చికిత్సలు పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడకుండా 2019 డిసెంబరులో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో విశ్రాంతి తీసుకునే సమయంలో రోజుకు రూ.225 చొప్పున, గరిష్టంగా నెలకు రూ.5 వేలు వైద్యుల సూచన మేరకు చెల్లిస్తారు. ఈ పథకం ద్వారా జిల్లాలో డిసెంబరు 2019 నుంచి మార్చి 2022 వరకూ 75,494 మందికి రూ.50.87 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. కాగా 2022 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు 30 వరకూ 23,578 మందికి గాను రూ.15.15 కోట్లను అందించింది. ఈ పథకంతో పేదలు ఇంటి వద్దనే ఉంటూ ఆర్థిక ఇబ్బందులు లేకుండా కోలుకునే వరకూ సంతోషంగా ఉండగలుగుతున్నారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో పరిస్థితి

మూడున్నరేళ్లలో ఆరోగ్య శ్రీ కింద సేవలు పొందిన వారు:	2,77,170 మంది
ప్రభుత్వం ఖర్చు చేసిన వ్యయం:	రూ. 472.81 కోట్లు
ఆరోగ్య ఆసరా పొందిన వారు:	99,072 మంది
ఆసరా కింద చెల్లించిన మొత్తం:	రూ. 66.02 కోట్లు

కరోనా, డెంగీలకూ చికిత్స

దేశంలో ఎక్కడా లేని విధంగా కోవిడ్‌కు సైతం రాష్ట్రంలో ఆరోగ్యశ్రీలో చికిత్స అందించారు. జిల్లాలో వేలాది మంది రోగులు ఆరోగ్యశ్రీలో కోవిడ్ చికిత్సలు పొంది పునర్జన్మను పొందారు. డెంగీని కూడా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చింది. తాజాగా రోడ్డు ప్రమాదాల్లో ముఖ గాయాలైన వారికి మాక్సిల్లో ఫేషియల్ సర్జరీలు, ట్రామా కేర్ వంటి చికిత్సలను అందుబాటులోకి తేవడంతో సమగ్ర వైద్య సేవలు ఆరోగ్య శ్రీలో అందనున్నాయి.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం..



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. జిల్లాలో 198 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు అందిస్తున్నాం. వాటిలో ప్రైవేటు ఆస్పత్రులు 61, ప్రభుత్వ సాధారణ ఆస్పత్రులు 2, ఏరియా ఆస్పత్రులు 2, సీహెచ్‌సీలు 13, పీహెచ్‌సీలు 87, దంత ఆస్పత్రులు 33 ఉన్నాయి. వీటిలో రోగలకు హెల్ప్‌డెస్క్‌ల ద్వారా ఆరోగ్య మిత్రలు తగిన సమాచారం ఇస్తూ సేవలు అందిస్తున్నారు. కొత్త ప్రొసీజర్స్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చడంతో సమగ్ర వైద్య సేవలు రోగులకు అందనున్నాయి.

– డాక్టర్ జె. సుమన్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్, ఉమ్మడి కృష్ణాజిల్లా

సేవలు అభినందనీయం..



రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ సేవలను విస్తరిస్తూ 3,255 ప్రొసీజర్లకు పథకాన్ని వర్తింప చేయడం అభినందనీయం. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ పునరుజ్జీవం కల్పించడమే కాకుండా, సేవలను విస్తృతం చేస్తూ పేదల వైద్యానికి అండగా నిలుస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ముఖ ఎముకలు విరిగిన వారికి చేసే మాక్సిల్లో ఫేషియల్ సర్జరీలు, ట్రామా చికిత్సలను ఆరోగ్య శ్రీ పరిధిలోకి తేవడం శుభపరిణామం.

– డాక్టర్ మెహబూబ్ షేక్, డీసీఐ సభ్యుడు

నెట్‌బాల్ చాంపియన్‌గా కృష్ణా





సీనియర్స్ నెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన కృష్ణా పురుషులు, మహిళల జట్లు

విజయవాడ రూరల్: మండలంలోని నున్నలో ఉన్న వికాస్ బీపీఈడీ కాలేజీ క్రీడా మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఎనిమిదో ఆంధ్రప్రదేశ్ సీనియర్స్ స్త్రీ, పురుషుల నెట్ బాల్ చాంపియన్‌షిప్ అతిథ్య కృష్ణా జట్టు కైవసం చేసుకుంది. సబ్ జూనియర్స్ బాలురలో విభాగంలో కృష్ణా, బాలికల్లో కడప జట్లు విజేతలుగా నిలిచాయి. రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల ఫైనల్స్ ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో జరిగాయి. పురుషుల ఫైనల్స్‌లో కృష్ణాజిల్లా జట్టు 13–9 గోల్స్ తేడాతో విశాఖపట్నంపై గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా జట్టు 11–7 గోల్స్ తేడాతో కడపపై గెలిచి మూడోస్థానం దక్కించుకుంది. మహిళల విభాగంలో కృష్ణాజట్టు తూర్పు గోదావరిపై గెలుపొంది విజేతగా నిలిచింది. తూర్పుగోదావరి ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడో స్థానం కోసం ప్రకాశం, కడప జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ప్రకాశం జట్టు 7–6 గోల్స్ తేడాతో విజయం సాధించింది. సబ్‌జూనియర్స్ బాలుర విభాగంలో కృష్ణా జట్టు 7–5 గోల్స్ తేడాతో ప్రకాశంపై విజయం సాధించింది. దీంతో కృష్ణా ప్రథమస్థానం, ప్రకాశం ద్వితీయ స్థానంలో నిలిచాయి. కడప జట్టు నెల్లూరుపై 8–5 గోల్స్ తేడాతో గెలిచి మూడోస్థానం దక్కించుకుంది. బాలికల విభాగంలో కడప జట్టు 19–13 గోల్స్ తేడాతో విశాఖపట్నంపై గెలుపొంది సబ్ జూనియర్ బాలికల టైటిల్ కైవసం చేసుకుంది. విశాఖపట్నం రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో నెల్లూరుపై శ్రీకాకుళం జట్టు 10–7 గోల్స్ తేడాతో గెలుపొందింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో వికాస్ విద్యా సంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. నెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.శివరామ్, కృష్ణాజిల్లా కార్యదర్శి బి.హిమబిందు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి టి.వెంకట్, వికాస్ బీపీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజు, అధ్యాపకులు జి.రఘురామ్, నాగరాజు పాల్గొన్నారు.

మంచి మాట

భగవంతుని సృష్టిలో అంతర్భాగమైన కాలానికి ఉన్న శక్తి అద్భుతమైనది, అమోఘమైనది. కష్ట సుఖాలని, మంచి-చెడులని, కలతలని, కన్నీళ్ళని ఇలా అన్నిటిని తనలో లీనం చేసుకుంటూ, వాటి తాలూకు జ్ఞాపకాలని మాత్రమే మిగులుస్తూ, కాలచక్రం గిర్రున తిరిగిపోతుంటుంది.. మన కళ్ళ ఎదుటే ఎంతోమంది మృత్యు ఒడిలోకి జారిపోతున్న వారిని చూస్తున్నా, ఆ దుఖాన్ని అనుభవిస్తున్నా, ఆ క్షణంలో ఎంతో విరక్తిని కల్గించి, కాలక్రమేణా ఆ దుఃఖభారాన్ని మరపింపచేసి, మన జీవితమే శాశ్వతమన్నంతగా మనసు మరల్చి మాయ చేస్తుంది. ఇంతకన్నా విచిత్రం ఏముంటుంది కనుక. ఇంతటి మహత్తరమైన, శక్తిమంతమైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం.

కాలం మహత్తరం శక్తిమంతం


ప్రయోగించే విధానాన్నిబట్టి కాలం అర్థం మారిపోతుంటుంది. ఏదో ఆలా కాలక్షేపం చేస్తున్నామండీ అని పెద్దలు అంటుంటారు. అంటే 'రోజులు గడుపుతున్నాము' అని అర్థం. ఏదైనా విచిత్ర సంఘటన కళ్ళబడితే 'కలికాలం','పిదపకాలం' అంటుంటారు. పురాణ పఠనం చేస్తుంటే దాన్ని 'సత్కాలక్షేపం' అంటుంటారు. ఇలా అర్థాలు ఎన్ని మారినా, కాలప్రభావంలో మాత్రం ఎటువంటి మార్పు ఉండదు.

కాలం గడపటం అంటే 'పొద్దుపుచ్చటం' అని మాత్రమే కాదు. నిజానికి సద్వినియోగం చేసుకున్నా,దుర్వినియోగం చేసుకున్నా కాలం మాత్రం ఎవరికోసమూ ఆగదు. ఆటపాటలతో బాల్యం గడచిపోతుంది. అది సహజం. ఆశలు, ఆశయసాధనాలు, వివాహం, సంతానం, ఇలా ప్రౌఢ, యుక్తవయస్సులు గడచిపోతాయి. అది అప్పటిక వసరం. ఇక మిగిలేది బాధ్యతలు తీరిన జీవితం, అలసిపోయిన శరీరం. మొదటి మూడు దశలలోనూ గిర్రున తిరిగిన కాలం, నాల్గవ దశలో, వయసు మీద పడేసరికి కొంత భారంగా గడుస్తున్నట్టనిపిస్తుంది. ఇంటి పెద్దగా ఎన్నో బాధ్యతలతో తలమునకలై, జీవనపోరాట ప్రవాహంలో కొట్టుకుపోతూ, ఒక్కసారిగా విశ్రాంతి లభించటంతో కాలం స్తంభించినట్టుగా భావిస్తాం. కాని ఆలోచిస్తే ఈ విశ్రాంతి పెద్దలకు ఒక వరమనే చెప్పవచ్చు. ఎందుకంటే, నిబద్ధతతో కూడిన లక్ష్యసాధన, ఏ వయసు వారినైనా కాలాన్ని సద్వినియోగపరచుకునేలా చేస్తుంది. సక్రమంగా ఉపయోగించుకోలేక పోతే, సమయం వృథా అయిపోయి, జీవితం నిస్సారం గా తయారవుతుంది.

వయస్సులో ఉన్నవారు తమ ఆశయసిద్ధి కోసం అవిరామంగా కృషి చేయాలి. వయసు మీరిన వారు తమకు వయసు నేర్పిన పాఠాలు, అనుభవాలు భావితరాలకు పంచవచ్చు. తమలోని మరుగుపడిపోయిన కళలను, సృజనాత్మక శక్తిని వెలికి తీసే అవకాశం పొందవచ్చు. చక్కని గ్రంథ పఠనం చేసుకోవచ్చు. వృద్ధాశ్రమాలకి వెళ్లి, అక్కడి వారి యోగక్షేమాలని విచారిస్తూ, వారి అనుభవాలను పంచుకుంటూ, తగిన సలహాలు, సూచనలు అందించవచ్చు. ఎదుటివారికి చేతనైనంత సహాయం చేస్తూ, హాయిగా కాలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

అయితే కాస్త వయసు మీరాక, వీటి కన్నిటికీ కాలాన్ని సక్రమంగా ఉపయోగించాలంటే శారీరక ఆరోగ్యం చాలా ముఖ్యం. కాబట్టి యోగసాధన జీవితంలో ఒక భాగం కావాలి. యోగసాధన శారీరక, మానసిక రుగ్మతలని దూరం చేస్తుంది.

ఏ ఋతువులో ఆ పువ్వు పూస్తుంది. ఆ కాయ కాస్తుంది. సకల జీవరాసులు, కాలానికి అనుగుణంగా తమ తమ జీవనశైలిని మార్చుకుంటూ, కాలానికి కట్టుబడి జీవిస్తాయి. కాలాన్ని సద్వినియోగపరచుకోవటంలో తన మేధస్సును మరింత చక్కగా ఉపయోగించుకోవాలి కదా. కర్మసిద్ధాంతం ప్రకారం జరగాల్సిందేదో అదే జరుగుతుందిలే అని వదిలి వేయకుండా మానవ ప్రయత్నం చేయాలి. భూత భవిష్యత్ ప్రభావాలని రంగరించుకుంటూ జీర్ణించుకుంటూ మెరుగులు దిద్దుకుంటూ సాగాలి.



'గతాన్ని తలచుకుని వగచ వద్దు.. భవిష్యత్ గురించి భయపడవద్దు... వర్తమానంలో జీవించు' అంటారు పెద్దలు. మనసుని కలచి వేసే సంఘటనలు, మధుర స్మృతులు- రెండూ ప్రతి వ్యక్తి జీవితంలో ఉంటాయి. అయితే ఆ సంఘటనల వల్ల కలిగిన గాయం మనకు నేర్పుతున్న పాఠాలు ఏమిటి అని తరచి చూసుకోవాలి. దానిద్వారా మనల్ని మనం సరిదిద్దుకునే అవకాశం లభిస్తుంది. అంతేకాని దాని గురించి అతిగా వ్యథ పడ కూడదు.అలాగే మనసుని సంతోషపెట్టే సంఘటనలను తలచుకోవడం వల్ల మానసిక ఉత్సాహం ఇనుమడిస్తుంది. ఉదాహరణకి బాల్యస్మృతులు ఇంచుమించు అందరికీ ఆనందం కలిగించేవే. ఇక భవిష్యత్తు గురించి కలలు కనడం తప్పు కాదు కానీ అంతకే పరిమితమైపోకుండా, ఆ కలని సాకారం చేసుకోవడానికి తగిన కృషి చేయాలి.

– అదవి అన్నపూర్ణ

గురువాణి

నవరత్నమాల

జీవితంలో విలువైనవి కొన్ని ఉంటాయి. ఎక్కడ ఉత్కృష్టమైనది ఉందో ఎక్కడ అత్యంత విలువైనది ఉందో ఏది మనలను రమింప చేస్తుందో, ఏది రమింప చేస్తే ధర్మబద్ధమవుతుందో దేనియందు రమిస్తే అభ్యున్నతి కలుగుతుందో అటువంటివి ప్రతిపాదించి ఇవి రత్నాలని తెలుసుకో... అన్నారు పెద్దలు. నిజానికి మనిషి ధరించాల్సిన మాల ఏదయినా ఉంటే అది ఇదే అవుతుంది. లోకంలో నవరత్నాలు అనేది ప్రసిద్ధి వహించిన మాట. రత్నాలు 9 రకాలంటారు. అవి...కళలలో రత్నం గీతం. కళ అంటే సంస్కృతిని పెంచేది, ఉత్తమ భావజాలాన్ని నింపేది. కవిత్వం, సంగీతం, శిల్పకళ... వంటివి మనసుకి ప్రశాంతతనిస్తాయి. సంగీతంలోకి వాద్యం, గానం, నృత్యం అనేవి వస్తాయి. వీటిలో గానం ఉత్కృష్టమైనది. సంగీతసాహిత్యాలు రెండూ అర్థమయితే పరవశమే. ఒకవేళ సాహిత్యం అర్థం కాకపోయినా, అసలు తెలిసున్న భాషే కాకపోయినా పాట మాధుర్యం శాంతి కారకం. ఇన్ని స్థాయిలలో ఉన్న వాటిని పరవశింప చేయగల గానం కళలలోకెల్లా గొప్పది. కాబట్టి కళారత్నం గీతం.. అంటే పాట.

శ్రవణ సుఖరత్నం హరికథః ... తెలిసి విన్నా, తెలియక విన్నా, హరి నామం విన్నంత మాత్రానికే భగవంతుని అనుగ్రహం కలుగుతుంది. హరినామం, హరికథలు లేని ప్రాంతం ఎంగిలాకులకోసం కాకులు చేరే ఒక దుర్గంధ ప్రదేశాల్లాంటివంటారు. తెలుగునాట హరికథ బాగా ప్రశస్తి పొందింది. అందులో నృత్యం, గానం, పద్యం, ఉపన్యాసం, వ్యాఖ్యానం అన్నీ ఉంటాయి. అందువల్ల అది చెవులకు ఇంపైనది.

రణేరత్నం వాజీ- వాజీ అంటే వేగంగా పరుగెత్తేది గుర్రం. డెక్కలు చీలి ఉండవు కాబట్టి కొండలు, గుట్టలు, మైదానాలు అన్నీ సునాయాసంగా తిరిగేస్తుంది. అందువల్ల అది ఒక శ్రేష్ఠమైన రత్నం. గగన తల రత్నం దినకరః- సూర్యుడు ఉదయించడంతోటే సమస్త జీవరాశిలో చైతన్యం వెల్లి విరుస్తుంది. నిశారత్నం చంద్రః – పగలు సూర్య కాంతితో శోషించిన ప్రాణులన్నీ రాత్రిపూట వెన్నెలలో సేదతీరతాయి. అందువల్ల చీకటిలో ప్రకాశించే చంద్రుడు ఒక రత్నం. శయనతల రత్నం శశిముఖి–చంద్రబింబం ఎలా శాంతినిస్తుందో అలా భర్తకు శాంతినిచ్చేది భార్యనే. ఆమె శాంతి స్థానం. సభారత్నం విద్వాన్ – విషయం తెలిసున్నవాడు, ధర్మానుష్ఠానపరుడు అయిన విద్వాంసుడు సభకు రత్నం. నృపతికుల రత్నం రఘుపతిః – రఘుపతి అంటే రామచంద్రమూర్తి. రాజులందరికీ ఆదర్శప్రాయుడు. ఆయనలాంటి ఆదర్శపాలకుడు రత్నంవంటివాడు. మరి తొమ్మిదో రత్నం ఏది! రత్నమున్నా దానిని రాయిగా చూస్తున్నంతకాలం వాడు ఐశ్వర్యవంతుడు కాలేడు. కాబట్టి పై 8 రత్నాల విలువను గ్రహించి గౌరవిస్తే.. మీరే ఆ 9వ రత్నం. 9వ రత్నమే లేకపోతే మిగిలిన 8 రత్నాలున్నా ఉపయోగం లేదు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



సువార్త

దైవిక సహాయం

నీకు సహాయం చేయువాడను నేనే (యెషయా 41:10). ఈ ప్రపంచంలో నాకు సహాయం చేసేవారు ఎవరూ లేరు అని చాలామంది కృంగిపోతుంటారు. నాకెందుకు ఎవ్వరూ సహాయం చేయట్లేదు అనే ఆలోచన వచ్చిన ప్రతి ఒక్కరూ దైవగ్రంథంలోని ఈ వాగ్దానాన్ని పూర్ణమనస్సుతో విశ్వసించాలి. దేవుడు ఆపత్కాలమున నమ్ముకొనదగిన సహాయకుడు అనే పేరు ఉంది. నీకు సహాయం చేయడానికి దేవుడు ఎల్లప్పుడూ సంసిద్ధుడే. విపత్కరపరిస్థితులు ఎదురైనప్పుడు, సమస్యలు మీద పడినప్పుడు నిన్ను పట్టించుకోని ప్రజల చుట్టూ తిరిగి ఎంతగా అలసిపోయావో చూడు! ఎంతగా నలిగిపోయావో చూడు! ప్రపంచంలో రెండు రకాల ప్రజలుంటారు. మొదటి రకం 'నీకు కష్టాలుంటే మాకేంటి' అంటారు. రెండవ రకం ప్రజలు 'నీకు కష్టాలున్నందుకు మహానందం పొందుతారు'. ఈ సువిశాల విశ్వంలో దేవుడు మాత్రమే నిన్ను యధాతథంగా అర్థం చేసుకోగలడు. నీ అంతరంగంలో గూడుకట్టుకొని ఉన్న దుఃఖాన్ని తొలగించే దేవుడు నీకున్నాడని ఎన్నడు మరచిపోవద్దు.



యేసుక్రీస్తు ప్రభువు నరావతారిగా ఉన్న దినాలలో ఆయన దగ్గరకు విశ్వాసంతో వచ్చినవారందరూ సహాయాన్ని పొందుకొని సంతోషంతో తిరిగి వెళ్ళిపోయారు. యెరికో పట్టణంలోని బర్తిమయి అనే ఒక అంధుడు క్రీస్తు ప్రభువు ఆ ప్రాంతాన్ని దర్శిస్తున్నాడని విని యేసూ నన్ను కరుణించుమని కేకలు వేశాడు. చుట్టునున్న మనుష్యులంతా అతన్ని చీదరించుకున్నా దేవుడు అతన్ని చేరదీసి అతని కన్నులను తెరవచేశారు. అయితే అవిశ్వాసులు ఎన్నో పొందుకోవాలని వచ్చినా ఏమీ పొందుకోలేకపోయారు. జీవజల దాతయైన ప్రభువు వద్దకు వచ్చి ఏమీ పొందకుండా వెళ్లిపోవడమంటే బాగా దాహమున్నవాడు ప్రవహించే నది వద్దకు వచ్చి కూడా దాహాన్ని తీర్చుకోనట్లే.

అదే విధంగా ఈనాడు అనేకులు యేసు వద్దకు వస్తున్నా, కొందరు మాత్రమే ప్రభువులోనున్న నిత్యానందాన్ని, చెప్పనశక్యమైన సంతోషాన్ని అనుభవిస్తున్నారు. కొందరు మాత్రమే ఆ ప్రేమామయుని సహకారాన్ని పొందుతున్నారు. కారణం వారు దేవునియందు సరియైన రీతిలో విశ్వాసాన్ని కనుపరుస్తున్నారు గనుక. దేవునియందు విశ్వాసం ద్వారా సహాయాన్ని పొందుకున్నవారు ఎందరో ఉన్నారు. నీకు సహాయం చేసే దేవుడు కావాలా? ఎంతో ఆశ చూపి చివరకు నిరాశపరిచే ఎండమావుల వంటి లోకం కావాలా? ఆలోచించు.

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా

సంతోష్‌లో నన్ను నేను చూసుకున్నా – నాని


● వెంకట్, మేర్లపాక గాంధీ, మారుతి, నాని, సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా

"**నే**ను, సంతోష్ శోభన్.. ఇంద్రగంటి మోహనకృష్ణగారి స్కూల్ నుండే వచ్చాం. 'గోల్కొండ హైస్కూల్'లో సంతోష్ నటన చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను.. పరిణితితో నటించాడు. సంతోష్‌లో నన్ను నేను చూసుకున్నానని అప్పుడే ఇంద్రగంటితో చెప్పాను'' అని హీరో నాని అన్నారు. సంతోష్ శోభన్, ఫరియా అబ్దుల్లా జంటగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా నవంబర్ 4న విడుదలకానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ''సంతోష్ వరుసగా సినిమాలు చేస్తుండటం హ్యాపీ.. తనకు వరుస విజయాలు రావాలి. వెంకట్ బోయనపల్లి గారితో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది'' అన్నారు. ''లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' ఘన విజయం సాధించాలి'' అన్నారు దర్శకుడు మారుతి. ''నానీగారిని తొలిసారి కలిసినప్పుడు 'నీలో నన్ను చూసుకున్నాను' అన్నారు.. ఇప్పటి వరకూ నేను అందుకున్న బెస్ట్ కాంప్లిమెంట్ అది'' అన్నారు సంతోష్ శోభన్. ''మేర్లపాక ఈ సినిమాని బాగా తీశాడు'' అన్నారు వెంకట్ బోయనపల్లి. ''లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్' చాలా వినోదాత్మకంగా ఉంటుంది'' అన్నారు మేర్లపాక గాంధీ. ''నేను ఒత్తిడిలో ఉన్నప్పుడు మేర్లపాక గాంధీ సినిమాలే చూస్తాను'' అన్నారు డైరెక్టర్ నందినీ రెడ్డి. ఈ వేడుకలో నటులు బ్రహ్మాజీ, సుదర్శన్, సంగీత దర్శకుడు ప్రవీణ్ లక్కరాజు పాల్గొన్నారు.

మహిళలకు బాగా నచ్చుతుంది – వరలక్ష్మి



''క్రాక్'లో నేను చేసిన జయమ్మ పాత్ర తర్వాత తెలుగులో నాకు మంచి అవకాశాలు వస్తున్నాయి. తమిళంలో సినిమాలు చేసే టైమ్ లేనంతంగా తెలుగు చిత్రాలు చేస్తున్నాను. దర్శకులు నా కోసం ప్రత్యేక పాత్రలు రాస్తుండటం సంతోషంగా ఉంది'' అన్నారు నటి వరలక్ష్మీ శరత్‌కుమార్. సమంత టైటిల్ పాత్రలో నటించిన సినిమా 'యశోద'. హరి–హరీష్ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 11న విడుదలవుతోంది. ఇందులో కీలక పాత్ర చేసిన వరలక్ష్మీ శరత్ కుమార్ మాట్లాడుతూ– ''సమంత పన్నెండేళ్లుగా నాకు తెలుసు.. తను స్ట్రాంగ్ ఉమెన్. 'యశోద'లో కథే హీరో. మేమంతా ఆ కథలో పాత్రధారులు మాత్రమే. ఈ చిత్రంలో సరోగసీ అనేది ఒక టాపిక్ అంతే. ఈ సినిమాలో నేను డాక్టర్ పాత్ర చేయలేదు.. సరోగసీ ఫెసిలిటీ సెంటర్ హెడ్ పాత్రలో నటించాను. నా నిజ జీవితానికి విరుద్ధమైన పాత్ర ఇది. మహిళలు ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు. ప్రతి పాత్ర కోసం దర్శకులు బాగా రీసెర్చ్ చేశారు. ఈ మూవీ కోసం సమంత చాలా కష్టపడ్డారు. మణిశర్మగారు మంచి సంగీతం ఇచ్చారు. శివలెంకగారు గ్రాండ్‌గా ఈ మూవీ తీశారు. ప్రస్తుతం నేను తెలుగులో 'శబరి' సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నాను. బాలకృష్ణగారి 'వీర సింహారెడ్డి' చిత్రంలో కీ రోల్ చేస్తున్నాను'' అన్నారు.


● తమ్మారెడ్డి, అల్లు శిరీష్, అనూ ఇమ్మాన్యుయేల్, అల్లు అరవింద్, బాలకృష్ణ, రాకేష్ శశి, అచ్చు రాజమణి, ధీరజ్

సినిమా ఇండస్ట్రీ ఓ కుటుంబం – బాలకృష్ణ

''సినిమా ఇండస్ట్రీ అనేది ఓ కుటుంబం. మనుషుల జీవితాల్లో సినిమా కూడా నిత్యసాధనం అయిపోయింది. ఇలాంటి సమయాల్లో ప్రేక్షకులకు మంచి సినిమాలు అందేలా దర్శక–నిర్మాతలు కృషి చేయాలి'' అన్నారు హీరో బాలకృష్ణ. అల్లు శిరీష్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా రాకేష్ శశి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ''ఊర్వశివో రాక్షసివో'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ చిత్రం నవంబరు 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలకృష్ణ ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం బిగ్ టికెట్‌ను బాలకృష్ణకు అందించారు అల్లు అరవింద్. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ–''అరవింద్‌గారి అసోసియేషన్‌తో నేను చేస్తున్న టాక్ షో 'అన్‌స్టాపబుల్'కు మంచి స్పందన లభిస్తోంది. అల్లు రామలింగయ్యగారితో వర్క్ చేసే అవకాశం దక్కడం నా అదృష్టం. 'ఊర్వశివో రాక్షసివో' సినిమా టీజర్, ట్రైలర్ బాగున్నాయి. శిరీష్, అను, దర్శకుడిగా రాకేశ్ బాగా చేశారనిపిస్తోంది. ప్రతి మనిషిలో విభిన్నకోణాలు ఉంటాయి. ప్రతి మగాడి విజయం వెనక ఓ మహిళ ఉంటుందంటారు. ఓ కుటుంబాన్ని నిలబెట్టాలన్నా, కూల్చాలన్నా ఆ తాలూకు బరువు, బాధ్యతలన్నీ మహిళల చేతుల్లోనే ఉంటాయి. కాలంతో ఇప్పుడు కొన్ని పరిస్థితులు, అభిరుచులు కూడా మారుతున్నాయి. సహజీవనం, ఎఫైర్స్ అనేవి కూడా నడుస్తున్నాయి. ప్రేక్షకుల ఆదరాభిమానాలతో 'ఊర్వశివో రాక్షసివో..' సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''శిరీష్ మిడిల్ క్లాస్ అబ్బాయిలా ఈ మూవీలో నటించాడు. ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న సమస్యల నుంచి పుట్టిన సినిమా ఇది. మంచి ఎంటర్‌టైనర్ అండ్ ఓ ఇన్‌డెప్త్ డిస్కషన్ ఈ సినిమాలో ఉంది.. దాన్ని తెరపైనే చూడాలి'' అన్నారు. ''చిరంజీవిగారి 60వ బర్త్ డే వేడుకల్లో బాలకృష్ణగారు పాల్గొన్నారు. కొంత సమయం తర్వాత ఆ ఫంక్షన్‌లో మా జోష్ తగ్గింది కానీ బాలకృష్ణగారి జోష్ తగ్గలేదు. 'కొత్తజంట', 'శ్రీరస్తు శుభమస్తు' చిత్రాల తర్వాత నాన్నగారితో ముచ్చటగా మూడోసారి నేను చేసిన ఈ చిత్రం కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు అల్లు శిరీష్. ''శిరీష్‌గారు, అను వల్ల ఈ సినిమా మేకింగ్ చాలా సాఫీగా జరిగింది'' అన్నారు రాకేష్ శశి. ఈ కార్యక్రమంలో నటుడు సునీల్, కొరియోగ్రాఫర్ విజయ్, దర్శకులు మారుతి, పరశురామ్, చందూ మొండేటి, వశిష్ఠ, వెంకటేశ్ మహా, దర్శక–నిర్మాత, రచయిత తమ్మారెడ్డి భరద్వాజ, దర్శక–నిర్మాత సాయిరాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్, 'గీతాఆర్ట్స్' బాబు, సత్య, పూర్ణా చారి, ఆదిత్య మ్యూజిక్ ప్రతినిధులు మాధవ్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకుల సమయం వృథా కాకూడదు – జైద్ ఖాన్



''ప్రేక్షకులు డబ్బు పెట్టి థియేటర్స్‌కు వస్తారు.. అయితే వారు ఖర్చుపెట్టిన డబ్బులు తిరిగి సంపాదించుకోగలరు. కానీ, సినిమా కోసం వెచ్చించిన రెండున్నర గంటలు ఎవరూ తిరిగి ఇవ్వలేరు. అందుకే ప్రేక్షకుల టైమ్ వృథా కాకుండా వారిని ఎంటర్‌టైన్ చేసేలా సినిమాలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు జైద్ ఖాన్. జయతీర్థ దర్శకత్వంలో జైద్‌ఖాన్, సోనాల్ మోంటారో జంటగా నటించిన చిత్రం 'బనారస్'. తిలకరాజ్ బల్లాల్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 4న రిలీజ్ కానుంది. తెలుగులో 'నాంది' ఫేమ్ సతీష్ వర్మ విడుదల చేస్తున్నారు. జైద్ ఖాన్ మాట్లాడుతూ– ''బనారస్' చిత్రం మిస్టీరియస్ లవ్‌స్టోరీ. 85 శాతం షూటింగ్ బనారస్‌లోనే చేశాం. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ అనేది ఇందులో చిన్న అంశం మాత్రమే. సస్పెన్స్, కామెడీ, థ్రిల్.. ఇలా ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయి. తెలుగులో చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్, ఎన్టీఆర్, రవితేజగార్లు నాకు వ్యక్తిగతంగా తెలుసు. ఎక్కువగా ప్రేమకథలు చేయాలనుకుంటున్నాను. నాలుగు కొత్త సినిమాలకు ఓకే చెప్పాను'' అన్నారు.

ఫిబ్రవరిలో విష్ణుకథ


● కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి జంటగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వినరో భాగ్యము విష్ణుకథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ పతాకంపై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. షూటింగ్ తుదిదశలో ఉన్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 17న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు మేకర్స్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.

నవ్వులే నవ్వులు


● మనో చిత్ర, అభిషేక్

అభిషేక్ వర్మ, మనో చిత్ర జంటగా పద్మమగన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రూమ్'. అశ్విన్– రమేష్.కె సమర్పణలో వీయస్. సుబ్బారావు నిర్మించిన ఈ సినిమా నవంబర్‌లో విడుదల కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్, నటుడు బెనర్జీ, నిర్మాత రామరాజ్ రిలీజ్ చేశారు. ''పద్మమగన్‌లాంటి ప్రతిభ ఉన్న దర్శకునితో 'రూమ్' తీశాం. గురజాల సుబ్బారావు సపోర్ట్‌తో తీసిన యూత్ ఫుల్ చిత్రం ఇది'' అన్నారు వీయస్ సుబ్బారావు. ''అందరికీ వినోదం పంచాలనే ఈ సినిమా తీశాం. ఈ మూవీ షూటింగ్ 60శాతం ఒకే రూమ్‌లో చేశాం'' అన్నారు పద్మమగన్. దర్శకుడు కన్మని, సహ నిర్మాత అశ్విన్, మ్యూజిక్ డైరెక్టర్ వినోద్ యాజమాన్య మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: యమ్‌యస్. ప్రభు.

మత్స్యకారుల నేపథ్యంలో...


ఆనంద్ రవి

ఆనంద్ రవి, హరీష్ ఉత్తమన్, శత్రు, కిషోరీ దత్రక్, రాజా రవీంద్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కొరమీను'. శ్రీపతి కర్రి దర్శకత్వంలో ఫుల్ బాటిల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై పెళ్లకూరు సమన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్ మోషన్ పోస్టర్‌ను హీరోయిన్ లావణ్యా త్రిపాఠి విడుదల చేశారు. ''జాలరిపేట అనే మత్స్యకారుల కాలనీ నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగుతుంది. ఓ డ్రైవర్, అహంకారంతో కూడిన, బాగా డబ్బున్న అతని యజమాని, వైజాగ్‌లో శక్తివంతమైన పోలీసు.. ఈ ముగ్గురి పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది'' అన్నారు శ్రీపతి కర్రి. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పవన్ కుమార్ జనస్వామి, కెమెరా: కార్తీక్ కొప్పెర, నేపథ్య సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని.

కథ విషయంలో రాజీ పడను – శ్రీనివాస్ రాజు




''**క**రోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచుల్లో కొత్త మార్పులు వచ్చాయి. లిప్‌లాక్ సీన్స్ ఉన్నంత మాత్రాన థియేటర్స్‌కు వస్తారనుకోవడం లేదు. సహజత్వంతో కూడిన వాస్తవిక కథలను చూసేందుకే ఇప్పుడు ప్రేక్షకులు మొగ్గు చూపుతున్నారు. వెంటవెంటనే సినిమాలు చేయాలనే తొందర నాకు లేదు.. అందుకే కథ విషయంలో నేను రాజీ పడను'' అని 'దండుపాళ్యం' ఫేమ్ దర్శకుడు శ్రీనివాస్ రాజు అన్నారు. నవీన్ చంద్ర ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'తగ్గేదే లే'. భద్ర ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ–''ప్రేమ, ప్రతీకారం మిళితమై ఉన్న కథ ఇది. స్వామిజీల ముసుగులో కొందరు చేసే అక్రమాలు, మనీ లాండరింగ్ అంశాన్ని చూపించాం. 'దండుపాళ్యం' గ్యాంగ్‌కు సంబంధించిన ఎపిసోడ్ ఈ మూవీలో కీలకంగా ఉంటుంది. మా సినిమాలోని పాత్రలు వేటికవే పోటాపోటీగా ఉంటాయి. అందుకే 'తగ్గేదే లే' అని టైటిల్ పెట్టాం. మా టైటిల్‌కు మేము ఊహించిన దానికన్నా మంచి స్పందన వచ్చింది'' అన్నారు.



టైబ్రేక్‌లో హంపి పరాజయం

మహిళల క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి పోరాటం ముగిసింది. మొనాకోలో జరుగుతున్న ఈ టోర్నీలో హంపి క్వార్టర్ ఫైనల్లో 3.5–4.5తో అనా ముజిచుక్ (ఉక్రెయిన్) చేతిలో ఓడింది. క్లాసికల్ పద్ధతిలో తొలుత నాలుగు గేమ్‌లు నిర్వహించగా ఇద్దరూ 2–2తో సమంగా నిలిచారు. విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్‌లో నాలుగు గేమ్‌లను ర్యాపిడ్ పద్ధతిలో నిర్వహించారు. తొలి మూడు గేమ్‌లు 'డ్రా'గా ముగిశాయి. నాలుగో గేమ్‌లో అనా ముజిచుక్ 17 ఎత్తుల్లో హంపిని ఓడించి సెమీఫైనల్‌కు చేరింది.

'రికార్డు' విజయంపై వెర్‌స్టాపెన్ దృష్టి



ఒకే సీజన్‌లో అత్యధికంగా 14 విజయాలు సాధించిన ఫార్ములావన్ (ఎఫ్1) డ్రైవర్‌గా రికార్డు సృష్టించేందుకు రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ మరో గెలుపు దూరంలో నిలిచాడు. సీజన్‌లోని 20వ రేసు మెక్సికో గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించాడు. షుమాకర్ (2004లో 13), వెటెల్ (2013లో 13) పేరిట ఉన్న ఈ రికార్డును సమం చేసిన వెర్‌స్టాపెన్ ఇప్పటికే డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్‌-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	3	2	0	1	5	3.850
ఇంగ్లండ్	3	1	1	1	3	0.239
ఐర్లాండ్	3	1	1	1	3	-1.169
ఆస్ట్రేలియా	3	1	1	1	3	-1.555
శ్రీలంక	3	1	2	0	2	-0.890
అఫ్గానిస్తాన్	3	0	1	2	2	-0.620

గ్రూప్‌-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
దక్షిణాఫ్రికా	3	2	0	1	5	2.772
భారత్	3	2	1	0	4	0.844
బంగ్లాదేశ్	3	2	1	0	4	-1.533
జింబాబ్వే	3	1	1	1	3	-0.050
పాకిస్తాన్	3	1	2	0	2	0.765
నెదర్లాండ్స్	3	0	3	0	0	-1.948

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X ఐర్లాండ్ (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్‌-1లో ప్రత్యక్ష ప్రసారం

దినేశ్ కార్తీక్‌కు గాయం



ప్రపంచకప్ కీలక దశలో భారత వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ గాయానికి గురయ్యాడు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో 15 ఓవర్లు ముగిసిన తర్వాత కార్తీక్ వెన్ను నొప్పితో బాధపడుతూ మైదానం వీడాడు. అతని స్థానంలో రిషభ్ పంత్ కీపింగ్ కొనసాగించాడు. గాయం తీవ్రతపై స్పష్టత లేకపోయినా బుధవారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. కార్తీక్ వెన్ను నొప్పితో బాధపడుతున్న విషయాన్ని మీడియా సమావేశం భువనేశ్వర్ కుమార్ నిర్ధారించాడు. వైద్యుల నివేదిక తర్వాత పూర్తి సమాచారం తెలుస్తుందని అతను చెప్పాడు. ప్రపంచకప్‌లో 1, 6 పరుగులు చేసి కార్తీక్‌తో నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో బ్యాటింగ్ అవకాశం రాలేదు. ఒకవేళ కార్తీక్ దూరమైనా... పంత్ రూపంలో ప్రత్యామ్నాయం అందుబాటులో ఉండటంతో ఇప్పటికిప్పుడు భారత జట్టుకు ఎలాంటి బెంగా లేకపోవచ్చు.

'బౌన్స్' ముందు బోల్తా

- పెర్త్‌లో భారత్ పరాజయం
- 5 వికెట్లతో దక్షిణాఫ్రికా గెలుపు
- ఇన్‌గిడికి 4 వికెట్లు
- సూర్యకుమార్ అర్ధసెంచరీ
- బుధవారం బంగ్లాదేశ్‌తో భారత్ తర్వాతి పోరు


ఇన్‌గిడి


కోహ్లి


పాండ్యా


రాహుల్


రోహిత్

బౌన్స్...బౌన్స్...బౌన్స్... మాకెవరికీ పడదు, మేం ఆడలేం... కానీ బౌన్స్ మాత్రం మమ్మల్ని వదల్లేదు... మా వెంట పడి మరీ వేటాడింది... పెర్త్‌లో తమ ఆట తర్వాత భారత క్రికెటర్లు మనసులో ఇలాగే అనుకొని ఉంటారు. ఊహించిన విధంగానే ఆప్టస్ స్టేడియంలో బౌన్సీ పిచ్‌పై దక్షిణాఫ్రికా పేసర్లు చెలరేగిపోయారు... అన్నీ తెలిసినా మేం మాత్రం దానికి సిద్ధంగా లేము అన్నట్లుగా భారత బ్యాటర్లు ఆడలేక వికెట్లు సమర్పించుకున్నారు. రోహిత్ శర్మ, కోహ్లి, హార్దిక్, కార్తీక్, అశ్విన్... ఐదుగురూ ఎక్కువ ఎత్తులో వచ్చిన బంతులను పుల్ షాట్ ఆడబోయి విఫలం కాగా, కేఎల్ రాహుల్ అదే తరహా అనూహ్య బౌన్స్‌కు వెనుదిరిగాడు. భారత్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 50 షార్ట్ బంతులు వేసిన ప్రత్యర్థి బౌలర్లు ఈ ఆరు వికెట్లతో పండగ చేసుకున్నారు. ఒకదశలో స్కోరు 49/5... 100 కూడా చేయడం కష్టమనిపించింది. అయితే సూర్యకుమార్ మాత్రం పిచ్‌ను పట్టించుకోను అనే రీతిలో కొన్ని చక్కటి షాట్లతో అర్ధసెంచరీ చేసి ఆదుకోవడంతో భారత్ పరువు కొంత దక్కింది. కానీ ఓటమి మాత్రం తప్పలేదు. మన పేసర్లూ మెరిసినా... 134 పరుగుల లక్ష్యం మరీ చిన్నదైపోయింది. మిల్లర్, మార్క్‌రమ్ బాధ్యతాయుత బ్యాటింగ్ సఫారీ టీమ్‌ను ఆదుకుంది. ఫలితంగా రెండు వరుస విజయాల తర్వాత రోహిత్ బృందం తొలి పరాజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. పటిష్ట జట్టుపై నెగ్గి దక్షిణాఫ్రికా గ్రూప్‌–2లో అగ్రస్థానానికి చేరింది.

పెర్త్: టి20 ప్రపంచకప్ గ్రూప్‌–2లో బలమైన ప్రత్యర్థి దక్షిణాఫ్రికా ముందు టీమిండియా తలవంచింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (40 బంతుల్లో 68; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధసెంచరీ సాధించగా, మిగతా వారంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లుంగి ఇన్‌గిడి (4/29) భారత టాపార్డర్‌ను కుప్పకూల్చగా, పార్నెల్ (3/15) కూడా రాణించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 137 పరుగులు సాధించి గెలిచింది. డేవిడ్ మిల్లర్ (46 బంతుల్లో 59 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్క్‌రమ్ (41 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలతో జట్టును గెలిపించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 60 బంతుల్లో 76 పరుగులు జోడించారు. అర్ష్‌దీప్‌కు 2 వికెట్లు దక్కాయి. భారత్ తమ తర్వాతి మ్యాచ్‌లో బుధవారం బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

టపటపా...

పెర్త్ పిచ్‌పై బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత తొలి తొమ్మిది బంతుల్లో భారత్ ఒక్క పరుగు కూడా తీయలేకపోవడం ప్రమాద హెచ్చరికను చూపించింది! గతంలో మొదటి పరుగు సాధించేందుకు భారత్ ఎప్పుడూ 10 బంతులు తీసుకోలేదు. ఇద్దరు ఓపెనర్లు రోహిత్ శర్మ (15), కేఎల్ రాహుల్ (9) సిక్సర్లతోనే తమ ఖాతాలు తెరిచినా ఆ జోరు ఎక్కువ సేపు సాగలేదు. ఇన్‌గిడి ఒకే ఓవర్లో వీరిద్దరిని వెనక్కి పంపించగా, కోహ్లి (12) అరుదైన వైఫల్యం భారత్ కష్టాలు పెంచింది. తొలి ప్రపంచకప్ మ్యాచ్ ఆడుతున్న దీపక్ హుడా (0) డకౌట్ కాగా, రబడ అద్భుత క్యాచ్‌కు హార్దిక్ పాండ్యా (2) పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత జట్టును రక్షించే బాధ్యతను సూర్యకుమార్ తీసుకున్నాడు.

ఒకే ఒక్కడు...

9 ఓవర్లలోపే భారత్ ఐదో వికెట్ కోల్పోయిన సమయంలో మరో ఎండ్‌లో ఉన్న సూర్యకుమార్ స్కోరు 7 పరుగులు. ఇలాంటి స్థితి నుంచి అతను అద్భుత బ్యాటింగ్‌తో జట్టును 100 పరుగులు దాటించడంతో పాటు కాస్త గౌరవప్రదమైన స్కోరును అందించగలిగాడు. నోర్జే 143 కిలోమీటర్ల వేగంతో వేసిన బంతిని లెగ్‌సైడ్ ఫ్లిక్‌తో సిక్సర్‌గా మలచిన తీరు సూర్య బ్యాటింగ్ ప్రత్యేకతను చూపించింది. మహరాజ్ బౌలింగ్‌లోనూ మరో సిక్సర్‌తో అతను తన ధాటిని కొనసాగించాడు. అప్పటి వరకు భారత్‌ను బెంబేలెత్తించిన ఇన్‌గిడి ఓవర్లోనే సిక్స్, ఫోర్ బాది 30 బంతుల్లోనే సూర్య హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోవడం విశేషం. దినేశ్ కార్తీక్ (6)తో ఆరో వికెట్‌కు 52 పరుగులు జోడించగా అందులో 44 సూర్యవే ఉన్నాయి. ఆ తర్వాతా మరో మూడు ఫోర్లు బాదిన తర్వాత పార్నెల్ బౌలింగ్‌లో పుల్ షాట్‌కు ప్రయత్నించి అతను వెనుదిరిగాడు.


మిల్లర్


మార్క్‌రమ్

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో దక్షిణాఫ్రికా కూడా తడబడింది. 24 పరుగులకే జట్టు 3 వికెట్లు కోల్పోయింది. పవర్‌ప్లే ముగిసేలోపే డి కాక్ (1), రోసో (0), బవుమా (10) వెనుదిరిగారు. అర్ష్‌దీప్ తన తొలి ఓవర్లోనే 2 వికెట్లు తీయగా, సఫారీ కెప్టెన్‌ను షమీ అవుట్ చేశాడు. ఇలాంటి దశలో మార్క్‌రమ్, మిల్లర్ కలిసి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ క్రమంలో జట్టుకు కొంత అదృష్టం కూడా కలిసొచ్చింది. 35 పరుగుల వద్ద మార్క్‌రమ్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను కోహ్లి వదిలేయగా... 15 పరుగుల వద్ద ఉన్న మిల్లర్‌ను దగ్గరి నుంచి అండర్‌ఆర్మ్ త్రోతో రనౌట్ చేసే అతి సునాయాస అవకాశాన్ని రోహిత్ చేజార్చాడు. 7 ఓవర్లలో 66 పరుగులు చేయాల్సి ఉండగా అశ్విన్ ఓవర్లో ఇద్దరు బ్యాటర్లు చెరో సిక్స్ బాది జట్టుపై ఒత్తిడి తగ్గించారు. తక్కువ వ్యవధిలో మార్క్‌రమ్, స్టబ్స్ (6) వెనుదిరిగినా, పట్టుదలగా చివరి వరకు నిలిచి మిల్లర్ పని పూర్తి చేశాడు. అశ్విన్ వేసిన 18వ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన అతను, భువీ వేసిన చివరి ఓవర్లో రెండు ఫోర్లతో మ్యాచ్ ముగించాడు. 10 ఓవర్లు ముగిసేసరికి 40 పరుగులే చేసిన దక్షిణాఫ్రికా ఆ తర్వాత 9.4 ఓవర్లలో 97 పరుగులు చేయడం విశేషం.

స్కోరు వివరాలు


సూర్యకుమార్

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) మార్క్‌రమ్ (బి) ఇన్‌గిడి 9; రోహిత్ (సి అండ్ బి) ఇన్‌గిడి 15; కోహ్లి (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; సూర్యకుమార్ (సి) మహరాజ్ (బి) పార్నెల్ 68; హుడా (సి) డికాక్ (బి) నోర్జే 0; హార్దిక్ (సి) రబడ (బి) ఇన్‌గిడి 2; కార్తీక్ (సి) రోసో (బి) పార్నెల్ 6; అశ్విన్ (సి) రబడ (బి) పార్నెల్ 7; భువనేశ్వర్ (నాటౌట్) 4; షమీ (రనౌట్) 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 133. వికెట్ల పతనం:** 1–23, 2–26, 3–41, 4–42, 5–49, 6–101, 7–124, 8–127, 9–130. **బౌలింగ్:** పార్నెల్ 4–1–15–3, రబడ 4–0–26–0, ఇన్‌గిడి 4–0–29–4, నోర్జే 4–0–23–1, మహరాజ్ 3–0–28–0, మార్క్‌రమ్ 1–0–5–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 1; బవుమా (సి) కార్తీక్ (బి) షమీ 10; రోసో (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (సి) సూర్య (బి) హార్దిక్ 52; మిల్లర్ (నాటౌట్) 59; స్టబ్స్ (ఎల్బీ) (బి) అశ్విన్ 6; పార్నెల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.4 ఓవర్లలో 5 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1–3, 2–3, 3–24, 4–100, 5–122. **బౌలింగ్:** భువనేశ్వర్ 3.4–0–21–0, అర్ష్‌దీప్ 4–0–25–2, షమీ 4–0–13–1, హార్దిక్ 4–0–29–1, అశ్విన్ 4–0–43–1.

'నో బాల్' డ్రామాలో బంగ్లాదేశ్ గెలుపు

3 పరుగులతో జింబాబ్వే ఓటమి



బ్రిస్బేన్: అరవై గంటల వ్యవధిలో జింబాబ్వే జట్టు దాదాపు ఒకే తరహాలో ఆనందాన్ని, బాధను అనుభవించింది! పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో చివరి బంతి వరకు పోరాడి ఒక పరుగుతో గెలిచిన జట్టు, ఆదివారం మరోసారి అలాంటి ప్రయత్నమే చేసినా చివరి బంతికి ఓటమి తప్పలేదు. ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో చివరకు బంగ్లాదేశ్ 3 పరుగుల తేడాతో జింబాబ్వేపై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. నజ్ముల్ హొస్సేన్ (55 బంతుల్లో 71; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, అఫీఫ్ హొస్సేన్ (29) రాణించాడు. ముజరబాని, ఎన్‌గరవా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులే చేయగలిగింది. సీన్ విలియమ్స్ (42 బంతుల్లో 64; 8 ఫోర్లు), ర్యాన్ బర్ల్ (27 నాటౌట్) పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. 35 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన జట్టు కోలుకోలేకపోయింది. గత మ్యాచ్ హీరో సికందర్ రజా (0) డకౌట్ కావడం కూడా జట్టును దెబ్బ తీసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తస్కీన్ అహ్మద్ (3/19) జింబాబ్వేను కట్టి పడేయగా... ముస్తఫిజుర్, మొసద్దిక్ చెరో 2 వికెట్లు తీశారు.

అసలేం జరిగిందంటే...

మ్యాచ్ ముగియక ముందే, గెలుపు ఖాయం కాకముందే సంబరాలు చేసుకోవడం... ఆపై అనూహ్యంగా ఓడిపోయి నిరాశ చెందడం బంగ్లాదేశ్‌కు కొత్త కాదు. మైదానంలో 'నాగిని డ్యాన్స్'ను ప్రదర్శించి ఓడిపోయాక వానపాముల్లా నిష్క్రమించడం కూడా గతంలో జరిగింది. ఈసారి మాత్రం కాస్త భిన్నమైన అనుభవం జట్టుకు ఎదురైంది. విజయంతో సంబరాలు చేసుకున్న తర్వాత కూడా మళ్లీ వచ్చి ఆట ఆడాల్సి వచ్చింది. చివరకు గెలుపు దక్కడమే జట్టుకు ఊరట. జింబాబ్వేతో మ్యాచ్‌లో చివరి బంతికి ఈ డ్రామా చోటు చేసుకుంది.

- ఆఖరి ఓవర్లో జింబాబ్వే విజయానికి 16 పరుగులు చేయాల్సి ఉండగా ఆఫ్‌స్పిన్నర్ మొసద్దిక్ హొస్సేన్ ఈ ఓవర్ వేశాడు.
- తొలి బంతికి లెగ్‌బై రూపంలో సింగిల్ రాగా, తర్వాతి బంతికి ఇవాన్స్ అవుటయ్యాడు.
- మూడో బంతి కూడా ఎన్‌గరవా ప్యాడ్‌ను తాకి బౌండరీ చేరింది.
- తర్వాతి బంతిని సిక్స్‌గా మలచిన ఎన్‌గరవా ఐదో బంతికి ఇలాంటి ప్రయత్నమే చేసి స్టంపౌట్ అయ్యాడు.



- చివరి బంతికి సిక్సర్ కొడితే కానీ గెలవలేని స్థితిలో జింబాబ్వే నిలిచింది. బ్యాటర్ ముజరబాని షాట్ ఆడే ప్రయత్నంలో ముందుకు రాగా, కీపర్ నూరుల్ స్టంపౌట్ చేసేశాడు. దాంతో బంగ్లా ఆటగాళ్లు విజయానందాన్ని ప్రదర్శించారు. చప్పట్లు, పరస్పర అభినందనలతో మైదానం వీడారు. ముజరబాని కూడా ప్యాడ్లు తీసేశాడు.
- అయితే అవుట్‌పై సందేహంతో థర్డ్ అంపైర్ గఫానీ రీప్లే చూసి దానిని నాటౌట్‌గా ప్రకటించడంతో పాటు ఫీల్డ్ అంపైర్ ఎరాస్మస్ 'నో బాల్' సైగ కూడా చేశాడు. అసలు ఏం జరిగిందో అర్థం కానీ బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఉసూరుమంటూ మళ్లీ ఫీల్డింగ్‌కు సిద్ధమయ్యారు.

'నో బాల్' ఎందుకంటే...

స్టంప్ చేసే క్రమంలో బంగ్లాదేశ్ కీపర్ నూరుల్ అత్యుత్సాహంతో వికెట్లను దాటి వాటి ముందే బంతిని అందుకున్నాడు. ఐసీసీ నిబంధన 27.3.1 ప్రకారం కీపర్ ఇలా చేయకూడదు. బంతి బ్యాట్‌ను లేదా బ్యాటర్‌ను తాకిన తర్వాత లేదా వికెట్లను దాటిన తర్వాతే బంతిని అందుకోవాలి. 27.3.2 ప్రకారం దానిని 'నో బాల్'గా ప్రకటిస్తారు కూడా. దాంతో మరోసారి ఆఖరి బంతికి 5 పరుగులు చేస్తే గెలిచే అవకాశం జింబాబ్వేకు వచ్చింది. అయితే మొసద్దిక్ మరో చక్కటి బంతి వేసి సింగిల్ కూడా ఇవ్వలేదు. దాంతో బంగ్లా ఆటగాళ్ల మొహాల్లో మళ్లీ నవ్వు కనిపించింది. గతంలో ఐపీఎల్‌లో కోల్‌కతా కీపర్ ఉతప్ప, రైనా మధ్య ఇదే తరహాలో ఘటన చోటు చేసుకుంది.



పాకిస్తాన్‌కు తొలి విజయం



పెర్త్: టి20 ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ పాకిస్తాన్ సమష్టిగా రాణించింది. నెదర్లాండ్స్‌తో ఆదివారం జరిగిన 'సూపర్ 12' గ్రూప్‌–2 లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఆరు వికెట్ల తేడాతో గెలిచి ఈ టోర్నీలో తొలి విజయం అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెదర్లాండ్స్‌ను పాక్ బౌలర్లు కట్టడి చేశారు. పేస్ బౌలర్లు మొహమ్మద్ వసీమ్ (2/15), షాహిన్ అఫ్రిది (1/19), నసీమ్ షా (1/11), హారిస్ రవూఫ్ (1/10, లెగ్ స్పిన్నర్ షాదాబ్ ఖాన్ (3/22) ధాటికి నెదర్లాండ్స్ పూర్తి 20 ఓవర్లు ఆడి 9 వికెట్లు కోల్పోయి కేవలం 91 పరుగులు చేయగలిగింది. నెదర్లాండ్స్ జట్టులో కొలిన్ అకెర్‌మన్ (27 బంతుల్లో 27; 2 ఫోర్లు), స్కాట్ ఎడ్వర్డ్స్ (20 బంతుల్లో 15; 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. అనంతరం పాకిస్తాన్ 13.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 95 పరుగులు సాధించి గెలిచింది. రిజ్వాన్ (39 బంతుల్లో 49; 5 ఫోర్లు), ఫఖర్ జమాన్ (16 బంతుల్లో 20; 3 ఫోర్లు) ధాటిగా ఆడారు. షాదాబ్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. పాక్ తమ తదుపరి మ్యాచ్‌లో గురువారం దక్షిణాఫ్రికాతో ఆడుతుంది.

సెమీస్ కష్టమే...

దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓటమి పాకిస్తాన్ సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసింది. ఆ జట్టు ముందంజ వేయడం దాదాపు అసాధ్యంగా మారింది. అయితే సాంకేతికంగా మాత్రం పాక్‌కు ఇంకా చాన్స్ ఉంది. పాక్ మిగిలిన రెండూ గెలిచినా గరిష్టంగా 6 పాయింట్లు సాధించగలదు. నెదర్లాండ్స్‌పై గెలిస్తే 7 పాయింట్లతో దక్షిణాఫ్రికా ముందంజ వేస్తుంది. మరోవైపు బంగ్లాదేశ్, జింబాబ్వేలపై గెలిస్తే భారత్‌కు 8 పాయింట్లు అవుతాయి. భారత్ ఒక మ్యాచ్ గెలిచి ఒకటి ఓడితే 6 పాయింట్లతో పాక్‌తో రన్‌రేట్‌లో పోటీ పడుతుంది. అయితే పాక్‌కంటే భారత్ రన్‌రేట్ ప్రస్తుతానికి ఎంతో మెరుగ్గా ఉండటంతో పాటు రోహిత్ సేన రెండూ గెలిచే అవకాశాలే పుష్కలం. గురువారం దక్షిణాఫ్రికా చేతిలో ఓడితే అక్కడే పాక్ కథ ముగుస్తుంది!

ఆధిక్యంలో హర్ష, ప్రియాంక





న్యూఢిల్లీ: ఆసియా కాంటినెంటల్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి... మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంక 4.5 పాయింట్లతో తొలి స్థానంలో ఉన్నారు. ఆదివారం జరిగిన ఐదో రౌండ్ గేముల్లో హర్ష 49 ఎత్తుల్లో కౌస్తవ్ చటర్జీ (భారత్)పై నెగ్గగా... ప్రియాంక 30 ఎత్తుల్లో సౌమ్య స్వామినాథన్ (భారత్)పై గెలిచింది. తెలంగాణకు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ తొలి ఓటమి చవిచూశాడు. సేతురామన్ (భారత్)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో రిత్విక్ 42 ఎత్తుల్లో ఓడిపోయాడు.

భారత్‌కు తొలి ఓటమి



భువనేశ్వర్: పురుషుల ప్రొ హాకీ లీగ్ 2022–2023 సీజన్‌లో భారత జట్టు తొలి ఓటమి చవిచూసింది. స్పెయిన్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 2–3 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (27వ ని.లో), అభిషేక్ (55వ ని.లో)... స్పెయిన్ తరఫున ఇగ్నాసియో (17వ ని.లో), మిరాలెస్ (27వ ని.లో), రేన్ (57వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

విజేత సాత్విక్‌–చిరాగ్ జోడీ

ఫ్రెంచ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ సొంతం



పారిస్: ఈ ఏడాది తమ అద్భుతమైన ఫామ్ కొనసాగిస్తూ సాత్విక్ సాయిరాజ్‌–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ తమ ఖాతాలో మరో డబుల్స్ టైటిల్‌ను జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్‌–750 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాత్విక్, చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. 49 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో సాత్విక్‌–చిరాగ్ ద్వయం 21–13, 21–19తో లూ చింగ్ యావో–యాంగ్ పో హాన్ (చైనీస్ తైపీ) జోడీపై నెగ్గింది. విజేతగా నిలిచిన సాత్విక్‌–చిరాగ్ జోడీకి 49,950 డాలర్ల (రూ. 41 లక్షల 10 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 11 వేల ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది సాత్విక్‌–చిరాగ్ జోడీ ఇండియా ఓపెన్ టైటిల్ తోపాటు కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది.

టైటిల్ నిలబెట్టుకున్న స్పెయిన్

నవీ ముంబై: భారత్ తొలిసారి ఆతిథ్యమిచ్చిన మహిళల అండర్‌–17 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్పెయిన్ టైటిల్ నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో స్పెయిన్ 1–0తో కొలంబియాపై గెలిచింది. ఆతిథ్య భారత్ గ్రూప్ దశలోనే నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

నందినికి స్వర్ణం

బిలాస్‌పూర్: జాతీయ ఓపెన్ అండర్‌–23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అథ్లెట్ అగసార నందిని స్వర్ణ పతకం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్ రేసును నందిని 13.73 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది.

శంకర్‌కు రజత పతకం



సాంటెండర్ (స్పెయిన్): ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్‌–19 పురుషుల సింగిల్స్ విభాగంలో భారత టీనేజర్ శంకర్ ముత్తుస్వామి రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో చెన్నైకు చెందిన 18 ఏళ్ల శంకర్ 14–21, 20–22తో కువాన్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు. 30 ఏళ్ల ఈ మెగా ఈవెంట్ చరిత్రలో రజత పతకం నెగ్గిన నాలుగో భారతీయ ప్లేయర్‌గా శంకర్ నిలిచాడు. గతంలో జూనియర్ మహిళల సింగిల్స్‌లో అపర్ణ పోపట్ (1996లో), సైనా (2006లో)... జూనియర్ పురుషుల సింగిల్స్‌లో సిరిల్ వర్మ (2015) ఫైనల్లో ఓడి రజతం సాధించారు. 2006లో రన్నరప్‌గా నిలిచిన సైనా 2008లో విజేతగా నిలువగా... గురుసాయిదత్ (2008లో), సాయిప్రణీత్, ప్రణయ్ (2010లో), సమీర్ వర్మ (2011లో), లక్ష్య సేన్ (2018లో) సెమీఫైనల్లో ఓడి కాంస్యాలు గెలిచారు.

క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో సౌరాష్ట్ర, పంజాబ్, విదర్భ జట్లు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో సౌరాష్ట్ర తొమ్మిది పరుగుల ఆధిక్యంతో కేరళపై... విదర్భ ఐదు వికెట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్‌పై... పంజాబ్ 49 పరుగుల ఆధిక్యంతో హరియాణాపై గెలిచాయి. మంగళవారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో కర్ణాటకతో పంజాబ్; ఢిల్లీతో విదర్భ; హిమాచల్‌ప్రదేశ్‌తో బెంగాల్; ముంబైతో సౌరాష్ట్ర తలపడతాయి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	203	59,960
నిఫ్టీ ▲	50	17,787

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,102	▲	310
డోజోన్స్	32,862	▲	829
ఎఫ్‌టీఎస్ఈ 100	7,048	▽	26
డాక్స్	13,243	▲	32
హాంగ్‌సెంగ్	2,916	▽	67
నికాయ్	27,105	▽	240

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.



సొంతంగా షేర్ల బదిలీ

ఆఫ్ మార్కెట్ బదిలీలకు పలు మార్గాలు • కొందరు బ్రోకర్ల వద్దే ఆన్‌లైన్ సేవలు • మిగిలిన వారి పరిధిలో భౌతిక సేవలు • సీడీఎస్ఎల్ పరిధిలో వేగం, సులభం • క్లోజర్ కమ్ ట్రాన్స్‌ఫర్ అయితే ఉచితం

బ్రోకర్ దగ్గర షేర్లు విక్రయిస్తే, ఆటోమేటిగ్గా అవి డీమ్యాట్ ఖాతా నుంచి డెబిట్ అవుతాయి. ఇందుకు ఖాతాను ప్రారంభించే సమయంలోనే అనుమతి (పవర్ ఆఫ్ అటార్నీ) తీసుకునే విధానం అమల్లో ఉంది. అయితే, కొన్ని సందర్భాల్లో బ్రోకర్ దగ్గర ఖాతా ద్వారా కాకుండా ఆఫ్‌లైన్‌లో షేర్లను విక్రయించుకోవడం లేదంటే కుటుంబ సభ్యులకు బహుమతిగా షేర్లను బదిలీ చేయాల్సి రావచ్చు. మరి అటువంటప్పుడు స్వయంగా ఎవరికి వారు ఆ బదిలీ బాధ్యతను నెరవేర్చాల్సి ఉంటుంది. దీని గురించి ఎక్కువ మందికి దాదాపుగా తెలియదు. ఒక డీమ్యాట్ ఖాతా నుంచి మరొక డీమ్యాట్ ఖాతాకు షేర్లను బదిలీ చేయడానికి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మార్గాలున్నాయి. ఇవి ఎలా పనిచేస్తాయో అవగాహన కల్పించే 'ప్రాఫిట్ ప్లస్' కథనం ఇది...

ఇదంతా డిజిటల్ యుగం. దాదాపు బ్యాంకు సేవలు, బ్రోకింగ్ సేవలను ఆన్‌లైన్‌లోనే చేసుకుంటున్నాం. అయినా కానీ, రెండు డీమ్యాట్ ఖాతాల మధ్య షేర్లను బదిలీ చేసేందుకు ఇప్పటికీ ఆఫ్‌లైన్ విధానాన్నే ఎక్కువ మంది ఆశ్రయిస్తున్నారు. నూతనతరం బ్రోకర్లు (డిపాజిటరీ పార్టిసిపెంట్) అయిన జెరోదా, ఏంజెల్ వన్ తదితర కొన్ని సంస్థలు ఆన్‌లైన్‌లోనే షేర్లను సులభంగా బదిలీ చేసుకునే సేవలను అందిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో షేర్ల బదిలీని రెండు విధాలుగా చేపట్టొచ్చు. డీమ్యాట్ ఖాతా ద్వారా లేదంటే సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (సీడీఎస్ఎల్) ఈజీఎస్ట్ కోసం నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో షేర్లను బదిలీ చేసుకోవచ్చు. ఈజీఎస్ట్‌అనేది సెక్యూరిటీల సమాచారం తెలుసుకునేందుకు, లావాదేవీలు నిర్వహించుకునేందుకు ఉద్దేశించినది. అలాగని అన్ని బ్రోకరేజీ సంస్థలు ఆన్‌లైన్‌లో బదిలీ సేవలను అందించడం లేదు. చాలా డీపీలు, బ్యాంకులకు సంబంధించిన బ్రోకింగ్ విభాగాల్లో ఖాతా ఉన్న వారు ఆఫ్‌లైన్ (భౌతిక రూపంలో) విధానంలో చేసుకోవాల్సి వస్తుంది.

ఆఫ్‌లైన్ మార్గం..

ఆఫ్‌లైన్‌లో అయితే ఫిజికల్ డెలివరీ ఇన్‌స్ట్రక్షన్ స్లిప్ (డీఐఎస్) బుక్‌లెట్ ఉండాలి. షేర్లను బదిలీ చేసుకోవాల్సి వచ్చినప్పుడు ఈ బుక్‌లెట్‌లోని ఓ స్లిప్‌పై బదిలీ చేయాలనుకుంటున్న కంపెనీ, ఐఎస్ఐఎన్ నంబర్, ఎన్ని షేర్లు తదితర వివరాలు నమోదు చేయాలి. ఏ డీపీ పరిధిలోని క్లయింట్‌కు బదిలీ చేయాలనుకుంటున్నారో, ఆ వివరాలు కూడా ఇవ్వాలి. అంటే క్లయింట్ ఐడీ, డీపీ ఐడీ వివరాలు నమోదు చేయాలి. ఐఎస్ఐఎన్ అన్నది ప్రతీ కంపెనీకి కేటాయించే ఓ యూనిక్ నంబర్. గూగుల్‌లో సెర్చ్ చేసినా ఈ నంబర్ తెలుస్తుంది. షేర్లను స్వీకరించే క్లయింట్ సీఎంఆర్ కాపీ జత చేయాలి. డీఐఎస్ అన్నది బ్యాంక్ చెక్ మాదిరిగా పనిచేస్తుంది. ఒక అకౌంట్ నుంచి మరొక అకౌంట్‌కు నగదు బదిలీకి చెక్ ఉపయోగపడినట్టే.. డీఐఎస్ అన్నది ఒక డీమ్యాట్ ఖాతా నుంచి మరొక డీమ్యాట్ ఖాతాకు షేర్లను బదిలీ చేసే సాధనం. ఆఫ్‌లైన్‌లో ఇలా షేర్ల బదిలీకి కొన్ని రోజుల సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో, కొందరు బ్రోకర్ల వద్ద ఇందుకు నెల వరకు సమయం తీసుకోవచ్చు. బ్రోకర్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ నుంచి లేదంటే బ్రోకర్‌కు ఈ మెయిల్ రూపంలో, బ్రోకర్ ఆఫీసుకు వెళ్లి డీఐఎస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాంకులకు సంబంధించిన డీమ్యాట్ ఖాతా కలిగి ఉన్న వారు నెట్ బ్యాంకింగ్ నుంచి లేదంటే బ్యాంకు శాఖకు వెళ్లి దీనికి దరఖాస్తు సమర్పించొచ్చు. రిజిస్టర్డ్ చిరునామాకు డీఐఎస్ బుక్‌లెట్ వస్తుంది. లేదా బ్రోకర్ ఆఫీసుకు వెళ్లి తీసుకోవచ్చు. బదిలీ చేయాలనుకున్నప్పుడు డీఐఎస్ స్లిప్‌లో అన్ని వివరాలు నమోదు చేసి, సీఎంఆర్ కాపీ జతచేసి బ్రోకర్ ఆఫీసులో సమర్పించాలి. లేదంటే కార్యాలయానికి పంపించాలి. బ్యాంకులు అయితే కేవలం కొన్ని శాఖల్లోనే ఈ సేవలు లభిస్తాయి.

ఆన్‌లైన్‌లో షేర్ల బదిలీ

ఆన్‌లైన్‌లో షేర్ల బదిలీకి రెండు విధానాలున్నాయి. ఒకటి డీమ్యాట్ ఖాతా ద్వారా చేసుకోవచ్చు. అలాగే, సీడీఎస్ఎల్ లేదా ఎన్ఎస్‌డీఎల్ వెబ్‌సైట్ ద్వారా బదిలీ చేసుకోవచ్చు. కొన్ని బ్రోకరేజీ సంస్థలు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ సేవను అందిస్తున్నాయి. కానీ, భద్రత రీత్యా ఈ ప్రక్రియ కొంత ఆన్‌లైన్, కొంత ఆఫ్‌లైన్‌తో కూడుకుని ఉంటుంది. ఉదాహరణకు ఐసీఐసీఐ డైరెక్ట్ ఈ ఇన్‌స్ట్రక్షన్ అన్నది కనీసం ఒక అకౌంట్ హోల్డర్ వ్యక్తిగతంగా దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కసారి రిజిస్ట్రేషన్ ఆమోదం పొందితే, ఏ డీమ్యాట్ ఖాతాకు అయినా ఆన్‌లైన్‌లోనే షేర్లను ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. కాకపోతే గరిష్ఠంగా ఐదు ఖాతాల వరకు ఆన్‌లైన్‌లో, అది కూడా నిర్ణీత విలువ మేరకే బదిలీకి అనుమతి ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. సీడీఎస్ఎల్‌లో అకౌంట్ ఉండి, బదిలీ చేయాలనుకుంటున్న ఖాతా కూడా సీడీఎస్ఎల్ పరిధిలోనే ఉన్నట్టయితే బదిలీ ప్రక్రియ మరింత సులభంగా ఉంటుంది. ఇందుకోసం సీడీఎస్ఎల్ ఈజీఎస్ట్ వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అలాగే, ఎన్ఎస్‌డీఎల్ పరిధిలోనే రెండు ఖాతాల మధ్య బదిలీకి ఎన్ఎస్‌డీఎల్ స్పీడ్-ఈ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సీడీఎస్ఎల్ పరిధిలో జాయింట్ అకౌంట్ ఉంటే, ఖాతాను నిర్వహించే వ్యక్తికి అనుకూలంగా మిగిలిన జాయింట్ అకౌంట్ హోల్డర్స్ నుంచి డిక్లరేషన్‌తో భౌతికంగా దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కసారి రిజిస్ట్రేషన్ ముగిసి, బ్రోకర్ నుంచి ఆమోదం లభించిన తర్వాత సీడీఎస్ఎల్ లేదా ఎన్ఎస్‌డీఎల్ పరిధిలో ఏ ఖాతాకు అయినా షేర్లను బదిలీ చేసుకోవడం సాధ్యపడుతుంది. సీడీఎస్ఎల్ లేదా ఎన్ఎస్‌డీఎల్ పరిధిలోని రెండు ఖాతాల మధ్య ఆన్‌లైన్లో షేర్ల బదిలీ చాలా సులభం. కాకపోతే సీడీఎస్ఎల్ - ఎన్ఎస్‌డీఎల్ పరిధిలోని ఖాతాల మధ్య బదిలీ చేసుకోవాలంటే ఓటీపీ వంటి అదనపు భద్రతా రక్షణలు అమల్లో ఉన్నాయి. మోసపూరిత లావాదేవీలకు చెక్ పెట్టేందుకు వీటిని ఏర్పాటు చేశారు. అదనపు సమయం కూడా తీసుకుంటుంది.

సొంత ఖాతాల మధ్య..

తన పేరిటే మరో ఖాతాకు షేర్లను బదిలీ చేయాలనుకుంటే అందుకు రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది క్లోజర్ కమ్ ట్రాన్స్‌ఫర్. అంటే ఒక డీపీ వద్ద డీమ్యాట్ ఖాతాను మూసేసి, మరో డీపి వద్ద ఖాతా ప్రారంభించడం. అలాంటప్పుడు క్లోజర్ కమ్ ట్రాన్స్‌ఫర్ విధానం అనుసరించాలి. ముందుగా మరో బ్రోకర్ వద్ద ఖాతాను తెరవాలి. అప్పుడు మూసి వేయాలని అనుకుంటున్న బ్రోకర్‌కు దరఖాస్తు ఇవ్వాలి. దాంతో అందులో ఉన్న అన్ని సెక్యూరిటీలను అదే క్లయింట్ వేరొక ఖాతాకు బదిలీ చేసిన తర్వాత, క్లోజ్ చేస్తారు. ఇందుకు ఎలాంటి చార్జీలు ఉండవు. ఒక బ్రోకర్ సేవలు నచ్చనప్పుడు, న్యూఏజ్ బ్రోకర్‌కు మారిపోవాలని అనుకున్నప్పుడు ఈ మార్గాన్ని అనుసరించొచ్చు. ఈ ప్రక్రియను భౌతికంగా చేసుకోవాల్సిందే. మరో విధానం పాక్షిక బదిలీ. అంటే అప్పటికే ఉన్న ఒక డీమ్యాట్ ఖాతాను కొనసాగిస్తూ, అందులోని షేర్లను మరో సొంత ఖాతాకు బదిలీ చేసుకోవడం ఈ విధానంలో ముఖ్యాంశం.

వ్యయాలు, పన్నులు

ఒక డీమ్యాట్ ఖాతాను మూసివేస్తూ, అందులోని షేర్లను అదే వ్యక్తికి సంబంధించి వేరొక డీపీ పరిధిలోని ఖాతాకు బదిలీ చేసేట్టు అయితే ఎలాంటి చార్జీల్లేవు. ఖాతా మూసివేయకుండా, వాటిని వేరొక ఖాతాకు బదిలీ చేసేట్టు అయితే షేర్ల విలువలో నిర్ణీత శాతం లేదంటే రూ.15–25 (స్క్రిప్ వారీ) ఫ్లాట్ చార్జీ పడుతుంది. ఒకవేళ ఆఫ్ మార్కెట్ విక్రయం ద్వారా బదిలీ చేస్తున్నట్టు అయితే స్టాంప్ డ్యూటీ కూడా చెల్లించాల్సి రావచ్చు. ఇలా షేర్లను బదిలీ చేస్తున్న వారు ధరసహా పలు వివరాలను నమోదు చేసుకోవాలి. ఎందుకంటే మూలధన లాభాల పన్నును చెల్లించేందుకు ఈ వివరాలు ప్రామాణికం అవుతాయి. భవిష్యత్తులో ఇలాంటి ఆఫ్ మార్కెట్ (స్టాక్ ఎక్స్ఛేంజీలతో సంబంధం లేకుండా) లావాదేవీలపై ఏదైనా పన్ను వివాదం తలెత్తినప్పుడు ఈ రికార్డులు అవసరంపడతాయి. ఒక వ్యక్తి ఒక డీపీ పరిధిలోని ఖాతా నుంచి వేరొక డీపీ పరిధిలోని ఖాతాకు షేర్లను బదిలీ చేసుకున్నప్పుడు కొందరు బ్రోకర్లు ఈ వివరాలను రికార్డు చేస్తున్నారు. అటువంటప్పుడు దీర్ఘకాల మూలధన లాభం, స్వల్పకాల మూలధన లాభం పన్ను వివరాలు సులభంగా పొందొచ్చు. కొందరు బ్రోకర్ల పరిధిలో ఈ వివరాలు నమోదవడంలేదు. కనుక ఎంత కాలం పాటు సదరు సెక్యూరిటీని కలిగి ఉన్నామనే వివరాల కోసం పాత ఖాతాకు సంబంధించి (కొనసాగిస్తున్నా లేదా మూసివేస్తున్నా కానీ) అకౌంట్ స్టేట్‌మెంట్ జాగ్రత్త చేసి పెట్టుకోవాలి. జెరోదా వంటి కొందరు బ్రోకర్లు ఆఫ్‌లైన్‌లో బదిలీ ద్వారా డీమ్యాట్ ఖాతాలోకి కొత్తగా సెక్యూరిటీలు వచ్చి చేరినప్పుడు.. మాన్యువల్‌గా వాటిని కొనుగోలు చేసిన తేదీ, ధర వివరాలు నమోదు చేసే ఆప్షన్ ఇస్తున్నాయి. ఒక వ్యక్తి వేరొక వ్యక్తికి షేర్లను బదిలీ చేస్తున్నట్టు అయితే ఆ లావాదేవీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఒకే కుటుంబం పరిధిలోని వేరొక సభ్యుడికి బదిలీ చేస్తే పన్ను లేదు. వేర్వేరు కుటుంబాల వారి మధ్య బదిలీ (ఆర్థిక సంవత్సరంలో రూ.50వేలకు మించినప్పుడు) గిఫ్ట్ ట్యాక్స్ పడుతుంది.

సీడీఎస్ఎల్ పరిధిలో ఆన్‌లైన్ బదిలీకి...

- సీడీఎస్ఎల్ పరిధిలో డీమ్యాట్ అకౌంట్ ఉన్న వారు సీడీఎస్ఎల్ ఈజీఎస్ట్ పేజీకి వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలి.
- డీపీ ఐడీ, క్లయింట్ ఐడీ నమోదు చేసి సబ్‌మిట్ కొట్టాలి.
- అప్పుడు మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని అక్కడ ఇవ్వాలి.
- యూజర్ నేమ్, టైప్ ఆఫ్ అకౌంట్ సెలక్ట్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.
- ట్రస్టెడ్ అకౌంట్ల వివరాలు ఇవ్వాలి.
- ట్రస్టెడ్ అకౌంట్ కింద 4 సీడీఎస్ఎల్ ఖాతాల వరకు వివరాలు నమోదు చేసుకోవచ్చు.
- అకౌంట్ ఆఫ్ చాయిస్ కింద సీడీఎస్ఎల్, ఎన్ఎస్‌డీఎల్ ఖాతాలకు బదిలీ చేసుకోవచ్చు.



ఆఫ్‌లైన్ బదిలీ విధానం

- బ్రోకర్ నుంచి డీఐఎస్ బుక్‌లెట్ తీసుకోవాలి.
- బదిలీ చేయాలనుకుంటే డీఐఎస్ స్లిప్‌పై అన్ని వివరాలు నమోదు చేయాలి.
- మీ నుంచి షేర్లను పొందే డీమ్యాట్ ఖాతాకు సంబంధించి క్లయింట్ మాస్టర్ రిపోర్ట్ (సీఎంఆర్) కాపీని తెప్పించుకోవాలి.
- అప్పుడు డీఐఎస్ స్లిప్‌తోపాటు, సీఎంఆర్ కాపీని బ్రోకర్‌కు సమర్పించాలి.
- బ్రోకర్ అన్ని వివరాలను వెరిఫై చేసి బదిలీ ప్రక్రియ పూర్తి చేస్తారు.
- ఏ విధానంలో అయినా షేర్లు మీ ఖాతా నుంచి బదిలీ, జమ అయిన సమయంలో సీడీఎస్ఎల్ లేదా ఎన్ఎస్‌డీఎల్ నుంచి ఎస్ఎంఎస్ వస్తుంది.

పసిడి రుణాలపై విస్తృత ప్రచారం

ముత్తూట్ ఫైనాన్స్ ప్రకటన

హైదరాబాద్: విద్యసహా పలు కుటుంబ పురోభివృద్ధి చర్యలకు, యువత ఉన్నతకి బంగారం రుణాలను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ దేశంలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దిగ్గజ గోల్డ్‌లోన్ ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీ ముత్తూట్ ఫైనాన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. 'మీ బంగారాన్ని సద్వినియోగం చేసుకోండి' (పుట్ యువర్ గోల్డ్ టు వర్క్) అనే సందేశంలో ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపింది. మూడు దశలుగా విభజించిన ఈ ప్రచారాన్ని విభిన్న మాధ్యమాలు– టీవీ, ప్రింట్, రేడియో, కేబుల్ టీవీ, మ్యాగజైన్, థియేటర్, మల్టీప్లెక్స్, ఓఓహెచ్, బీటీఎల్, ఆన్ గ్రౌండ్ యాక్టివేషన్స్, ఓటీటీ, యూట్యూబ్, సోషల్ మీడియా తదితర డిజిటల్ మార్గాల ద్వారా నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఆర్ బిజిమాన్ తెలిపారు. ఈ మేరకు విడుదల చేస్తున్న ప్రకటనల్లో సుప్రసిద్ధ భారతీయ హాస్యనటులు– బ్రహ్మానందం, జానీ ఆంటోనీ, సాధు కోకి, రెడిన్ కింగ్స్లేలు నటిస్తున్నట్లు సంస్థ తెలిపింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-10-2022	
విశాఖ	505-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	503-00
విజయవాడ	503-00
రిటైల్ ధర (డజను)	72.00
30-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

బీమా సుగమ్ బీమా రంగాన్నే మార్చేస్తుంది

ఐఆర్‌డీఏఐ చైర్మన్ దేవాశిష్ పాండా

న్యూఢిల్లీ: బీమా సుగమ్ అన్నది బీమా రంగం స్వరూపాన్నే మార్చేస్తుందని బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) చైర్మన్ దేవాశిష్ పాండా అన్నారు. బీమా పాలసీల విక్రయం, కొనుగోలు, రెన్యువల్ (పునరుద్ధరణ), క్లెయిమ్‌ల పరిష్కారం సహా అన్ని రకాల సేవలను అందించే ఏకీకృత ప్లాట్‌ఫామ్‌గా ఉంటుందన్నారు. దేశంలో బీమా వ్యాప్తి విస్తరణకు ఈ టెక్నాలజీ పోర్టల్ సాయంగా నిలుస్తుందన్నారు. కస్టమర్లకు సౌకర్యవంతమైన అనుభవాన్ని ఇస్తుందన్నారు.

యూపీఐ విప్లవం వంటిది...

బీమా రంగానికి బీమా సుగమ్ అన్నది యూపీఐ విప్లవం వంటిదని వ్యాఖ్యానించారు. బీమా కంపెనీలు ఈ ప్లాట్‌ఫామ్‌లో భాగం కావాలని పిలుపునిచ్చారు. బీమా ఏజెంట్లు, వెబ్ అగ్రిగేటర్లు సహా అన్ని రకాల మధ్యవర్తులకూ ఈ పోర్టల్ యాక్సెస్ ఉంటుందని చెప్పారు. పాలసీదారులు ఈ పోర్టల్ నుంచి నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేసుకోవచ్చన్నారు. బీమాకు సంబంధించి దీన్నొక షాపింగ్ మాల్‌గా పాండా అభివర్ణించారు.



ద్రవ్యోల్బణంపై కేంద్రానికి ఆర్‌బీఐ నివేదిక!

నవంబర్ 3న కీలక భేటీ

ముంబై: రిటైల్ ద్రవ్యోల్బణం కట్టడి విషయంలో 2022 జనవరి నుంచి విఫలం అవడానికి కారణాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నవంబర్ 3వ తేదీన కసరత్తు జరపనుంది. ఇందుకు సంబంధించి ఆర్‌బీఐ యాక్ట్ 45జెఎన్ సెక్షన్ కింద కేంద్రానికి నివేదిక సమర్పించనుంది. 2016లో ఎంపీసీ ఏర్పాటు తర్వాత ఈ తరహా వివరణను కేంద్రానికి ఆర్‌బీఐ సమర్పించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ప్రకారం, ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం లోపు ఉండాలి. అయితే గడచిన మూడు త్రైమాసికాల్లో ఇది ఆ స్థాయి పైనే కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది.

అంతర్జాతీయ ఫండ్స్ ఎంపిక ఎలా?

నేను కొత్తగా ఫండ్స్‌లో పెట్టుబడులు ఆరంభించాను. యూఎస్ లేదా గ్లోబల్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. మరి ఇందుకోసం ఫండ్స్ ఎంపిక విషయంలో ఎటువంటి విధానాన్ని అనుసరించాలి? వాటిల్లో ఎంత మేర ఇన్వెస్ట్ చేయాలి?

– వరుణ్ శర్మ

దేశం వెలుపలి ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే పథకాలను ఇంటర్నేషనల్ ఫండ్స్ అని పిలుస్తారు. భారతీయులకు దేశంలో ఉన్నత విద్య చదవాలనుకునే పిల్లలు ఉండొచ్చు. అటువంటి వారు విదేశీ కరెన్సీలో అయ్యే వ్యయాలకు ముందు నుంచే ఈ రూపంలో ప్రణాళిక రూపొందించుకోవచ్చు. పిల్లలు స్కూల్‌లో చేరినప్పటి నుంచి వారి భవిష్యత్ విదేశీ విద్య కోసం ఇంటర్నేషనల్ ఫండ్స్ వైపు చూడొచ్చు. దేశీ ఫండ్స్ మంచి రాబడులను ఇస్తున్నప్పటికీ.. మంచి రాబడినిచ్చే అంతర్జాతీయ పథకాలను కూడా పరిశీలించొచ్చు. ఈ పథకాల ఎంపికకు చూడాల్సిన అంశాలను గమనిస్తే..

వివిధ రంగాలు, కంపెనీల్లో పెట్టుబడుల వైవిధ్యంతో ఉన్న ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. మనం భారత్‌లో నివసిస్తున్నప్పుడు, మన ఆదాయం, వ్యయాలు, ఆస్తులన్నీ ఇక్కడే ఉంటాయి. అంతర్జాతీయ పెట్టుబడులు అన్నవి మన మార్కెట్‌తో సంబంధం కలిగి ఉండవు. కాకపోతే ఈ మార్గం ద్వారా తగినంత వైవిధ్యాన్ని పాటించొచ్చు. దేశీయ మార్కెట్లో పెట్టుబడులపై ప్రభావాల నుంచి, ఈ రకమైన పెట్టుబడులతో కొంత రక్షణ ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే, కేవలం ఒకే రంగంలో పెట్టుబడులు పెట్టే ఇంటర్నేషనల్ ఫండ్స్ దూరంగా ఉండాలి. ఇంటర్నేషనల్ ఫండ్స్ థీమ్యాటిక్ ఫండ్ లేదా కమోడిటీ ఫండ్ లేదా ఓ దేశానికే సంబంధించి పెట్టుబడులతో కూడిన పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ విధమైన సంకుచిత పెట్టుబడుల విధానం అస్థిరతలతో కూడుకుని ఉంటుంది. అప్పటి వరకు సానుకూలంగా ఉన్న రాబడులు ప్రతికూలంగా మారిపోవచ్చు. అందుకని వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతో ఉన్న పథకాలను ఎంపిక చేసుకోవాలి.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

అంతర్జాతీయ ఫండ్స్‌లో పెట్టుబడుల వల్ల కలిగే ప్రయోజనాల్లో ఒకటి మారకం విలువ. అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్లో ముఖ్యంగా డాలర్ ఏటేటా బలపడుతోంది. 2017లో యూఎస్ డాలర్ రూపాయితో 65 దగ్గర ఉంటే, ఇప్పుడు 82కు చేరింది. ఐదేళ్లలో ఏటా 4 శాతానికి పైనే డాలర్ బలపడింది. ఈ విధమైన కరెన్సీ విలువ ప్రయోజనానికి అదనంగా, పథకంలో పెట్టుబడులపై ప్రతిఫలంతో మెరుగైన రాబడి అందుకోవచ్చు. డాలర్ మారకంతో కూడిన ఇంటర్నేషనల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా క్షీణించే రూపాయి విలువ పరంగా రక్షణ ఉంటుంది. అలాగే, ఈక్విటీ పథకాల మాదిరే ఇంటర్నేషనల్ ఫండ్స్‌లోనూ దీర్ఘకాలం దృష్టితోనే పెట్టుబడులు పెట్టాలి. లేదంటే ఆశించిన రాబడులు రాకపోవచ్చు. ఇంటర్నేషనల్ ఫండ్స్‌ను మన ఆదాయ పన్ను చట్టం నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తుంది. ఇండెక్సేషన్ ప్రయోజనం పొందాలంటే మూడేళ్లకు పైగా కలిగి ఉండాలి. ముఖ్యంగా ఇంటర్నేషనల్ పథకాల్లోకి గత ఏడాది, మూడేళ్ల కాల పనితీరు చూసి పెట్టుబడులు పెట్టకూడదు.

నేను మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్‌లో 1994లో పెట్టుబడులు పెట్టాను. ఇందుకు సంబంధించి నా వద్ద భౌతిక పత్రాలు ఉన్నాయి. ఈ పెట్టుబడిని ఎలా వెనక్కి తీసుకోవాలో సూచించగలరు?

– పేరు రాయలేదు

2014లో మోర్గాన్ స్టాన్లీ భారత్ నుంచి వెళ్లిపోయింది. ఈ వ్యాపారాన్ని హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. మోర్గాన్ స్టాన్లీకి సంబంధించి ఎనిమిది పథకాలు హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కిందకు వచ్చేశాయి. మోర్గాన్ స్టాన్లీ గ్రోత్ ఫండ్ హెచ్‌డీఎఫ్‌సీ లార్జ్‌క్యాప్ ఫండ్ కిందకు మారిపోయింది. 2009 వరకు క్లోజ్ ఎండ్ ఫండ్‌గా ఉన్న ఇది 15 ఏళ్ల లాకిన్ కాల వ్యవధి ముగియడంతో, ఓపెన్ ఎండెడ్ పథకంగా మారింది. మోర్గాన్‌స్టాన్లీ గ్రోత్ ఫండ్‌లో ఉన్న యూనిట్లను విక్రయించాలంటే మీ దగ్గరున్న ఆధారాలతో హెచ్‌డీఎఫ్‌సీ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని సంప్రదించాలి. పెట్టుబడులు వెనక్కి తీసుకునేందుకు కావాల్సిన సహకారాన్ని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ సిబ్బంది అందిస్తారు.

షీడర్ ఎలక్ట్రిక్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 176 **టార్గెట్:** రూ. 236

ఎందుకంటే: విద్యుత్ రంగ పరికరాల దిగ్గజం ష్నీడర్ ఎలక్ట్రిక్ వృద్ధికి కీలకమైన విభాగాల భవిష్యత్‌పై ఆశావహ అంచనాలున్నాయి. దేశీయంగా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలలో ఒకటైన విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి కొనసాగనుంది. డిజిటలైజేషన్ తదితర పలు సంస్కరణలకు ప్రభుత్వం తెరతీస్తోంది. తద్వారా దీర్ఘకాలంలో విద్యుత్ పంపిణీ, ప్రయివేటైజేషన్ తదితర అంశాలలోనూ పలు సంస్కరణలను అమలు చేసే అవకాశముంది. రానున్న కొన్నేళ్లలో వీటి అమలు ఊపందుకోనుంది. దీర్ఘకాలానికి పంపిణీ స్థాయిలోనూ ప్రాధాన్యత పెరగనుంది. ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన విభాగంలో భారీ లక్ష్యాలు విధించుకుంది. దీంతో ప్రయివేటైజేషన్, పునరుత్పాదక ఇంధనాలవైపు మరింత మొగ్గు చూపడానికి వీలుంది. ఇక రవాణా రంగమూ కీలకంకానుంది. దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న మెట్రో రైల్ వ్యవస్థలు, రైల్వేల ఆధునీకరణ, విద్యుదీకరణ, ఆధునిక విమానాశ్రయాల నిర్మాణం వంటివి భారీ అవకాశాలను కల్పించనున్నాయి. ఇవన్నీ మరింత విస్తరణకు దారి చూపనున్నాయి. చమురు, గ్యాస్ రంగాలలోనూ పలు మార్పులకు వీలుంది. పునరుత్పాదక ఇంధనాలకు పెరుగుతున్న డిమాండ్ దీనికి కారణంకానుంది. మరోపక్క కొంతకాలంగా కొనసాగిన అనిశ్చితిని వీడుతూ తొలిసారి ఒక ఏడాదిలో రూ. 1,500 కోట్ల ఎగ్జిక్యూషన్ విలువను సాధించింది. దీంతో గత ఆర్థిక సంవత్సరం(2021-22)తోపాటు ఈ ఏడాది(2022-23) తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో కంపెనీ పటిష్ట ఫలితాలు సాధించగలిగింది. ఫలితంగా దశాబ్ద కాలం తదుపరి మళ్లీ టర్న్ అరౌండ్‌ను సాధించింది. ఈ బాటలో నగదు సాధన, మార్జిన్ల పెంపుపై దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది.



జీఈ టీఅండ్‌డీ ఇండియా | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 128 **టార్గెట్:** రూ. 153

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో విద్యుత్ రంగ దిగ్గజం జీఈ టీఅండ్‌డీ ఆదాయం 7 శాతం క్షీణించి రూ. 590 కోట్లకు పరిమితమైంది. మందగమన ఆర్డర్‌బుక్ కారణంగా ఎగ్జిక్యూషన్ నీరసించింది. ఇది క్యూ1 పనితీరును ప్రభావితం చేసింది. అయితే స్థూల మార్జిన్లు 2.2 శాతం బలపడ్డాయి. కమోడిటీ ధరలు క్షీణించడం ఇందుకు దోహదపడింది. ఫిక్స్‌డ్ వ్యయాలు తగ్గడం దీనికి జత కలవడంతో నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 1.4 కోట్ల నుంచి రూ. 22.4 కోట్లకు ఎగసింది. కాగా.. నికర రుణ భారం రూ. 110 కోట్ల నుంచి రూ. 190 కోట్లకు పెరిగింది. తదుపరి త్రైమాసికాలలో చేపట్టవలసిన కాంట్రాక్టుల పూర్తికి అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు పెరగడం ప్రభావం చూపింది. ఇదే కాలంలో ఆర్డర్లు 27 శాతం జంప్ చేసి రూ. 600 కోట్లకు చేరాయి. కేంద్ర విద్యుత్ అధీకృత సంస్థ(సీఈఏ) అనుమతించిన టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్(టీబీసీబీ) టెండర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంలో ఆలస్యం ఆర్డర్లలో వృద్ధిని దెబ్బతీస్తోంది. అయినప్పటికీ ప్రస్తుత మొత్తం ఆర్డర్ బుక్ విలువ రూ. 3,660 కోట్లను తాకింది. మధ్య, దీర్ఘకాలానికి మరిన్ని కాంట్రాక్టులు లభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. రానున్న 24-30 నెలల కాలంలో టీబీసీబీ, నియంత్రిత టారిఫ్ మెకనిజం (ఆర్‌టీఎం) విధానాలలో రూ. 70,000 కోట్ల విలువైన ఆర్డర్లను ప్రభుత్వం విడుదల చేసే అవకాశముంది. ఇవి కంపెనీకి అదనపు లబ్ధిని చేకూర్చనున్నాయి. ఇందుకు లే-లడఖ్ లైన్ తదితర గ్రీన్ ఎనర్జీ కారిడార్ కారణంకానుంది. వెరసి స్థూల మార్జిన్లు మరింత మెరుగుపడవచ్చని అంచనా. భవిష్యత్‌లో ఎగ్జిక్యూషన్ సైతం పుంజుకునే వీలుంది.



గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

క్లుప్తంగా

నేటి నుంచి షార్జా-విజయవాడ విమాన సర్వీస్

విమానాశ్రయం (గన్నవరం): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షార్జా నుంచి విజయవాడ (గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ సోమవారం నుంచి విమాన సర్వీస్‌ను ప్రారంభించనుంది. వారంలో రెండు రోజులపాటు ఈ విమాన సర్వీస్‌ను నడపనుంది. ప్రతి సోమ, శనివారాల్లో 186 మంది ప్రయాణికుల సామర్థ్యంగల బోయింగ్ 737-800 విమానం భారతీయ కాలమానం ప్రకారం షార్జా నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.55 గంటలకు గన్నవరం చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 6.35 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి రాత్రి 10.35 గంటలకు షార్జా చేరుకుంటుంది. విజయవాడ నుంచి షార్జాకు టిక్కెట్ ధర రూ.13,699. షార్జా, దుబాయ్, అబుదాబీ, రసల్‌ఖైమా నుంచి ఇక్కడికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ విమాన సర్వీస్ ఉపయోగకరంగా ఉంటుంది.

నాటిక కోసం సాధన చేస్తూ 'ఉరి'పోసుకున్నాడు..

- ప్రాణాలు విడిచిన బాలుడు



సంజయ్‌గౌడ

యశవంతపుర: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ నాటకంలో కథానాయకుడి పాత్ర పోషించి రక్తికట్టించాలన్న ఆరాటం ఓ బాలుడి ప్రాణం తీసింది. భగత్‌సింగ్ ఉరికి వేలాడే సన్నివేశాన్ని తెలిసీ తెలియని బాలుడు ఇంట్లో సాధనచేస్తూ ఉరికి చిక్కుకున్నాడు. శనివారం రాత్రి కర్ణాటక చిత్రదుర్గ పట్టణంలో జరిగిన ఈ ఘటన విషాదాన్ని నింపింది. నవంబర్ ఒకటో తేదీన కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం జరగనుంది. ఇందుకోసం నాగరాజు, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు సంజయ్‌గౌడ(12) పాఠశాలలో జరిగే నాటికలో భగత్‌సింగ్ పాత్రకు ఎంపికయ్యాడు. ఇతడు ఎస్ఎల్‌వీ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు తాడు కట్టి స్టూల్‌పై నిలబడి, ముఖానికి ముసుగు వేసుకుని ఉరి సీన్‌ను అభ్యాసం చేస్తుండగా స్టూల్ జారిపోవడంతో ఉరి మెడకు బిగుసుకుని బాలుడు మరణించాడు. చిత్రదుర్గ బడావణె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'వైద్య విద్య' వెబ్ ఆప్షన్‌ల నమోదుకు నేడు ఆఖరు

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో రాష్ట్ర కోటా సీట్లలో నాన్ సర్వీస్ అభ్యర్థుల ప్రవేశాల నిమిత్తం రెండో దశ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌ల నమోదు చేయడానికి సోమవారం సాయంత్రం ఏడు గంటల వరకూ అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు http:// pgcq.ntruhsadmissions.com/ వెబ్‌సైట్ ద్వారా ఆప్షన్‌లు నమోదు చేసుకోవచ్చు.

కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా 'వేదాంతం'



కూచిపూడి (పామర్రు): కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని కూచిపూడిలోని శ్రీసిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం ప్రధానాచార్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి నియమితులయ్యారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని సంగీత నాటక అకాడమీ కార్యదర్శి అమ్రేష్ పీ రాజన్ ఉత్తర్వులు జారీచేశారు. ఐదేళ్ల పాటు ఈ పదవిలో తాను కొనసాగుతానని రామలింగశాస్త్రి ఆదివారం కూచిపూడిలో విలేకరులకు తెలిపారు. ఆయన్ని నాట్యకళాపీఠం ఉప ప్రధానాచార్యుడు రవిబాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు.

న్యాయవాది ఘటనపై సమగ్ర దర్యాప్తు

సాక్షి, నరసరావుపేట: న్యాయవాది షేక్ బిలాల్ అహ్మద్ ఘటనపై సమగ్ర దర్యాప్తునకు పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. దర్యాప్తు అధికారిగా జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) బిందుమాధవ్‌ను నియమిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శావల్యాపురం ఎస్సైని వీఆర్‌కి పంపారు. శావల్యాపురం మండలం గంటవారిపాలెంలో మూడ్రోజుల క్రితం హైకోర్టు లాయర్ బిలాల్ అహ్మద్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు.. బిలాల్ అహ్మద్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే అతన్ని అరెస్టుచేయాలని ఆదివారం గంటవారిపాలెం-గుంటూరు హైవేపై బాధితురాలి కుటుంబసభ్యులు, స్థానికులు రాస్తారోకో చేశారు. పోలీసులు తనను కొట్టారని బిలాల్ అహ్మద్ హైకోర్టు న్యాయవాదుల సంఘానికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ ఘటన గురించి అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ పల్నాడు ఎస్పీని ఆరా తీశారు.

'ఏఐ' సేవలు ఎన్నో

దైనందిన జీవితంలో కీలకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- మన ఆదేశాలకు ప్రతిస్పందించే ఉపకరణాల రాక
- స్మార్ట్ సిటీ, స్మార్ట్ హోం, స్మార్ట్ ఇండస్ట్రీ సాకారానికి ఏఐ దన్ను

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)



సమాచార సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కడంతో మనిషి జీవితంలో ఊహించని మార్పులు వస్తున్నాయి. ఇన్నాళ్లూ మనకు అందని చందమామలు నట్టింట దిగుతున్నాయి. చక్రం కనిపెట్టడంతో జీవన గమనంలో పెరిగిన వేగం పారిశ్రామిక విప్లవంతో ఎన్నో సౌకర్యాలను అందించింది. ఊహల్లో మాత్రమే సాధ్యమయ్యే అంశాలు ఇప్పుడు మనిషికి చిటికెలో అమరుతున్నాయి. మన రోజువారీ జీవితాన్ని మలుపు తిప్పుతున్న సరికొత్త పరిజ్ఞానం 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'(ఐవోటీ) కాగా దానికి దన్నుగా నిలుస్తున్న శక్తి 'కృత్రిమ మేధ'(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్). మన ఫిట్‌నెస్ స్థాయిని చూపించడం మొదలు పరిశ్రమల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని తారస్థాయికి తీసుకెళ్లడం వరకు ఏఐ, ఐవోటీ మేలు కలయికతో మన కళ్లెదుటే ఆవిష్కృతమవుతున్నాయి. అద్భుత భవిష్యత్తుకు బాట ఎంతోదూరంలో లేదని అర్థమవుతోంది. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 5 వేల కోట్ల ఉపకరణాలు(డివైస్) ఇంటర్‌నెట్‌కు అనుసంధానమై ఉంటాయని అంచనా. ఇవి మన ఆన్‌లైన్ కార్యకలాపాలను సేకరించడం, సమాచారం పరస్పరం మార్చుకోవడం, ఏఐ ద్వారా ఇచ్చే కమాండ్స్‌ను ప్రాసెస్ చేస్తాయి. ఇంటర్‌నెట్ అనుసంధానానికి శక్తిని, యుక్తిని ఏఐ అందిస్తోంది.

1 వేరియబుల్స్ (ధరించే ఉపకరణాలు)



స్మార్ట్‌వాచ్ లాంటి వేరియబుల్స్ నిరంతరాయంగా మనిషి ఆరోగ్యానికి సంబంధించిన అంశాలను ట్రాక్ చేయగలవు. హార్ట్‌బీట్, ఆక్సిజన్ లెవల్, వేస్తున్న అడుగులు, ఖర్చవుతున్న శక్తి, నిద్రలో నాణ్యత.. ఇవన్నీ రికార్డు చేయగలవు. మధుమేహాన్ని కచ్చితంగా అంచనా వేసే డివైస్‌లు ఇప్పుడు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. గంట గంటకూ షుగర్ లెవల్‌ను రికార్డు చేస్తున్నాయి. వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ఇది దోహదం చేస్తోంది. మన ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు వ్యక్తిగత వైద్యులకు చేరవేయడంతో పాటు స్ట్రోక్ లాంటి ప్రమాదాలను ముందుగా హెచ్చరించే పరిజ్ఞానం త్వరలో సాకారం కానుంది. స్పోర్ట్స్, ఫిట్‌నెస్‌కు కూడా ఈ డేటా ఉపయోగపడుతుంది. టెక్నాలజీ రీసెర్చ్ సంస్థ 'గాట్నర్' అంచనా ప్రకారం ప్రపంచ వేరియబుల్ డివైస్ మార్కెట్ వచ్చే రెండేళ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరుతుంది.

2 స్మార్ట్ హోమ్



మనం ఇచ్చే వాయిస్ కమాండ్‌కు ఇంట్లో వస్తువులు ప్రతిస్పందించడం గతంలో సైన్స్ ఫిక్షన్‌కు పరిమితం. ఇప్పుడది వాస్తవం. ఇంటి యజమాని అవసరాలు, అలవాట్లను గుర్తెరిగి ప్రవర్తించే డివైస్‌లతో ఇంటిని నింపేయడం సమీప భవిష్యత్‌లో సాకారమయ్యే విషయమే. 'అలెక్సా' ఇప్పటికే మన నట్టింట్లోకి వచ్చేసి వాయిస్ కమాండ్‌కు ప్రతిస్పందిస్తుంది. మనుషుల వ్యక్తిగత రక్షణ, ఇంటి భద్రతకు హెచ్చరికలను సంబంధిత వ్యవస్థలు /వ్యక్తులకు చేరవేసే టెక్నాలజీ కూడా రానుంది. స్మార్ట్‌హోమ్ గ్లోబల్ మార్కెట్ వచ్చే రెండేళ్లలో 300 బిలియన్ డాలర్లకు చేరుతుందని 'గాట్నర్' అంచనా.

3 స్మార్ట్ సిటీ



ఇది పట్టణీకరణ యుగం. నగరాలకు వలసలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. పట్టణాల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ఇంధన సామర్థ్యం వృద్ధి.. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాల ముందున్న సవాళ్లు. ఢిల్లీలో ట్రాఫిక్ మెరుగైన నియంత్రణకు 'ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం' ద్వారా రియల్‌టైమ్‌లో నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నారు. ఇందులో వాడుతున్నది కృత్రిమ మేధస్సే.

కృత్రిమ మేధతో సాకారమయ్యేవి



కేటగిరీ	ప్రస్తుతం	భవిష్యత్
1. ఎడ్జ్ కంప్యూటింగ్	థర్మోస్టాట్స్ స్మార్ట్ అప్లయన్సెస్	హోమ్ రోబోట్స్ స్వతంత్ర వాహనాలు
2. వాయిస్ ఏఐ	స్మార్ట్ స్పీకర్స్	ఈ-పేమెంట్ వాయిస్ అథెంటికేషన్
3. విజన్ ఏఐ	వస్తువుల గుర్తింపు	వీడియో విశ్లేషణ

4 స్మార్ట్ ఇండస్ట్రీ



మాన్యుఫ్యాక్చరింగ్ నుంచి మైనింగ్ వరకు.. ప్రతి పరిశ్రమలో సామర్థ్యాన్ని గరిష్ట స్థాయికి పెంచడానికి, మానవ తప్పిదాలను పూర్తిగా నివారించడానికి ఏఐ ఉపయోగపడుతుంది. పరిశ్రమల్లో డిజిటల్ రూపాంతరీకరణ ఇప్పటికే మొదలైంది. వచ్చే రెండు మూడేళ్లలో 80 శాతం పరిశ్రమల్లో ఏఐ వినియోగం మొదలవుతుందని అంచనా. రియల్ టైమ్ డేటా విశ్లేషణ నుంచి సప్లైచైన్ సెన్సార్ల వరకు పారిశ్రామిక రంగంలో 'ఖరీదైన తప్పుల'ను నివారించడానికి ఏఐ దోహదం చేస్తుంది.

5 రవాణా



డ్రైవర్ అవసరం లేని వాహనాల రూపకల్పనకు పునాది వేసింది కృత్రిమ మేధ. మనిషి తరహాలో ఆలోచనను ప్రాసెస్ చేసి నిర్ణయం తీసుకోవడం ద్వారా మనం చేస్తున్న పనులను ఏఐ ద్వారా ఉపకరణాలు చేసేస్తున్నాయి. అటానమస్ వాహనాలు మాత్రమే రోడ్డు మీద కనిపించే రోజు సమీప భవిష్యత్‌లో ఉంది.

వణుకుతున్న మన్యం

మినుములూరులో 12, చింతపల్లిలో 13, అరకులోయలో 13.2 డిగ్రీల ఉష్ణోగ్రత

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు వణికిస్తున్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిపులితో స్థానికులు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాడేరు మండలంలోని మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో ఆదివారం తెల్లవారుజామున 12 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 13 డిగ్రీలు, పర్యాటక ప్రాంతం అరకులోయలోని కేంద్ర కాఫీబోర్డులో 13.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో శనివారం కన్నా ఆదివారానికి ఉష్ణోగ్రతలు తగ్గి, చలిగాలులు మరింత పెరిగాయి. అత్యంత శీతల ప్రాంతాలుగా గుర్తింపు పొందిన అరకులోయ ఘాట్‌లోని సుంకరమెట్ట, పాడేరు ఘాట్‌లోని పోతురాజుస్వామిగుడి ప్రాంతంలోని కాఫీతోటలు, చింతపల్లి మండలంలోని లంబసింగి, కొర్రుబయలు, జీకే వీధి మండలంలోని ఆర్వీనగర్ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింత దిగజారే పరిస్థితులు నెలకొన్నాయి. అర్ధరాత్రి నుంచి పొగమంచు కురుస్తోంది. వాహన చోదకులు లైట్లు వేసుకుని వాహనాలను నడిపారు. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడలేదు.


అరకులో ఆదివారం ఉదయం 8 గంటలకు పొగమంచులో లైట్లు వేసుకుని వాహనాల ప్రయాణం

ఫార్మేటివ్, సమ్మేటివ్‌తో పాటే సీబీఏ పరీక్షలు

- వెల్లడించిన పాఠశాల విద్యాశాఖ
- విధివిధానాల ప్రకటన



సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఫార్మేటివ్, సమ్మేటివ్‌తో పాటు సీబీఏ (క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్) పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల్లోనే కొన్ని సీబీఏ పరీక్షలు ఉంటాయని పేర్కొంది. సీబీఏ పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో అనుసరించే విధి విధానాలను కూడా ప్రకటించింది.

మూడు పరీక్షలు సీబీఏ విధానంలో..

ఈ ఏడాది కొత్తగా రెండు నిర్మాణాత్మక, ఒక సంగ్రహణాత్మక పరీక్షలను సీబీఏ పరీక్షలుగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. మిగిలిన రెండు నిర్మాణాత్మక, ఒక సంగ్రహణాత్మక పరీక్షలను పాత పద్ధతిలో నిర్వహిస్తుంది. ఈ పరీక్షలకు అవసరమయ్యే ముద్రణ, ప్యాకింగ్, రవాణా, జీఎస్టీ ఖర్చులు కలుపుకుని పేజీకి నిర్ణీత మొత్తంగా నిర్ణయిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ ఖర్చును సమగ్ర శిక్ష ద్వారా జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డులకు ప్రభుత్వం అందిస్తుంది. వారి స్థాయిలో ముద్రణ వ్యవహారాలు నిర్ణయిస్తారు. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ ప్రశ్నాపత్రాలు విద్యార్థుల్లోని ఉన్నత స్థాయి నైపుణ్యాలను వెలికితీసేలా ఉంటాయి. కనుక ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా లబ్ధి పొందేలా ప్రభుత్వం వారికి కూడా ఈ ప్రశ్నాపత్రాలు అందించాలని నిర్ణయించింది. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ నిర్మాణాత్మక పరీక్షల ప్రశ్నాపత్రం సుమారు 10 నుంచి 20 పేజీల వరకు ఉండవచ్చు. కనుక 6 సబ్జెక్టులకు అన్ని పరీక్షలకు కలిపి వారి జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డుల నిర్ణయం మేరకు పేపర్ ధర, ముద్రణ, ప్యాకింగ్, రవాణా, జీఎస్టీ ఖర్చులు నిర్ధారించి వసూలు చేస్తారు.

ప్రైవేట్ పాఠశాలలకు ఓఎమ్మార్ ఇవ్వరు

సాల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉత్తమమైన అసెస్మెంట్‌లు అందించడం, వాటి విశ్లేషణ చేయడం, రేమిడియల్ బోధనకు సహకారం అందించేందుకు ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అందువల్ల ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డులు ఓఎమ్మార్ షీట్లను అందించడం లేదు.

అసాంఘిక శక్తులకు అభినందనలా?

- పవన్‌కళ్యాణ్‌పై మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం
- అమరావతి కుల రాజధాని అని 2019లో విమర్శించలేదా?



సాక్షి, అమరావతి: విశాఖ విమానాశ్రయంలో మంత్రులపై దాడికి పాల్పడి విధ్వంసం సృష్టించిన అసాంఘిక శక్తులు, రౌడీలను జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అభినందించడం దిగజారుడుతనానికి పరాకాష్టగా మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అభివర్ణించారు. దళిత మంత్రి మేరుగు నాగార్జునపై చెప్పులు విసరడంతోపాటు మహిళా మంత్రులు ఆర్కే రోజా, విడదల రజినిలను బూతులు తిడుతూ అరాచకం సృష్టించిన వారిని అభినందించేందుకు జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారన్నారు. చంద్రబాబు రాజకీయ అవసరాల కోసం కాకుండా జనం కోసం పనిచేస్తే జనసేన కార్యకర్తలైనా సంతోషిస్తారని సూచించారు. ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఖండిస్తే ఎంత హుందాగా ఉండేది?

ప్రజల అవసరాల కోసం పని చేయడంపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు రాజకీయ పార్టీలు సమావేశాలను నిర్వహిస్తాయి. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ తీర్మానాలను చూస్తుంటే నవ్వొస్తోంది. మంత్రులపై దాడికి పాల్పడ్డ రౌడీలను అభినందిస్తూ ఒక తీర్మానం, వారికి అండగా నిలిచిన పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలుపుతూ మరో తీర్మానం, ఆయనకు సంఘీభావం తెలిపిన వివిధ పార్టీల నేతలకు ధన్యవాదాలు తెలియచేస్తూ మరో తీర్మానం చేయడం హాస్యాస్పదం. ఢిల్లీ నుంచి తనకు ఎప్పటికప్పుడు రహస్య సమాచారం వస్తుందని, ఆరేళ్లు హైసెక్యూరిటీ జోన్‌లో రాజకీయాలు చేశానని చెప్పుకునే నాదెండ్ల మనోహర్‌కు విశాఖలో పోలీసు చట్టం సెక్షన్ 30 అమల్లో ఉందని తెలియదా? విశాఖ గర్జన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు దత్త పుత్రరత్నం పవన్ అదే రోజు జనవాణి పేరుతో అక్కడికి వెళ్లడం వాస్తవం కాదా? గర్జనలో పాల్గొని తిరిగి వెళ్లడానికి విమానాశ్రయానికి చేరుకున్న మంత్రులపై జనసేన కార్యకర్తలతో దాడులు చేయించింది వాస్తవం కాదా? అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహణతో ట్రాఫిక్ స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా నొవోటెల్‌కు వెళ్లాలని ఐపీఎస్ అధికారి కోరితే వక్రీకరించి సానుభూతి కోసం ప్రయత్నించడం పవన్ దిగజారుడుతనానికి నిదర్శనం. కనీసం మానవీయ కోణంలోనైనా మంత్రులపై దాడిని ఖండిస్తున్నట్లు పవన్ ప్రకటిస్తే ఎంత హుందాగా ఉండేది?

అప్పుడేమైంది నీ నోరు..?

కాపు నేత ముద్రగడ పద్మనాభం కుటుంబంపై ఆసుపత్రిలో హత్యాయత్నం జరిగినప్పుడు పవన్ ఎందుకు మాట్లాడలేదు? పరామర్శ కోసం వచ్చిన చిరంజీవి, దాసరి నారాయణరావును రాజమహేంద్రవరం నుంచి గత సర్కారు వెనక్కి పంపినప్పుడు పవన్ నోరేమైంది? తునిలో రైలు దగ్ధం ఘటనకు సంబంధించి కాపులపై టీడీపీ సర్కార్ అక్రమంగా బనాయించిన కేసులను ఉపసంహరించింది సీఎం జగన్ కాదా? పేదలకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని 2014లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక దాన్ని తుంగలోకి తొక్కితే పవన్ అప్పుడేమయ్యారు? ఇప్పుడు సీఎం జగన్ మాట మేరకు రూ.పది వేల కోట్లు వ్యయం చేసి 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇవేవీ పవన్ కంటికి కనపడవా? అధికారంలోకి వస్తే కోనసీమకు అంబేడ్కర్ పేరు పెడతామని చంద్రబాబుతోపాటు పవన్ ప్రకటించలేదా? ఇప్పుడు సీఎం జగన్‌ను అభినందించకపోగా దళిత మంత్రి, బీసీ ఎమ్మెల్యే ఇళ్లపై టీడీపీ, జనసేన కార్యకర్తలతో దాడులకు ఉసిగొల్పి ఇళ్లను తగలబెట్టిస్తారా? కాల్‌మనీ సెక్స్ రాకెట్‌తో మహిళల మాన ప్రాణాలు దోచుకున్న వారు, హత్యలు చేసిన వారు పవన్‌కు కనపడరా? మహిళా అధికారి జుత్తు పట్టి దాడికి పాల్పడిన వారు స్వాతిముత్యాలా? 26 జిల్లా కేంద్రాలను రాజధానులుగా చేయాలని అంటున్న పవన్ అదే విషయాన్ని జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పగలరా?

కుల రాజధాని అనలేదా?

2019 ఎన్నికలకు ముందు అమరావతిని కుల రాజధాని అని పవనే విమర్శించారు. కర్నూలే రాజధాని అని ఒకసారి.. విశాఖ తన మనసుకు రాజధాని అని మరోసారి అన్నారు. ఇప్పుడేమో అమరావతే రాజధాని అంటున్నారు. ఎప్పటికప్పుడు మాటలు మార్చడంలో ఆయన స్పెషలిస్ట్. విజయవాడ, తిరుపతి, కర్నూలులో నిర్వహించిన జనవాణిలో 2,481 అర్జీలు వస్తే 1,671 ప్రభుత్వానికి అందచేస్తే రసీదులు పంపిందని నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఇది ప్రజాస్వామ్యానికి విలువ ఇచ్చే ప్రభుత్వమని మీరే ఒప్పుకోవడం సీఎం జగన్ పనితీరుకు నిదర్శనం.

ఎందుకంత భయం?

ఓ రాజకీయ పార్టీగా పోరాటం చేయాలి. కానీ పవన్ లాలూచీ పడతారని ప్రతి ఒక్కరూ అంటున్నారు. జనసేన కార్యకర్తల బాధ కూడా అదే. వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 27 మంది కాపు సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వారంతా మూడేళ్లలో చేసిన మంచిని, కార్యాచరణను చర్చించేందుకు సమావేశమైతే పవన్ కళ్యాణ్‌కు ఎందుకంత భయం?

30 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు


ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు తదితరులు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ (ఎంఎంఈ) ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇటీవల క్యాంపస్‌లో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు సాధించారు. జార్ఖండ్‌లోని ఉక్కు పరిశ్రమైన శ్రీబీర్ ఇండస్ట్రీస్ ప్లేస్‌మెంట్స్‌కు 58 మంది విద్యార్థులు హాజరవ్వగా వారిలో 26 మంది ఎంపికయ్యారు. ఎంపికైవారికి ఆరునెలల పాటు శిక్షణనిచ్చి అనంతరం ఉద్యోగంలో చేర్చుకుంటారు. శిక్షణ కాలంలో నెలకు రూ.15 వేలు స్టైపెండ్‌ను, అనంతరం రూ.3 లక్షల వార్షిక వేతనాన్ని ఇవ్వనున్నారు. మరో ముగ్గురు విద్యార్థులు టీసీఎస్‌కు, ఒక విద్యార్థి 'ఫర్ ఏ' సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఎంపికయ్యారు.

నేడు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన 460 సీట్ల భర్తీకి గాను ఈ నెల 31న ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇందులో జనరల్ కేటగిరీలో 446, స్పెషల్ కేటగిరీలో 14 సీట్లు మిగిలాయి. వీటి భర్తీకి గాను అభ్యర్థులకు ఈ నెల 26నే కాల్ లెటర్లు, మెసేజ్‌లను వర్సిటీ పంపించింది. వర్సిటీ వెబ్‌సైట్‌లో కూడా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉంచి, కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించింది. అభ్యర్థులందరూ ఒరిజినల్ ధృవపత్రాలతో ఈ నెల 31న ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుంది.

పోటీ పరీక్షలు తెలుగు మాధ్యమంలోనూ నిర్వహించాలి


- ప్రధాని మోదీకి కడప ఎంపీ లేఖ

పులివెందుల: ఆంగ్లం, హిందీతోపాటు తెలుగు మాధ్యమంలోనూ పోటీపరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తిచేస్తూ ప్రధాని మోదీకి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లేఖరాశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పలు విద్యార్థి సంఘాలు ఎంపీ దృష్టికి తీసుకురావడంతో ఆయన ఈ లేఖ రాశారు. ఎక్కువ మంది విద్యార్థులు ఆంగ్లం, హిందీ మాధ్యమంలో ఉన్న ప్రశ్నపత్రాన్ని అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ విద్యార్థులు తెలుగు మాధ్యమంలో చదువుకున్నవారే ఎక్కువమంది ఉన్నారని, అందువల్ల పోటీ పరీక్షలను తెలుగు మాధ్యమంలోనూ నిర్వహించాలని కోరారు.



కాపులకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన'లు

- సీఎం జగన్‌కు కాపులు రుణపడి ఉంటారు
- జాతీయ కాపు సమాఖ్య కృతజ్ఞతలు


నరహరశెట్టి శ్రీహరి

పటమట (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలోని పేద కాపు విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలన్న కలను జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా నిజం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరశెట్టి శ్రీహరి కృతజ్ఞతలు చెప్పారు. ప్రపంచంలో 200లోపు ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందిన 81 మంది కాపు విద్యార్థులు విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అర్హులైన వారిని ఎంపిక చేసే ప్రక్రియను కాపు కార్పొరేషన్ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. వందలోపు ర్యాంకింగ్ కలిగిన విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందిన వారికి వంద శాతం, 100 నుంచి 200 మధ్య ర్యాంకింగ్ కలిగిన విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందిన వారికి ప్రభుత్వం 50 శాతం సాయం అందిస్తున్నట్టు చెప్పారు. చరిత్రలో ఎవరూ ఇవ్వనంతగా రూ.50 లక్షల వరకూ సాయం చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి కాపు వర్గాలు రుణపడి ఉంటాయన్నారు. ఇలాంటి పథకాలు కాపులతో పాటు రాష్ట్రంలోని ప్రతిభ కలిగిన విద్యార్థుల వికాసానికి అండగా నిలుస్తాయని శ్రీహరి ప్రశంసించారు.

R.V.R. & J.C. COLLEGE OF ENGINEERING (Autonomous)
NIRF Ranking 201-250 :: NAAC A+ Grade :: Accredited by NBA under TIER-I
Approved by AICTE :: Accredited by NBA :: Affiliated to Acharya Nagarjuna University)
Chowdavaram :: Guntur-522 019 :: Phones: 9440712306 / 9494151684 / 9493239173 / 9849519932 / 9491073317 & 318.
Estd: 1985

B.TECH., SPOT ADMISSIONS

Interested eligible candidates may attend the College immediately along with their certificates for vacant seats in B.Tech., likely to arise out of not-reporting / dropout / unfilled seats for spot registrations for both Category-A and B for the academic year 2022-23.

I-Year B.Tech., courses: CSE (AI&ML), CSE (Data Science), CSBS, ECE, EEE, ME, Civil, Chemical.

II-Year B.Tech., lateral entry: CSE(IOT), EEE, Mechanical, Civil and Chemical.

For tuition fee and other details, visit College website www.rvrjcce.ac.in

DT: 29-10-2022 Sd/- PRINCIPAL

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.